
# మరణించక ముందే మరణించాలి!

తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# మరణించక ముందే మరణించాలి!



రచన & ప్రచురణ : తటవర్తి వీరరాఘవరావు


ప్రథమ ముద్రణ : జూన్, 2023
కాపీలు : 1,000

వెల : రూ. 130/-

పుస్తకముల కొరకు
**తటవర్తి వీర రాఘవరావు**
**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**
**ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812**
email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక

1) మరణించక ముందే మరణించాలి! .............................. 3
2) చనిపోయిన వెంటనే ఏం జరుగుతుంది? ..................... 13
3) పరంలో ఏ ఏ లోకాలు వుంటాయి? .......................... 26
4) "పాపాలు చేసేవారు ఏ లోకానికి వెళ్తారు?" .................. 31
5) నేర్చుకునే జన్మలు - నేర్పించే జన్మలు ....................... 43
6) జనాలోకం దాటాలంటే ఏం చేయాలి? ....................... 50
7) జ్ఞానం సంపాదించుకుంటే? .................................... 61
8) ఊర్ధ్వ లోకాలు చేరుకోవాలంటే ఎటువంటి లక్షణాలు ఉండాలి? ............ 68
9) మానవ జీవిత లక్ష్యం ............................................. 74
10) సత్యలోకం చేరాలంటే? ........................................ 85
11) జనాలోకం దాటితేనే కోరుకున్న జన్మ వస్తుంది ............... 94
12) మరణానంతరం గురించి తెలుసుకుంటే కలిగే లాభాలు ..... 99
13) మరణానంతర జీవితం తెలుసుకుంటే మరికొన్ని లాభాలు ........... 113



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే
**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,***
*తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.*
*సెల్ : 94403 09812, 94901 71853*

# మరణించక ముందే మరణించాలి!

సహజంగా మరణానంతరం ఏమిజరుగుతుందో ఎవరికీ తెలియదు. పెద్దపెద్ద పండితులు కూడా మరణించేవరకే ఎక్కువ చెప్తారు. మరణించిన తర్వాత సింపుల్ గా ఏదో చెప్తారు. అందుచేత ఎవరికీ మరణానంతర జీవితం గురించి సరైన అవగాహనలేదు.

కాని మనం తెలుసుకునే కొద్ది, బాగా అర్థం అయి జీవించి ఉండగా మనం ఎలా ప్రవర్తించాలి? మనలో ఎలాంటి మార్పులు తెచ్చుకోవాలి? మనం ఎలా జీవించాలి? అన్నది బాగా అర్థమవుతుంది.

అందుకే పత్రి గారు ఏదైతే ఇంపార్టెంటో, ఏదైతే అందరికీ అవసరమో, ఏదైతే అందరూ నేర్చుకోవాలో, ఏదైతే అందరూ జీవితంలో ఆచరించాలో, ఏదైతే ప్రతీ ఒక్కరూ ఆచరించి జీవితంలో గొప్ప మార్పులు తెచ్చుకుంటారో అలాంటి విషయాలే బోధిస్తూ వుంటారు, చెప్తూ వుంటారు.

ఇప్పుడు మనం ఆయన చెప్పినటువంటి జ్ఞాన సందేశాలలో ఒక టాపిక్ మీద చెప్పుకుందాం. ఏమిటంటే? “మరణించక ముందే మరణించాలి” అంటే మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో అది మరణించక ముందే తెలుసుకోవాలి.

ఈ విషయం ఆత్మజ్ఞానులకే అవగాహన వుంటుంది. అందుచేత మనం కూడా తెలుసుకుందాం. ఎంత తెలుసుకుంటే, జీవితంలో మనం అంత లాభం పొందుతాం; అందుచేత మరణించిన తర్వాత జరిగే దాని గురించి కొన్ని

విషయాలు తెలుసుకుందాం.

సహజంగా చాలా మంది ఈ విషయం ప్రస్తావించరు. కానీ పత్రిగారి స్థాయిలో వున్న వారు **"మరణించక ముందే మరణించాలి"** అన్న విషయం చెప్పడం జరిగింది. అందుచేత కొంతమంది యోగులు చెప్పిన విషయాలు మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ముఖ్యంగా కబీర్ ఏమన్నారంటే?

**"ఏ చావుకి ప్రపంచం భయపడుతూ ఉంటుందో! దాన్ని పొందడం లోనే నాకు ఆనందం ఉంది" అన్నారు.**

చూడండి ప్రపంచంలో అంతా చావుకి విపరీతంగా భయపడతారు. కారణం చనిపోతారేమోనని, కానీ కబీర్ ఏమంటున్నారంటే? ఆ చావు పొందడంలోనే నాకు ఆనందం వుంది అన్నారు, అంటే చావు నాకు ఆనందం కలిగిస్తుందని చెప్పారు.

పత్రి గారు కూడా ఏమన్నారంటే? "పుట్టుకా సంబరమే! చావూ సంబరమే!" అన్నారు. ఇది ఎవరి విషయంలోనంటే ఆత్మ జ్ఞాని విషయంలో.

ఎవరైనా చావుకు భయపడుతున్నారంటే? వారు చాలా అజ్ఞానంలో ఉన్నట్లే లెక్క. కానీ కబీర్ ఆ చావు పొందటంలో నాకు ఆనందం ఉంది అన్నారు. ఎందుకంటే? చనిపోతే జరిగేది ఏంటో ఆయనకు తెలుసు కాబట్టి. చావు అన్నది లాభం కాబట్టి. అందుచేత ఆత్మజ్ఞాని చావుకు దుఃఖించడు, ఏడవడు.

అందుచేత ఎవరైతే ధ్యానం చేస్తారో! ఈ జ్ఞాన మార్గంలో వున్నారో! పత్రి గారు చెప్పినవన్నీ చేస్తూ ఉంటారో! వాళ్లెవరూ కూడా చావుకి భయపడరు. కారణం చావు వాళ్లకు లాభమే కలిగిస్తుందని తెలుసు కాబట్టి.

ఎందుచేతనంటే? చనిపోయిన తర్వాత లాభం కలిగే పనులే పత్రి గారు అందరి చేత చేయించారు. అందుచేత పత్రి గారు చెప్పినటువంటి పనులు ఎవరైతే నిత్యము చేస్తూ వుంటారో! అసలు వాళ్ళు చనిపోవటానికి బాధపడరు, భయపడరు. కానీ చనిపోతే నష్టపోతాం అనుకున్న వారు భయపడతారు.

చూడండి భార్య మీద మమకారం పెంచుకున్నవాడు, ధనం మీద మమకారం పెంచుకుని ధనాన్ని కూడబెట్టినవాడు, పిల్లల మీద బాగా మమకారం పెంచుకున్నవాడు, ఆ ధనాన్ని, సంపదలు పోగేసుకున్నవాడు, జీవితమంతా

వాటి కోసమే కష్టపడినవాడు, ఇంకా అవే సర్వస్వం అనుకుంటూ, అవే జీవితం అనుకుంటూ వున్నవాడు చనిపోతే ఇవన్నీ వదిలివేయాలి కదా? మరి ఎంత భయపడతాడు? ఎంత బాధపడతాడు! ఒక్కసారి ఆలోచించండి. ఎందు చేతనంటే? వాడి జీవితమంతా వీటి కోసమే వెచ్చించాడు. అదే జీవితం అనుకున్నాడు, జీవితంలో అవే సంపాదించుకున్నాడు, అవే పోగేసుకున్నాడు, అవే చేసాడు. తీరా అన్నీ చేసాక చనిపోతే అవన్నీ వదిలివేయాల్సి వస్తుంది? వాటిని వదవాలంటే? ఎంత భయపడతాడో చూడండి.

కానీ ఎవరైతే తాను ఆత్మ అని తెలుసుకుని, నేను కొన్నాళ్లే ఈ భూమి మీద వుంటాను అని అర్థం చేసుకుని, కొన్నాళ్ళు పోయిన తర్వాత ఈ శరీరం నేను వదిలివేయాల్సి వస్తుంది అని తెలుసుకుని, ఇవన్నీ తాత్కాలికం అనుకుంటూ, వాటికి అంత ప్రాముఖ్యం ఇవ్వకుండా తన వారితో వుంటాడో, వాటితో వుంటూ ఈ శరీరంతో ఆత్మ లాభం కోసం చేయవలసిన సాధనలు చేస్తాడో! అంటే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చేస్తాడో! సాత్వికమైన శాకాహారం తీసుకుంటూ, జ్ఞానవంతమైన పుస్తకాలు చదువుతూ, ఈ జ్ఞానాన్ని బోధించే వారి సాంగత్యం చేయడం వల్ల, ఈ ఆత్మ మార్గంలో సేవలు చేయడం వల్ల జ్ఞానం సంపాదించుకోవడం వల్ల ఆత్మ అయిన వాడికి ఎంతో లాభం చేకూరుతుంది.

ఎందుచేతనంటే? ఇటువంటి పనుల వల్ల వారు చనిపోయినా ఇప్పుడున్న స్థితి కంటే, ఇంకా ఉన్నత స్థితి అంటే ఇంకా గొప్ప స్థితి వాళ్ళు పొందుతారు. వారికి తెలుసు శరీరంతో నేను చేయవలసినవన్నీ చేసాను, ఇంక ఈ శరీరం వదిలేసినా నాకు ఏమీ నష్టం లేదు, తర్వాత చేయవలసినవి నేను చేసుకుంటాను అని నిర్ణయించుకుని, చనిపోయిన తరువాత వారిని తీసుకు వెళ్లడానికి వచ్చిన సహాయకులతో పై లోకాలకు వెళ్ళిపోతారు. అక్కడ చేయవలసిన పనులు చేసుకుంటారు.

అందుకే కొంతమంది ఆత్మజ్ఞానులు చనిపోయే ముందు చెప్పి మరీ చనిపోతారు. నా పని అయిపోయింది, ఇంక నేను వేరే కార్యక్రమాలకు వెళ్ళిపోతున్నాను అని ముందే చెపుతారు. చనిపోవడానికి వాళ్ళేమీ బాధపడరు. కారణం చావు వారికి లాభం కలిగిస్తుంది కనుక. అందుచేత పుట్టుక ఎంత

సంబరమో! వారికి చావు కూడా అంతే సంబరం.

అందుకే పత్రి గారు **"ఆత్మజ్ఞానికి పుట్టుకా సంబరమే! చావు సంబరమే!"** అంటారు. ఆయన ఈ విషయం ఎన్నో సందర్భాలలో చెప్పారు. చావు మనకు మంచిదే, చావు మనకు లాభమే అన్న విషయం పత్రి గారు చెప్పడానికి కారణం మనల్ని ఆ భయం నుండి బయటపడవేయడానికే!

ఎవరైనా చనిపోతే వెంటనే సార్‌కి ఫోన్ చేస్తారు. వాడు పోయాడండి అంటారు. ఊ పోనీవయ్యా.. దానికి ఏముంది? చేయవలసినది చేసాడు, గొప్పగా చేసాడు, ఇంకా ఇంతకన్నా గొప్ప పనులు చేయడానికి వెళ్ళిపోయాడు అంటారు. పాత షర్టు తీసి కొత్త షర్ట్ వేసుకునే దానికి బాధపడటం దేనికి? అంటారు. భగవద్గీతలో కూడా అదే చెప్పబడింది కదా అని చెప్తారు.

అందుచేత జ్ఞానం సంపాదించుకున్నవారు, ధ్యాన మార్గంలోకి వచ్చిన వారు, ఈ మార్గంలో కృషి చేసే వారు చావుకు భయపడాల్సిన పని లేదు.

అందుకే పత్రీజీ ఆత్మ అయిన మనం లాభం పొందటానికి మన చేత ఎన్నో సేవలు చేయిస్తారు, ఎన్నో ప్రాజెక్టులు పెట్టిస్తారు. ఆ ప్రాజెక్టుల్లో మనందరినీ పాల్గొనమంటారు. ఇవన్నీ ఆత్మకి లాభం కలిగించే సేవల క్రిందకే వస్తాయి. వాటిల్లో పాల్గొని మనం ఎంత చేస్తామో ఆత్మకు అంత లాభం.

కానీ కొంతమంది ఏమిటి పత్రి గారు మన చేత ఇవన్నీ చేయిస్తున్నారు అని అనుకుంటారు. కానీ ఇవన్నీ చేయడం వల్ల ఆత్మ అంటే మనం ఎంతో లాభం పొందుతాము. మరి ఆయన పెద్ద పెద్ద పిరమిడ్ ధ్యాన కేంద్రాలు స్థాపింప చేశారు. ఇంకా చిన్న చిన్న పిరమిడ్లు ఎన్నో కట్టిస్తున్నారు. పి.ఎం.సి. పెట్టించారు. వీటన్నిటిలో పాల్గొంటూ ఈ సత్య జ్ఞానాన్ని ప్రపంచమంతా బోధించి, అందరినీ జ్ఞానవంతులుగా చేయాలనే ఆయన లక్ష్యం.

భూమ్మీద మానవులకి తప్పు ఏంటో తెలియదు, మంచి ఏంటో తెలియదు. తప్పులు చేస్తూ అదే గొప్ప అనుకుంటారు. కానీ అది అనుభవించే సమయం వచ్చే సరికి విలవిలలాడి పోతారు. అందుచేత అలాంటి వారందరి కళ్ళు తెరిపించడానికి పత్రి గారు భూమి మీదకు వచ్చారు.

ఆయన జీవహింస చేయకూడదని స్పష్టంగా చెబుతున్నారు. ఏ కోడినీ, ఏ మేకనీ చంపకు. అవీ ఆత్మలే, అవి కూడా నీ స్వరూపాలే అని తెలుసుకో,

జ్ఞానం పెంచుకో అని చెపుతారు. కానీ కొంతమంది మాంసం తినకపోతే ఎలా? మనకు బలం వుండాలి, పౌరుషం వుండాలి, మాంసం తినకపోతే పౌరుషం ఎలా వస్తుంది? ఏమీ తినకపోతే దద్దమ్మల్లా వుండిపోతారు. దేశమే నాశనమైపోతుంది. సరిహద్దులు ఎవరు రక్షిస్తారు? అని అంటారు. అలా మాంసాన్ని తినమని ప్రోత్సహించేవారు వున్నారు. మరి వారు ఎన్నో ఉపన్యాసాలు చెబుతారు. కానీ ఆ జీవులు కూడా ఆత్మ స్వరూపమే, దైవ స్వరూపమే, భగవంతునిలోని భాగాలే, అందులో వున్నదీ ఆ భగవత్ స్వరూపమే అని వారికి ఎందుకు అర్థం కాలేదో మనకు అర్థం కాదు.

అసలు అందరూ పత్రి గారు చెప్పినట్లు శాకాహారులై ధ్యానం చేస్తే ఈ యుద్ధాలు ఎందుకు వుంటాయి? ఈ గొడవలు ఎక్కడ వుంటాయి? అసలు ఈ సైన్యం ఎందుకు? దేశ రక్షణ కోసం ఇన్ని లక్షల కోట్లు ప్రపంచ వ్యాప్తంగా ఖర్చు పెడుతున్నారే ఆ డబ్బంతా అభివృద్ధి మీద పెడితే ఎంత అభివృద్ధి చెందుతుంది ప్రపంచం. ఈ ద్వేషాలవల్లే కదా? ఈ కక్షల వల్లే కదా? ఈ భయం వల్లే కదా? డబ్బంతా దానికి తగలేస్తున్నారు. అదే చెప్తున్నారు పత్రి గారు.

అంతా ఒకటే అనే భావంలోకి వస్తే ద్వేషాలు ఎక్కడ వుంటాయి? ఇంక యుద్ధాలు ఎక్కడుంటాయి? అందుచేత అంతటి గొప్ప మహాత్ముడు పత్రి గారు భూమ్మీదకు వచ్చి ఎన్నో విషయాలు చెప్పారు. అందులో ముఖ్య విషయం ఏమిటంటే? "మరణించక ముందే మరణించాలి" అంటే మరణించిన తరువాత జరిగే దాని గురించి జీవించి వున్నప్పుడే తెలుసుకోవాలి. అది తెలుసుకున్న వారికి చావంటే భయముండదు. వారికి చావు కూడా సంబరమే అవుతుంది.

పరమయోగి కబీర్ ఏమన్నారంటే! **"ఏ చావుకు ప్రపంచం భయపడుతూ వుంటుందో! దాన్ని పొందడంలోనే నాకు ఆనందం వుంది"** అన్నారు. అంత గొప్పవాడు నాకు చావు ఆనందాన్ని కలిగిస్తుందని చెప్తున్నారు. మరి మనకెందుకు దుఃఖం కలుగుతుంది? మనకెందుకు భయం కలుగుతుంది? మనం ఎందుకు విలవిలలాడి పోతున్నాము? ఏమిటీ తేడా? అంటే ఆయన అపార జ్ఞాన సంపన్నుడు, మనము అజ్ఞానంలో వున్నాము అంతే తేడా.

అలాగే సిక్కుల గురువైన 'గురునానక్ సాహెబ్' కూడా ఏమన్నారంటే?

**"జీవన్మరణం ప్రాప్తించే యోగం కోసమే మనమంతా పాటుపడాలి"** అన్నారు.

అంటే పత్రీజీ చెప్పినట్లు జీవించి వుండగానే మరణించాలి అన్నారు. అలాంటి యోగాన్ని అభ్యసించాలి. అంటే మరణాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలన్నారు. అంటే ధ్యానం ద్వారా అతీంద్రియ శక్తులు సంపాదించుకోవాలి, అంటే దివ్యనేత్రం సంపాదించు కోవాలి, సూక్ష్మ శరీరయానం చేయగలగాలి. వాటి ద్వారా మరణించిన వారు వెళ్ళే లోకాలకు వెళ్లి రాగలగాలి, ఆ లోకాలలోని విషయాలన్నీ తెలుసుకోగలగాలి. దీనినే "జీవన్మరణ యోగాభ్యాసం" అంటారు.

అలాగే బైబిల్‌లోని సెయింట్ పాల్ సువార్తలలో ఏం చెప్పబడింది అంటే? "నేను నిత్యము మరణిస్తూనే వుంటాను" అంటే అతీంద్రియ శక్తుల ద్వారా మరణించిన వారు వెళ్ళే లోకాలకు నిత్యము వెళ్లి, ఆ విషయాలు తెలుసుకోవడం అని చెప్పడం జరిగింది.

అలాగే ఓ మహమ్మదీయ మహాత్ముడు ఏం చెప్పారంటే?

**"మరణానికి ముందే మరణించడం నేర్చుకో!"** అన్నారు.

ఆలోచించు! నువ్వు మరణిస్తే ఇప్పుడున్నవి ఏముంటాయి? అంటే ఏది నీకూడా వస్తుంది? అంటే ఏదీ రాదు. అందుచేత జీవించి వున్నప్పుడు కూడా ఇవేవీ నావి కాదు అన్నది అర్థం చేసుకోవాలి. అలాగే జీవించగలగాలి. అంతేకానీ ఇవన్నీ నావి అన్నట్లుగా జీవిస్తే వాటి కోసం తప్పులు చేస్తారు, పాపాలు చేస్తారు, చేయకూడని పనులు చేస్తారు, జీవితాన్ని ఎంతో నష్ట పెట్టుకుంటారు.

కానీ ఎప్పుడైతే ఇది తెలుసుకుంటారో! అంటే మరణించిన తర్వాత వీటన్నిటినీ వదిలివేయవలసి వస్తుంది, వీటితో నాకు ఏ సంబంధం ఉండదని తెలుసుకుంటారో అప్పుడు వేటి మీద వ్యామోహం పెరగదు.

అంటే మరణించక ముందే మరణించడం నేర్చుకుంటున్నామని అర్థం. అందుచేత ఏది వున్నా అవి వుండవు, నావి కావు అన్నట్లుగా వుండాలి. అప్పుడు వాటిని సంపాదించడానికి పాపాలు చేయరు. భార్య కోసం, పిల్లల కోసం పాపాలు చేయరు, తప్పులు చేయరు, ధర్మంగా నడుచుకుంటారు. ఉన్నన్ని రోజులు ఎవరితో లేనిపోని గొడవలు పెట్టుకోరు, ఎవరినీ హింసించరు, వేటిని

చంపరు.

ఇవన్నీ ఎప్పుడు చేస్తారు? అంటే 'మరణించ ముందే మరణించడం' నేర్చుకున్నప్పుడు.

నా విషయంలో జరిగిన చిన్న సంఘటన చెప్తాను. ఈ మధ్యే నాకు కరోనా వచ్చింది. పిల్లలు ఏం చేసారంటే? ఇక్కడ కాదు హైదరాబాద్‌లో వైద్యం బాగుంటుంది అని చెప్పి హైదరాబాద్ తీసుకుని వెళ్లారు. వేము బయలుదేరుదామని ఇంట్లో అన్నీ సర్దుతూ వుంటే నాకు ఏమనిపించింది అంటే వీటితో నాకు రుణం తీరిపోయిందేమో! ఇవన్నీ చూడటం ఇదే ఆఖరేమో! అనే భావన కలిగింది.

ఆలోచించండి నిజంగా నేను కరోనా వల్ల చనిపోతే! అన్నీ పోయినట్లే కదా? అని అనిపించింది. కాసేపు ఏమనుకున్నానంటే ఓర్నీ వీటి కోసమా! ఇంతకాలం ఆరాటపడింది? అని అనిపించింది. నాకు కాసేపు హైదరాబాద్ వెళుతున్నట్టు లేదు, అవన్నీ వదిలేసి పైకి వెళుతున్నట్లుగా అనిపించింది. కానీ మరల ఇంకో ఆలోచన! మనం భూమి మీద చేయవలసిన పని ఇంకా ఏమైనా వుంటే మళ్ళీ వస్తాం. మనం చేయవలసిన పని ఏదీ లేకపోతే అక్కడి నుంచి అలాగే వెళ్ళిపోవాల్సి వస్తుందని అనుకున్నాను.

పత్రిగారు చెప్తారు కదా? నువ్వు చేయవలసిన పని ఏమైనా వుంటే నువ్వు వెళ్ళాలనుకున్నా వెళ్ళవు. నువ్వు చేయవలసిన పని అయిపోతే నువ్వు వుండాలనుకున్నా వుండవు. ఈ విషయం మీద అవగాహన ఎంత ఉంటే? మీరు అంత దుఃఖం లేకుండా వుంటారు. లేకపోతే అన్నిటికీ దుఃఖమే.

అందుచేత కరోనా వచ్చిందంటే? చచ్చిపోతామోనని భయపడటం కాదు. నా రుణం తీరిపోయింది, ఇంక నేను చేయవలసినపనులన్నీ అయి పోయాయేమో అని అనుకోవాలి, అప్పుడు దుఃఖం ఎక్కడ వుంటుంది?

అందుచేత ఒక మహమ్మదీయ మహాత్ముడు ఏమని చెప్పాడంటే? **"మరణానికి ముందే మరణించడం నేర్చుకో"** అని చెప్పాడు.

అలాగే దాదు మహాత్ముడు ఏమన్నారంటే? **"ప్రాణం వున్న శవంలా జీవించడం నేర్చుకో!"** అన్నారు.

మనం నిజంగా శవమే! కానీ ప్రాణం వుంది. శవం ఎలా వుంటుందో!

ప్రాణం వున్నప్పుడు కూడా అలా వుండగలగాలి. అంటే ప్రాణం వున్న శవంలా జీవించగలగాలి. మీ ప్రవర్తన అలా వుండాలి.

ఆయన ఏమన్నారంటే? **"ప్రాణమున్న శవంలా జీవించడం నేర్చుకో! అప్పుడే నీకు ప్రభు దర్శనం అవుతుంది, అంటే ఆత్మ దర్శనం అవుతుంది"** అని అన్నారు. శవం ఏమి చేస్తుంది? అక్కడ ఎవరు వున్నా పట్టించుకోదు. ఎవరు ఏమి చేస్తున్నా స్పందించదు. ఒక రకంగా చెప్పాలంటే చంటి పిల్లవాడితో పోల్చుకోవచ్చు. చంటిపిల్లవాడికి కూడా ప్రాణం వుంటుంది. కానీ అక్కడ ఎవరు ఏం చేస్తున్నా అంటే తిట్టుకుంటున్నా, గొడవలు పడుతున్నా వాడికి అనవసరం. అలా చూస్తూ సాక్షీభూతంగా వుండిపోతాడంతే! అలాంటి వారికి కోపాలు, పగలు, ప్రతీకారాలు, కక్షలు, ద్వేషాలు, అసూయ లాంటివి వుండవు. ఆ రకంగా జీవిస్తే వేటి మీద భ్రాంతి, ఆంకాంక్ష, మమకారం, వ్యామోహం వుండవు. వేటితో నాకు ఏ సంబంధం లేదు అన్నట్టుగా వుంటారు.

చూడండి రైలు ప్రయాణంలో ప్రయాణ గమ్యం చేరితే ఎవరైనా రైలు దిగిపోతారు. అలాగే జీవిత ప్రయాణం పూర్తయితే ఎవరైనా శరీరం వదిలి వేసి వెళ్ళిపోతారు. అక్కడ ట్రైన్ వదిలి వెళ్ళిపోయినట్టు! ఇక్కడ శరీరం వదిలివెళ్ళిపోతారు. తరువాత ట్రైన్ గురించిన ఆలోచనే వుండదు. అలాగే పైకి వెళ్ళిన వారికి భూమి మీద సంసారంతో కానీ, సంపదలతో కానీ ఏ సంబంధం వుండదు. అందుచేత ఎవరైనా సరే తనకు వున్నవి తనవి కావు అన్నట్టుగా జీవించగలగాలి.

చూడండి మహాభారతంలో అభిమన్యుడు చనిపోయి పై లోకాలకు వెళ్ళిపోయాడు. అర్జునుడు బాధపడుతుంటే? శ్రీ కృష్ణుల వారు అర్జునుని సూక్ష్మ శరీరంతో అభిమన్యుడు వుండే లోకాలకు పంపాడు. అర్జునుడు ఆ లోకానికి వెళ్ళి అడిగితే అభిమన్యుడు నీకు నాకు సంబంధం ఏమిటి? నీలాంటి తండ్రులు ఇంతకముందు ఎంతో మంది వున్నారు. అని అంటే? అర్జునునికి మతి పోయింది, తిరిగి వెనక్కి వచ్చేసాడు. అంటే అభిమన్యుడు అర్జునునితో ఏ సంబంధం లేనట్టుగా ప్రవర్తించాడు.

అప్పుడు శ్రీ కృష్ణునితో అర్జునుడు నాకు అర్ధమైంది. నువ్వు చెప్పినట్లు నేను చేస్తాను అన్నాడు. అపుడు అర్జునుడు అభిమన్యుడు గురించి

ఆలోచించకుండా యుద్ధంలో పాల్గొన్నాడు.

అలాగే భూమి మీద కూడా ఎవరికైనా చనిపోయిన తరువాత భార్య, భర్త, తల్లి, తండ్రి ఎవరి మీద దృష్టి వుండదు. పై లోకాలకు వెళ్ళాక వారి పని వారు చూసుకుంటారు. చూడండి రైల్లో బెర్త్ వదిలేసి దిగిపోతే బెర్త్ మీద ఎలా దృష్టి వుండదో! అలాగ.

అందుచేత నాది, నాది అనే వారు ఏదీ నాదీ కాదు అని అర్థం చేసుకోవాలి. ఉన్నవన్నీ నీవని అనుకుంటావు, భ్రాంతి పడతావు, కానీ ఏదీ నీది కాదని తెలుసుకోవాలి. అందుచేత నాది అన్నవాడు మూర్ఖుడు, అజ్ఞాని. ఎందుచేతనంటే? భూమి మీద నాది అన్నది ఏదీ లేదు. ఇక్కడ ఉన్నవన్నీ, ఉన్నదంతా ఆ భగవంతుడిదే, ఊరికే నువ్వు భూమి మీదకు, కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి వచ్చావు. జీవిస్తూ అనుభవిస్తున్నావు. అంతే ఏదీ నీది కాదు. నీది అయితే కూడా పట్టుకు వెళ్తావు, నీది కాదు కాబట్టే అన్నీ ఇక్కడే వదలి పెట్టేస్తున్నావు.

మరి ఏది నీది ? అంటే ఈ శరీరంతో ఉన్నప్పుడు చేసే కర్మ ఫలితాలు అంటే పాప పుణ్యాల ఫలితమే నీది, దానినే నువ్వు తీసుకు వెళ్లగలవు! ఒకవేళ నువ్వు జ్ఞానం సంపాదించు కుంటే! ఆ జ్ఞానం... కూడా తీసుకు వెళ్ళగలవు.

అంతేకానీ భూమి మీద వున్నవి ఏవీ నీవి కావు, కూడా తీసుకు వెళ్ళలేవు. వాటి కోసం గొడవలు పడ్డా! మోసాలు చేసి, తప్పులు చేసి అధర్మంగా ప్రవర్తించి, పాపాలు చేసి ఎంత సంపాదించినా... సంపాదించినవి ఏవీ కూడా రావు. కానీ వాటిని సంపాదించడం కోసం చేసిన పాపాల ఫలితం మాత్రం కూడా వస్తుంది. భవిష్యత్తులో వాటి ఫలితం దుఃఖం రూపంలో అనుభవించ వలసి వస్తుంది.

అలాగే కూడా రాని వాటి కోసం చిన్న విషయాలకు గొడవలు పడితే! ఎంతో దుఃఖానికి లోనుకావలసి వస్తుంది? ఎంతో నష్టపోతారు కూడా! కోర్టులు దాకా వెళ్తారు. ఇలా ఎన్నో చూస్తున్నాం.

భూమి మీద నాది అన్నది ఏదీ లేదన్న విషయం ఎవరికీ తెలియట్లేదు. కానీ ఇది ఎవడైతే తెలుసుకుంటాడో! వాడే జ్ఞాని. నీకు తినడానికి, ఉండటానికి

వుందా లేదా? అవసరానికి సరిపడా వుందా? లేదా? అన్నది చూసుకోండి. కోట్లు వున్నాయా? లేదా? బంగళాలు వున్నాయా? లేవా? కార్లు వున్నాయా? లేవా? అన్నది అనవసరం.

ఏం చేసుకుంటారు ఇవన్నీ, ఏదీ వుండదు, ఏదీ శాశ్వతం కాదు. ఇది అర్థం చేసుకోవాలి, తెలుసుకోవాలి. అందుకే కొంతమంది జ్ఞానమున్న వారు ఏమంటారంటే? ఎందుకురా బాబూ; ఇవన్నీ నువ్వు మోసుకుపోతావా? కూడా పట్టుకుపోతావా? అంటారు.

అప్పుడు వీడు ఏమంటాడంటే? ఉన్నంతకాలం వుంటాయి కదండీ? అంటాడు. అలా అంటాడు కానీ, ఉన్నంత కాలం ఉండటానికి ఎంత కావాలి? ఎన్ని కోట్లు కావాలి? ఎన్ని బిల్డింగులు కావాలి? ఎన్ని వందల ఎకరాలు కావాలి? ఆలోచించడు. ఊరికే గొప్పల కోసం కాకపోతే! అసలు ఉన్నంతకాలం ఏముండాలి? ఉండటానికి ఒక ఇల్లు ఉండాలి, కట్టుకోవడానికి బట్ట ఉండాలి, తిండి ఉండాలి, ఒక తోడు ఉండాలి. అసలు ఉన్నంతకాలమూ ఉండాలని చూస్తున్నాడు కానీ చేయవలసిందేమిటో ఆలోచించడం లేదు.

అసలు నేనెవరు? ఎక్కడి నుంచి వచ్చాను? మరల ఎక్కడికి పోతాను? అసలు నేను చేయవలసింది ఏమిటి? నా జీవిత లక్ష్యం ఏమిటి? అన్నవి ఆలోచించాలి. తనకున్న సమయం వీటికి వెచ్చించాలి. అంతేకానీ ఉన్నంత కాలం వుంటాయి అనుకుంటూ, ఉండని వాటిని సంపాదించడానికే జీవితమంతా వెచ్చిస్తే చివరికి వీడి పరిస్థితి ఏమిటి?

అందుచేత ఇది బాగా అర్థం చేసుకోండి. తాను భూమి మీద కొంతకాలమే ఉంటాడని, శాశ్వతంగా ఉండడని తెలుసుకోవాలి. తనకంటే ముందు వచ్చిన వాళ్ళు ఎంతో మంది చనిపోయారు. అలాగే తాను కూడా ఎప్పుడో ఒకప్పుడు చనిపోవలసిందే అన్నది తెలుసుకోవాలి.

అందుచేత గొప్ప వాళ్ళు చెప్పే సందేశాలు తెలుసుకోవాలి. దానికి అనుగుణంగా జీవించాలి. మన జ్ఞానం పెరిగే కొద్దీ ఇవన్నీ అర్థం చేసుకుంటాము. దానికి అనుగుణంగా జీవిస్తాం, అదృష్టవంతులు అవుతాం.

# చనిపోయిన వెంటనే ఏం జరుగుతుంది?

పత్రిగారు లాక్‌డౌన్‌లో 100 ఎపిసోడ్లు చెప్పడం జరిగింది. అందులో 70, 80 ఎపిసోడ్లు ఆత్మజ్ఞానం గురించే చెప్పారు.

ఆ సందర్భంగా పత్రిగారు ఏమన్నారంటే "మరణించక ముందే మరణించాలి" అన్నారు. దాని అర్థం మరణించిన తరువాత జరిగే దాని గురించి మరణించక ముందే తెలుసుకోవాలని.

పత్రి గారి లాగ మనం కూడా మూడో కన్ను సంపాదించుకోగలిగితే, ఆ విషయాలన్నీ మనకు అనుభవంలోకి వస్తాయి.

అందుచేత ఈ విషయాలు కొన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

చూడండి మనమంతా మానవులం. మానవుడు అంటే శరీరం. మనస్సు, ఆత్మ మూడు కలిసి వుంటాయి. ఆత్మ అయిన మనము శరీరాన్ని ధరించాము. శరీరం ధరించక ముందు ఆత్మలము. శరీరం ధరించాక మానవులము అయ్యాము.

ఆత్మ శరీరంలో నుంచి తప్పుకుంటే ఆ శరీరాన్ని శవము అంటారు, చనిపోయాడు అంటారు, ప్రాణం పోయింది అంటారు. అందుచేత ఆత్మ వుంటేనే వాడు జీవించి వున్నట్టు. ఆత్మ శరీరంలో నుంచి నిష్క్రమిస్తే వాడు చనిపోయినట్టు.

ఆత్మ ఈ శరీరంలో ఎలా వుండగలిగింది? అంటే ఈ శరీరానికి ఆత్మకి మధ్యలో ఒక కనెక్షన్ ఉంది. దానినే 'సిల్వర్ కార్డ్ అంటే వెండి తీగ' అంటారు. ఆ కనెక్షన్ వున్నంతసేపు ఆత్మ శరీరంలో వుండి పనులు జరిపిస్తుంది. ఎప్పుడైతే ఆ సిల్వర్ కార్డు కట్ అయిపోతుందో! అప్పుడు శరీరంలో ఆత్మ వుండలేదు. మరి సిల్వర్ కార్డు ఎందుకు కట్ అవుతుంది? అంటే వాడు ఇన్ని సంవత్సరాలు భూమి మీద జీవించాలని పై లోకంలో నిర్ణయించుకుని వస్తాడు. దానినే ఆయుష్షు అంటారు. ఆయుష్షు తీరిపోతే ఏదో కారణంతో సిల్వర్‌కార్డు కట్ అయిపోతుంది. లేకపోతే కారణం ఏదైనా కావచ్చు. సిల్వర్ కార్డు కట్ అయిపోవడం వల్ల ఆత్మ శరీరంలో వుండలేదు, బయటకు వచ్చేస్తుంది.

అలా ఎవరైనా ఇంట్లో చనిపోతే! చనిపోయిన వారి ఆత్మ శరీరం నుండి బయటకు వస్తుంది. అలా బయటకు వచ్చిన ఆత్మ ఆ గదిలోనే...

సీలింగ్ పై నుండి క్రిందకు చూస్తుంది. చనిపోయింది పురుషుడు అయితే పై నుంచి క్రింద వున్న తన శరీరాన్ని తాను చూసుకుంటాడు, ఆశ్చర్యపోతాడు. అదేమిటి నేను ఇక్కడా వున్నాను? అక్కడా వున్నాను. ఇంతకీ మంచం మీద వున్నది నేనా? ఇలా గాలిలో తేలుతున్నది నేనా? అని కాసేపు కంగారు పడతాడు, గందరగోళ పడతాడు.

కారణం వాడు అలా చూడటం అదే మొదటి సారి కాబట్టి. కారణం అప్పటి దాకా ఆ శరీరమే తాను అనుకున్నాడు. కానీ ఇప్పుడు తాను పైన గాలిలో వున్నాడు, క్రింద మంచం మీద శరీరం వుంది. మొత్తం మీద క్రింద కదలకుండా మంచంమీద వున్న శరీరం నేను కాదు. గాలిలో వున్న ఆత్మే నేను అని తెలుస్తుంది. అలా మొట్టమొదటిసారిగా శరీరం తాను కాదు, ఆత్మ తాను అని తెలుస్తుంది. అది తన శరీరమే కానీ, తాను కాదు అన్న సంగతి తెలుసుకుంటాడు.

జీవితంలో చాలా మందికి ఈ విషయం చనిపోయిన తర్వాత మొదటిసారిగా తెలుస్తుంది, ఆశ్చర్యపోతారు. కారణం అప్పటి దాకా ఆ శరీరమే తాను అనుకుని శరీరానికి ప్రాముఖ్యం ఇచ్చాడు, శరీరం కోసమే కష్టపడ్డాడు, జీవించాడు, ఏమి చేసినా శరీరం కోసమే చేసాడు. అంతకు ముందు ఆత్మ అన్నది ఒకటి వుంటుంది అన్న సంగతి కూడా తెలియదు. అందుకే అంత ఆశ్చర్యంగా వుంటుంది.

కానీ చాలా మందికి అంటే ధ్యాన మార్గంలోకి వచ్చిన వారికి ఈ విషయం చనిపోక ముందే తెలుస్తుంది. ఏమని అంటే? “నేను దేహం కాదు, నేను ఆత్మను” అన్న విషయం.

కానీ మిగతా వారు ఆశ్చర్యపోతారు. అరె ఇప్పటి దాకా ఆ కదలని శవమైపోయిన దేహమే నేను అని అనుకున్నాను, దానికే ప్రాముఖ్యం ఇచ్చాను, దాని కోసమే ఎంతో కష్టపడ్డాను, అసలు ఈ శరీరం నేను కాదు అన్న విషయం తెలుసుకోలేకపోయాను అని అనుకుంటాడు. ఎంతసేపూ శరీర రోగాలను తగ్గించుకోవడానికి చూసుకున్నాడు, శరీరం ఆరోగ్యంగా వుండటానికి చూసుకున్నాడు, శరీర అందం, శరీర సౌష్టవం గురించే చూసుకున్నాడు. కానీ ఆత్మ అయిన తన గురించి ఆలోచించలేదే అని తెలుసుకుంటాడు.

కానీ ధ్యాన మార్గంలోకి వచ్చిన వారిలో కూడ చాలా మంది ఆత్మ గురించి తెలుసుకున్నా, ఆత్మే తానని తెలుసుకున్నా కూడా దేహమే తాను అన్నట్టుగా జీవిస్తారు, దేహానికే ప్రాముఖ్యం ఇస్తారు.

అలా వీరు ఆత్మ గురించి తెలుసుకున్నా అర్థం చేసుకోరు. బ్రతుకంతా శరీరం కోసమే పాటుపడతారు. ఆత్మను పట్టించుకోరు, ఆత్మ గురించి ఏమీ చెయ్యరు. అలాంటి వారు అంటే ఈ ఆత్మజ్ఞానం లేనివారు శరీరం వదిలినప్పుడు అంటే చనిపోయినప్పుడు చాలా గందరగోళ పడతారు.

కారణం తాను పైన వున్నాడు, క్రింద శరీరం వుంది. అప్పుడు అనుకుంటాడు మనకు ఈ విషయం ముందే చెప్పారు, కానీ నేను పట్టించుకోలేదు. కానీ ఆ మాష్టర్లు చెప్పింది నిజమేనన్నమాట అని అప్పుడు అర్థం చేసుకుంటాడు, కానీ అప్పటికే అంతా అయిపోతుంది.

వీడి శరీరంలో కదలికలు వుండవు. ప్రక్కనే వున్న భార్యకి కాసేపటికి అనుమానం వస్తుంది, ఏమిటి ఈయన కదలట్లేదు? అనుకుంటూ అటూ, ఇటూ కదుపుతుంది. ఎటు కదిపినా అటే వుండిపోతాడు. ఆవిడకి చనిపోయాడా? అని అనుమానం వస్తుంది. భయమేస్తుంది. వెంటనే గట్టిగా ఏడుస్తుంది. ఆ ఏడుపు విని ఇంట్లోని వారు వస్తారు. వారిలో ఒకడు డాక్టరు దగ్గరకు వెళ్తాడు. అలా భార్య రోదిస్తూ వుంటుంది. అలా తన భార్య ఏడుస్తూ వుంటే? పైన వున్న వీడు ఆవిడ దగ్గరకు వెళ్తాడు. భార్యతో అంటాడు.. ఎందుకు ఏడుస్తావే? నేను ఇక్కడే వున్నాను కదా? అని అంటాడు. వీడు ఎంత చెప్పినా ఆవిడ పట్టించుకోదు. ఆవిడ ఏడుపే ఆవిడది. అలాగే ఎవరూ వీడిని పట్టించు కోకపోతే అది కూడా ఆశ్చర్యమే. కారణం తాను అక్కడే వున్నాడు. కానీ తన వాళ్ళంతా తాను పోయానని ఏడుస్తూ వుంటారు. అసలు తానుండగా వాళ్ళు ఎందుకు ఏడుస్తున్నారు? అర్థం కాదు.

వాడు అనుకుంటాడు నేను ఇంతలా చెప్తున్నా వినడం లేదేమిటి? అసలు నా మాట పట్టించుకోవడం లేదేమిటి? అనుకుంటాడు.

ఇంతలో బంధువులు, స్నేహితులు వస్తారు. వారి దగ్గరకు వెళ్ళి వాళ్ళతో వీడు ఏమంటాడంటే? నా భార్య నా మాట వినడం లేదు మీరైనా చెప్పండి అంటాడు. వారు కూడా వీడిని అసలు పట్టించుకోరు. ఇక వీడికి మతిపోతుంది.

ఇదేంటి? నా పరిస్థితి ఇలా అయిపోయింది? ఎంత చెబుతున్నా ఎవరూ వినరు? అని ఆశ్చర్యపోతాడు.

ఇంతకీ విచిత్రం ఏమిటంటే? వీడికి వారంతా స్పష్టంగా కనిపిస్తారు. వారి మాటలు వినిపిస్తాయి. కానీ వారికి ఈయన కనబడడు. ఈయన చెప్పేది వారికి వినపడదు, వాడికి ముందు ఇదేమీ అర్థం కాదు.

ఈ లోపులో డాక్టరు వస్తాడు. నాడి పట్టుకుని చూస్తాడు. వాడు మరణించాడని నిర్ధారించుకుని వారికి చనిపోయాడని చెపుతాడు. అప్పుడు అందరూ ఏడుస్తారు. అందులో కొంతమంది శవాన్ని తీసి ఇంటి బయట పెడతారు, మెల్లి మెల్లిగా దహన సంస్కారానికి ఏర్పాట్లు చేయడం లాంటి పనులు చేసేస్తుంటారు. అవి కూడా వాడికి ఆశ్చర్యం కలిగిస్తాయి. ఈ సమయంలో పై నుంచి ఇద్దరు సహాయకులు వస్తారు. వారినే యమ భటులు అని సినిమాలో చూపిస్తారు.

ఆ సహాయకులు ఏమంటారంటే? బాబూ నువ్వు చనిపోయావు, అందుకే మేము నిన్ను తీసుకు వెళ్ళడానికి వచ్చాము. మనం పై లోకాలకు వెళ్ళాలి నడు అంటారు. వాడు ఇంకా ఆశ్చర్యపోతాడు. అసలు వీళ్ళెవరు? వీళ్ళు నన్ను తీసుకు వెళ్ళడమేమిటి? పై లోకాలు అంటున్నారు. పై లోకాలు ఎక్కడ వున్నాయి? అని అనుకుంటాడు. వాళ్ళని అడుగుతాడు అసలు మీరు ఎవరు? నన్ను ఎక్కడికి తీసుకెళతారు అని అడుగుతాడు? నేను మీతో ఎందుకు రావాలి? నేను రాను అంటాడు. అప్పుడు వాళ్ళేమంటారంటే?

నువ్వు అసలు భూలోకంలో ఉండేవాడివి కాదు, నువ్వు ఆత్మవు, ఆత్మ వైన నువ్వు పైలోకాల నుండి వచ్చావు, అందుచేత మనం పై లోకాలకు వెళ్ళిపోదాం అని చెప్తారు.

అలా చెప్పగానే వెళ్ళిపోతాడా? అంటే వెళ్ళడు. ఎందుచేతనంటే? వాడికి భార్య, పిల్లలు అంటేఎంతో ఇష్టం. వారి మీద వాడికి ఎంతో మమకారం. వుంది, మరి ఎలా వదిలేస్తాడు? వారేకాదు తాను ఎంతో కష్టపడి సంపదించుకున్న ఆస్తులు వున్నాయి, ఎంతో ధనం వుంది, అన్నీ వదిలేసి వెళ్ళాలంటే ఎలా వెళతాడు?

అప్పటి దాకా ఇవన్నీ నావి, ఈ దేహం నేను, వీళ్లంతా నా వారు అనే

భావంతోనే వుండేవాడు. ఎంత సేపూ నేను బాగుండాలి, మా వాళ్ళు బాగుండాలి అన్న ఆలోచనే తప్ప ఇంకొక ఆలోచన వుండేది కాదు.

ఎంతసేపూ నేను డబ్బు సంపాదించాలి, ఇంకా ఆస్తులు బాగా సంపాదించాలి అని అనుకుంటూ అవి అన్నీ సంపాదించాడు. అంతే తప్ప వాడు ఆత్మ గురించి అంటే తన గురించి కొద్దిగా కూడా ఏమీ ఆలోచించలేదు. ఏమీ చేయలేదు. అంతేకాదు వాడి శరీర ఆరోగ్యం కోసం ఎంతో కష్టపడ్డాడు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టాడు.

మరి శరీర సుఖం కోసం డబ్బులు, ఆస్తులు, అంతస్తులు సంపాదించు కోవడం కోసం తప్పులు చేసాడు, పాపాలు చేసాడు, చేయకూడనివి చేసాడు. ఇప్పుడు ఆ సహాయకులు ఏమంటున్నారంటే! నాయనా ఆ శరీరం నువ్వు కాదు, ఆ సంపదలు నీవి కావు, ఇంక వెళదాం పద అంటారు. కానీ అలా నడు అంటే వెళ్ళిపోతాడా? నేను రాను అంటాడు. అప్పుడు సహాయకులు వాడితో సరే మూడు రోజులు ఆగు అన్నీ నీకే తెలుస్తాయి అంటారు.

ఈ లోపులో బంధువులు వాడి శరీరానికి కర్మకాండలు చేసే ప్రయత్నం చేస్తారు. 'కాడి' తయారు చేస్తారు. వాడిని ఆ కాడి మీద పడుకోపెడతారు, తాళ్ళతో కడతారు, దండలు వేస్తారు. వాడికి ఇవన్నీ ఆశ్చర్యంగా కనిపిస్తాయి. మెల్లిగా శవాన్ని తీసుకు వెళుతూ వుంటే! వీడు ఆ శవం కూడా స్మశానానికి వెళ్తాడు. చాలా కంగారు పడతాడు ఏమిటి? నన్ను తీసుకుపోతున్నారు? వద్దు వద్దు అంటాడు. కానీ ఎవరూ వీడిని పట్టించుకోరు. ఆ స్మశానంలో వాడి శరీరాన్ని తగలపెడుతూంటారు. వాడు ఇంకా కంగారు పడిపోతాడు. నన్ను కాల్చకండి అని అరుస్తాడు. కానీ వాడిని ఎవరూ పట్టించుకోరు. వారి పని వారు చేసుకుపోతారు. చితికి నిప్పు అంటిస్తారు. చివరకు శరీరం బూడిద అవుతుంది. ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. వాడు ఒక్కడే వుంటాడు. ఇంకేం చేస్తాడు, మళ్ళీ ఇంటికి వస్తాడు.

అప్పుడు ఆ సహాయకులు ఏమంటారంటే? నాయనా చూడు ఎవరూ లేరు, ఏమీ లేదు. నీ శరీరం కూడా బూడిద అయింది. ఇక భూమి మీద నిన్ను ఎవరూ పట్టించుకోరు అని చెప్తారు. అయినా నేను రాను అంటాడు. సరే ఇంకా కొన్నాళ్ళ వుండు అంటారు.

అలా 11 రోజులు చూస్తారు. అప్పుడు 10వ రోజు, 11వ రోజు కార్యక్రమాలు కూడా అయిపోతాయి. అందరూ ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. ఎవరి పనులలో వారు మునిగిపోతారు. వీడిని ఎవరూ పట్టించుకోరు. అప్పుడు ఆ సహాయకులు మరలా చెప్తారు. ఇప్పటికైనా మాకూడా వస్తావా? రావా ? అని. ఎందుచేతనంటే? ఈ సృష్టిలో ఏ విషయంలోనైనా, ఏ సందర్భంలోనైనా, ఎక్కడైనా, ఎవరి మీద బలవంతంగా రుద్దబడదు. ప్రతి ఒక్కరికి ఏం చెయ్యాలన్నా పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. అదే ఈ సృష్టిలో వున్న గొప్ప ఏర్పాటు.

అందుచేత ఆ సహాయకులు ఆఖరిగా వాడిని అడుగుతారు. కానీ భార్య, పిల్లల మీద, తాను సంపాదించుకున్న సంపదల మీద మమకారం వున్నవాడు నేను రాను అంటాడు. నాకు వాళ్లే ముఖ్యం వాళ్ళు బాధపడుతుంటే వాళ్ళను వదిలి నేను ఎలా వస్తాను? నేను రాను అంటాడు.

అప్పుడు వాళ్ళు రకరకాలుగా చెప్పి, వినకపోతే వాడిని వదిలేసి వారు వెళ్ళిపోతారు. వారు వెళ్ళిపోగానే వారు భూమి మీదకు వచ్చినప్పుడు తెరుచుకున్నటువంటి ఆత్మ ద్వారాలు మూసుకుపోతాయి. అప్పుడు వీడొక్కడే అక్కడ వుండిపోతాడు.

కొంతమంది ఆలోచించగలిగినవారు, వేటి మీద మమకారం లేని వారు, జ్ఞానం పొందిన వారు, ఇలాంటి క్లాసులలోపాల్గొని ఈ విషయం అంతా తెలుసుకున్న వారు ఆ సహాయకుల కూడా అంటే ఆ దూతల కూడా వారు వెళ్ళవలసిన లోకాలకు వెళ్ళిపోతారు.

కానీ భూమి మీద వుండిపోయినవాడు భార్య వున్న గదిలోకి వెళ్తాడు, పిల్లలువున్న గదిలోకి వెళ్తాడు. ఆస్తులు వుంటే కాసేపు వెళ్ళి అవి అన్నీ చూసుకుని వస్తాడు. వాడి దృష్టి అంతా వాటి మీదే వుంటుంది. అంతే కానీ పై లోకాలకు వెళ్ళడం గురించి ఆలోచించడు.

కారణం వాడు పై లోకాలకు వెళితే ఏం జరుగుతుంది? అక్కడ ఏముంటుంది? అక్కడకు ఎందుకు వెళ్ళాలి? వెళ్తే ఏంటి? వెళ్ళకపోతే ఏమిటి? ఈ విషయాలన్నీ వాడికి తెలియవు. అందుచేత అక్కడే ఉండిపోతాడు. అలా వుండిపోయిన వాడిని అంటే ఆత్మను 'ప్రేతాత్మ లేక దెయ్యం' అంటారు. ఇలా

కొన్ని వేల మంది, లక్షల మంది ప్రేతాత్మలుగా భూమి పైనే వుండిపోయిన వారువున్నారు.

అలా వుండిపోయిన వాడు భార్యను, పిల్లలను చూసుకుంటూ, ఆ ఆస్తులను చూసుకుంటూ కొన్నాళ్ళు గడుపుతాడు. వీడిని ఎవరూ పట్టించుకోరు, ఎవరూ వీడి మాటలు వినరు, ఎవరి పనులు వారు చూసుకుంటూ వుంటారు.

ఆఖరికి భార్య కూడా కొన్నాళ్ళకు వీడి గురించి ఆలోచించదు. ఎన్ని రోజులు ఏడుస్తుంది? ఎన్నాళ్ళు ఆలోచిస్తుంది? అసలు ఆమె అలాగే ఉన్నా మటుకు వీడు ఏం చేయగలడు? ఆవిడ ఏం చేయగలదు?

అందుచేత వీడికి ఏమీ అర్థం కాదు, ఏం చేయాలో తెలియదు. మతి పోతుంది. ఊరికే అటు, ఇటు తిరుగుతాడు. ఆ వంతెన మీద, ఆ బ్రిడ్జి మీద, ఏదో చెట్టు మీద కూర్చుని ఊరికే అందరినీ చూస్తూ కూర్చోవడం తప్ప ఇంకేమీ చెయ్యలేడు. అలాగ ఉండిపోయినటువంటి ఆత్మను ప్రేతాత్మ లేదా దెయ్యం అంటారు. అలా వాడు కొన్ని వందల సంవత్సరాలు వృధా చేసుకుంటాడు. బ్రతికున్నప్పుడు జీవితాన్ని ఎలాగూ వృధా చేసుకున్నాడు, ఇప్పుడు చనిపోయాక కూడా వృధా చేసుకుంటాడు.

కారణమేమిటంటే? వాడికి కొద్ది పాటి జ్ఞానం కూడా లేకపోవడం వల్ల, అంటే అజ్ఞానమే వీటన్నిటికీ కారణం. ఎందుచేతనంటే? జీవించి వున్నప్పుడు ఎంతసేపూ డబ్బు, సంపాదన, సంసారం, సుఖాలు అంటూ కాలాన్ని గడిపేస్తూ, తాను ఆత్మ అన్న సంగతి తెలుసుకోలేదు, ఆత్మకు లాభించే పనులు చెయ్యలేదు, ఆత్మజ్ఞానం సంపాదించుకో లేదు, ఎవరైనా చెప్పినా వినిపించుకో లేదు. ఎంతసేపూ దేహానికే ప్రాముఖ్యమిచ్చాడు, జీవితాన్ని వృధా చేసుకున్నాడు.

అందుకే పత్రి గారు “మరణించక ముందే మరణించాలి” అన్నారు. ఎందుకంటే? నీ జీవితం వృధా కాకూడదనే! ఆయన ఎప్పుడూ సమయాన్ని వృధా చేయకండి అని అనేవారు. అనవసరమైన వాటికి మీ సమయాన్ని ఉపయోగించకండి, ఆత్మ సంబంధమైన వాటి కోసమే ఏ పనైనా చేయండి అంటారు. అలా చేసినప్పుడు మీ సమయం వృధా కాదు అని చెప్తారు.

అందుచేత ఆత్మలమైన మనం జీవించి ఉన్నప్పుడు సమయం వృధా చేయకూడదు. అంతేకాదు శరీరం వదిలేశాక అంటే చనిపోయాక కూడా మన

సమయం వృధా కాకూడదు. మరి మరణించిన తరువాత సమయం వృధా కాకూడద అంటే? పై లోకాల నుంచి మనల్ని తీసుకు వెళ్ళటానికి వచ్చిన సహాయకులతో వెళ్ళిపోవాలి. మళ్ళీ తరువాత ఏమి చెయ్యాలో దాని కోసం సిద్ధపడాలి. అంటే భూమి మీద మళ్ళీ కొత్త శరీరం తీసుకుని, కొత్త అనుభవాలు, కొత్త పాఠాలు నేర్చుకోవాలి. అలా ఆత్మ అంటే మన ఎదుగుదలకు ప్రయత్నించాలి.

ఎందుచేతనంటే? జీవితం అన్నది కొన్ని పాఠాలు నేర్చుకోవడానికే! తద్వారా మనం అంటే ఆత్మ ఎదగడానికే! అందుకే సృష్టిలో ఈ ఏర్పాట్లు. అంటే పుట్టడం.. అనుభవాల ద్వారా పాఠాలు నేర్చుకోవడం .. మరల చావడం... మరలపుట్టడం... ఇది సృష్టిలో సహజం. ఇది ఆత్మ జ్ఞానికే అర్థమవు తుంది. ఇలా పుట్టడం, చావడం అన్న విషయం భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ।**
**తస్మాద పరిహార్యే ర్థే న త్వం శోచితుమర్హసి (భ.గీ.2-27)**

తా:- ఏ విధంగా చూసినా, జన్మించిన వానికి చావు తప్పదు, చనిపోయిన వాడు జన్మించక తప్పదు. అనివార్యమగు ఈ విషయం గురించి నీవు శోకించుట తగదు.

అంతేకాదు ఇంకా ఏమి చెప్పబడిందంటే?

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ॥**
**(భ.గీ.2-22)**

తా:- మానవుడు చిరిగిపోయిన పాత బట్టలు వదిలి కొత్త బట్టలు ఎలా ధరిస్తున్నాడో! అలాగే ఆత్మ ముసలిదైపోయిన పాత శరీరాన్ని వదిలి కొత్త శరీరాన్ని ధరిస్తుంది.

ఇదే కదా భగవద్గీతలో మనకు చెప్పబడింది. అందుచేత శరీరం పోయిందని బాధపడకూడదు, ఏడవకూడదు. కారణం ఇంకొక కొత్త శరీరం వస్తుంది కాబట్టి. ఇదంతా ఆత్మజ్ఞానికి తెలుస్తుంది.

అందుకే ఎవరైనా చనిపోయినపుడు ఏడుస్తూ వుంటే! పత్రిగారు ఆ విషయమే చెప్తారు. ఈ శ్లోకాన్నే చెప్తూ వుంటారు. అన్నమాచార్యుల వారి

నానాటి బతుకు నాటకము అన్న ఆ పాటని కూడా చెబుతూ వుంటారు. ఆత్మ జ్ఞానులు ఏమంటారంటే? కొత్త వస్త్రము ధరించేటపుడు, పాతది వదలటానికి ఎందుకు బాధ పడతావు? ఇంతకన్నా మంచిది వస్తుంది కదా? దీన్ని వదలడానికి ఎందుకు నువ్వు బాధపడతావు? అంటారు.

చనిపోయిన వాడి భార్య ఏమనుకుటుందంటే? నా బతుకు ఇలా అయింది, ఇంకెందుకు ఈ జీవితం అనుకుంటుంది. ఆవిడ ఉద్దేశ్యం తాను ఏదో ఇక్కడ శాశ్వతంగా వుండేదానిలాగ, వాడు పోయాడు అని బాధపడుతుంది. అసలు ఈవిడ మటుకు వుంటుందా? వుండేదా? ఈవిడ కూడా వెళ్ళిపోయేదే అన్న విషయం తెలుసుకోరు. ఎవరైనా కొంచెం వెనుక ముందు వెళ్ళవలసిందే!

## మరణించిన వారు దెయ్యాలుగా భూమి మీదే ఎందుకు వుండిపోతారు?

అంతే కాదు మరణించిన వారు పై లోకాలకు వెళ్ళకుండా ప్రేతాత్మలుగా అంటే దెయ్యాలుగా భూమి మీద తిరుగుతూ వుండటానికి కారణం ఏమిటి? భూమి మీదే ఎందుకు వుండి పోతారు? అన్న దానికి కారణాలు తెలుసుకుందాం.

అవి తెలుసుకుంటే? మీ జీవితాన్ని మీరు కూడా సరి చేసుకునే అవకాశం వుంటుంది. లేకపోతే మీరూ నష్టపోతారు. అందుచేత పై లోకాలకు వెళ్ళకుండా ప్రేతాత్మలుగా వుండి పోవడానికి కారణాలు తెలుసుకుందాం.

1. ముఖ్యంగా భార్య, పిల్లలు, కుటుంబ సభ్యుల మీద వున్నటువంటి విపరీతమైన మమకారం.

2. చనిపోయిన తరువాత అందరూ దుఃఖంతో, బాధతో ఏడుస్తూ వుంటే! వీడు వాళ్ళను వదలలేడు. ఏమనుకుంటాడంటే? వారు నా కోసం ఎంత బాధపడుతున్నారు? వాళ్ళను వదిలేసి ఎలా వెళ్ళిపోతాను? అని వాళ్ళను సముదాయించడం కోసం అక్కడే ఉండిపోతాడు.

పై నుంచి వచ్చిన సహాయకులు ఎంత చెప్పినా, ఎన్ని బోధించినా వినడు, అర్థం చేసుకోడు, మొండిగా నేను రాను అని అక్కడే వుండిపోతాడు.

అందుకే పెద్దవాళ్ళు ఎవరైనా చనిపోతే ఏడవ వద్దంటారు. సహజంగా ఎవరికైనా, ఎటువంటి వారికైనా బాధ వుంటుంది, ఏడుపొస్తుంది. అందుచేత పత్రిగారు ఏమంటారంటే? కాసేపు ఏడవండి, మీలో వున్న ఎమోషన్స్‌ని వ్యక్తం

చేయండి, తప్పులేదు కానీ అలాగే ఏడుస్తూ కూర్చోకూడదు అని చెబుతారు. అందరూ అలా ఏడుస్తూ వుంటే చనిపోయిన వాడు భూమిని వదిలి పై లోకాలకు వెళ్ళలేడు, ప్రేతాత్మగా ఇక్కడే ఉండిపోతాడు. అంటే దగ్గర వాళ్ళు ఏడవడం వల్ల వాడిని ప్రేతాత్మగా చేసిన వారు అవుతారు, వాడికి ఎంతో నష్టం కలిగిస్తారు. వాళ్ళే కనుక ఏడవకపోతే వాడు నిశ్చింతగా, సహాయకులతో పై లోకాలకు వెళ్ళిపోతాడు. అందుచేత ఉన్న వాళ్ళు ఏడవకూడదని తెలుసుకోవాలి.

అందుచేత కొంచెం జ్ఞానం వున్న వారు ఇదంతా అర్థం చేసుకుంటారు. ఇంక నేను ఏడుస్తూ వాడిని బాధపెట్టను. ఎంత ఏడిస్తే వాడు అంత బాధ పడతాడు? పై లోకాలకు వెళ్ళడు. అందుచేత తెలుసుకోండి చనిపోయిన వాడిని దెయ్యం చేయాలనుకుంటే ఏడవండి. లేదా చనిపోయిన వాడు హాయిగా వాడు వెళ్ళవలసిన లోకాలకు వెళ్ళి వాడి పనులు చేసుకోవాలంటే? ఏడవద్దు.

అందుకే జ్ఞానం వున్న వాడు అంటే నేను దేహం కాదు ఆత్మను అని తెలుసుకున్నవాడు, ఎవరికీ చావు లేదని తెలుసుకున్నవాడు ఏడవడు, ఏడవకూడదు అని కూడా చెపుతాడు.

3.అంతేకాదు తాను సంపాదించినటువంటి ఆస్తిపాస్తులు, సంపదలు, అపారమైన ధనం, బంగారం, ఇటువంటివన్నీ కూడబెట్టి, కూడబెట్టి జీవితంలో కష్టపడి, కష్టపడి ఇప్పుడు అన్నీ వదిలేసి వెళ్ళడం అంటే ఎంత బాధగా వుంటుందో చెప్పండి? జీవించి వున్నప్పుడు చెయ్యకూడని పనులు చేసి, తప్పులు చేసి, పాపాలు చేసి, అధర్మంగా సంపాదించాడు. ఇప్పుడు అవన్నీ వదలాలంటే? ఎలా వదిలేస్తాడు?

చూడండి కొంతమంది అపర కోటీశ్వరులు వున్నారు. వారు బాత్రూంలులో కూడా బంగారంతో చేయించినవి వుంటాయి. అంత లగ్జరీ లైఫ్ లీడ్ చేసే వారు వాటిని వదిలేయాలంటే ఎలా వదిలేస్తారు? వాటన్నిటిని వదిలి పై లోకాలకు వెళ్ళలేక ప్రేతాత్మలుగా భూమి మీద వుండిపోతారు.

అందుచేత ప్రేతాత్మలు కాకూడదంటే? కూడా రానివి సంపాదించడం కాదు, కూడా వచ్చే జ్ఞానం సంపాదించండి. ఆస్తిపాస్తులు అన్నవి మన అవసరాలు తీరుతున్నాయా లేదా? అని చూసుకోవాలి. అంతే కానీ అవసరాలకు మించి అధికంగా అవసరం లేదు. అందుచేత వాటి మీద వ్యామోహం

పెంచుకోకూడదు, మమకారం పెంచుకోకూడదు.

ఒకవేళ అవసరాలకు మించి మీకు బాగా సంపదలు ఉన్నట్లయితే! వాటిని పై లోకాల్లో మీకు అంటే ఆత్మకు లాభించే ఆత్మ సేవలకు ఉప యోగించండి, శరీరం వదిలిన తర్వాత ఆ సేవలు మీకు ఎంతో లాభం చేకూర్చుతాయి.

అంతే కాదు ఈ భూమి మీదే ప్రేతాత్మగా ఉండి పోవడానికి మరికొన్ని కారణాలు తెలుసుకుందాం.

4. ఎవరైతే చనిపోతారో వాళ్ళు చేయవలసిన పనులు మధ్యలో ఆగిపోవడం, అంటే ఏవో కడుతూ వుంటారు, ఎన్నో చేస్తూ వుంటారు, ఎన్నెన్నో ప్లాన్ చేస్తారు. వీడు ఎప్పుడైతే కొంతవరకు చేసి చనిపోవడం వల్ల ఆ పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల ఆ పని మీదే దృష్టి వుంటుంది. అందుచేత పైకి వెళ్ళలేరు, దృష్టి అంతా వాటి మీదే వుంటుంది. అందుచేత సహాయకులు ఎంత చెప్పినా వినరు. భూమి మీదే వుండిపోతారు, ప్రేతాత్మలు అయిపోతారు.

5. అలాగే జీవించి ఉన్నప్పుడు అత్యంత దుఃఖంతో జీవించేవాడు, ఎప్పుడూ ఏడుస్తూ మా వాళ్ళ బ్రతుకు అలా అయిపోయింది, నా బ్రతుకు ఇలా అయిపోయింది అనుకుంటూ, జీవితమంతా సమస్యలతోనే వుందంటూ, అత్యంత దుఃఖంతో ఎవడైతే భూమి మీద జీవిస్తూ వుంటాడో! వాడు కూడా పై లోకాలకు వెళ్లలేడు, ప్రేతాత్మగా అయిపోతాడు.

6. అలాగే ఎవరైతే సడెన్‌గా ఆక్సిడెంట్‌లో గాయాల వల్ల మరణించినా, హత్య చేయబడినా పై లోకాలకు వెళ్ళలేరు. కారణం హత్య చేసిన వాడి మీద కక్ష తీర్చుకోవాలని భూమి పైనే వుండిపోతాడు, ప్రేతాత్మ అయిపోతాడు.

ఇవన్నీ కూడా ప్రేతాత్మలుగా మారడానికి కారణాలే. గుర్తు పెట్టుకోండి. మీరు జ్ఞానం సంపాదించుకుని, మీ లోపాలు మీరు సరి చేసుకుంటే! మీరు ఎంచక్కా పై లోకాలకు వెళ్ళిపోతారు. మీకు సమయం కలిసి వస్తుంది. మీరు తర్వాత జీవితం గురించి ప్లాన్ చేసుకుని ఇంకో జన్మ తీసుకుని ఇంకెన్నో సాధించడానికి ప్రయత్నిస్తారు.

ఒకటే గుర్తు పెట్టుకోండి. ఏది ఏమైనప్పటికీ చనిపోయిన వారికి అంటే ఆత్మకు 11 రోజుల గడువు మాత్రమే వుంటుంది. ఈ గడువు లోపులోనే

వాడు నిర్ణయించుకుని, సహాయకులతో పై లోకాలకు వెళ్ళిపోవాలి. లేకపోతే 11 రోజుల తర్వాత సహాయకులు వెళ్ళిపోవడం జరుగుతుంది. అంతేకాదు చనిపోయిన వాడిని తీసుకుని వెళ్ళడానికి తెరుచుకున్న ఆత్మ ద్వారాలు కూడా మూసుకుపోతాయి. అలా కనుక జరిగితే చనిపోయిన వారి పరిస్థితి మరీ దయనీయమైపోతుంది.

ఎందుచేతనంటే ఆత్మ పై లోకాలకు వెళ్ళలేదు, మళ్ళీ ఇంకొక జన్మ తీసుకోలేదు. అంటే ప్రేతాత్మ లాగ అంటే దెయ్యంలాగా భూమి మీద సంచరించవలసి వస్తుంది. అలా వందల సంవత్సరాలు ఏమీ చేయలేక వృధా అయిపోతాయి.

అందుకే పత్రి గారు ఒక సందర్భంగా ఏమన్నారంటే మీకు మూడో కన్ను వుంటే విజయవాడ బ్యారేజ్ మీద గానీ, పెద్ద పెద్ద వంతెనలు మీద గానీ ఈ ప్రేతాత్మలన్నీ వరుసగా కూర్చుని వుండటం మీరు బాగా గమనించ గలుగుతారని అంటారు. అంటే ఎంతమంది ప్రేతాత్మలుగా మారిపోతున్నారో తెలుసుకోండి. మరి ఇంక ఏం చేస్తాయి? అలా చూస్తూ కూర్చోవడం తప్ప.

అందకే పత్రిగారు చెప్తారు. అలా మనం ప్రేతాత్మలు కాకుండా, ప్రశాంతంగా సహాయకులతో పై లోకాలకు వెళ్ళాలంటే? మనం కొన్ని విషయాలు తెలుసుకోవాలని అంటారు.

1. ముఖ్యంగా జీవించి ఉన్నప్పుడే నేను దేహం కాదు. ఆత్మను అన్న అవగాహన కలిగి ఉండాలి. అందుకే నేను ఈ విషయాన్నే ఎప్పుడూ చెప్తూ వుంటాను. అంతేకాదు మీ ఇంటిలో బాగా కనబడే ప్రదేశంలో "నేను దేహం కాదు, నేను ఆత్మను" అని బోర్డు మీద వ్రాసి పెట్టుకోండి అంటాను. కనీసం అది చూసినప్పుడైనా నేను ఆత్మ అన్న సంగతి గుర్తొస్తుంది కాబట్టి.

2. ముఖ్యంగా "మరణించక ముందే మరణించాలి". అంటే మరణించిన తర్వాత జరిగేదంతా ముందే తెలుసుకోవాలి.

3. ముఖ్యంగా మరణం అన్నది సహజం అని తెలుసుకోవాలి, మరణానికి సిద్ధంగా ఉండాలి. అంతేకాదు మరణం అన్నది ఎవరికైనా వస్తుంది అని తెలుసుకోవాలి. పుట్టడం ఎంత సహజమో! మరణం కూడా అంతే సహజం అని తెలుసుకోండి.

అందుకే పత్రీజీ "పుట్టినా సంబరాలు చేసుకోవాలి. మరణించినా సంబరాలు చేసుకోవాలి" అంటారు. ఆత్మలమైన మనం శరీరాన్ని వదలడం అన్నది అనివార్యం అని తెలుసుకోండి. అందుకే గీతలో "పుట్టిన వాడు గిట్టక మానడు, గిట్టిన వాడు పుట్టక మానడు" అని చెప్పబడింది. అందుచేత మరణం అన్నది సహజమని తెలుసుకోవాలి, ఈ మరణానికి ఎప్పుడూ సిద్ధంగా వుండాలి.

ఆ విషయమే నేను కూడా ఇంతకు ముందు ఒకసారి చెప్పడం జరిగింది. ఏ రోజైనా మనం శరీరం వదలడానికి రెడీగా వుండాలి. మరణానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి అని చెప్పడం జరిగింది.

4. అలాగే తన వారి మీద, తాను సంపాదించుకున్న వాటి మీద మమకారం పెంచుకోకూడదు.

5. అంతేకాదు చనిపోయిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు అధికంగా ఏడవడం, రోజుల తరబడి ఏడవడం చేయకూడదు. ప్రేమ లేదని అనుకుంటారని మరీ ఏడుస్తారు. చూడటానికి కొత్తగా ఎవరైనా వస్తే మళ్ళీ మొదలు పెడతారు. ఏడవకపోతే ప్రేమ లేదనుకుంటారని మరీ ఏడుస్తారు.

గుర్తుపెట్టుకోండి ప్రేమ వున్న వాడు ఏడవడు, చనిపోయిన వాడి శ్రేయస్సు కోరే వాడు, వాడి లాభం కోరేవాడు, వాడు నష్టపోకుండా చేయాలనుకున్నవాడు ఏడవడు.

6.ఎంతసేపూ ఈ జీవితం తాత్కాలికం. కొన్ని అనుభవాలు, పాఠాలు నేర్చుకోవడానికే ఈ జీవితం అని తెలుసుకోవాలి. అందుచేత తెలుసుకోండి మనకు మరణం లేదు. మరణం అన్నది మనకు అంతం కాదు. మరణమన్నది మనం మళ్ళీ భూమి మీదకి రావడానికే. మరణం అన్నది ఒక్క విడిది సమయం మాత్రమే అని బాగా గుర్తు పెట్టుకోవాలి.

7.మరణం అంటే శరీరాన్ని, ప్రదేశాన్ని మార్చడం తప్ప ఇంకేమీ కాదు. ఈ అవగాహన, ఈ జ్ఞానం మీకుంటే! చనిపోయిన తరువాత మీరు భూమి మీద వుండరు, ప్రేతాత్మ అవరు. ఆ సహాయకులతో చక్కగా పై లోకాలకు వెళ్ళిపోతారు. అందుచేత ఇవన్నీ ఎంత అవగాహన వుంటే మనం అంత లాభం పొందుతాము. అందుచేత మరణానంతరం గురించి ఎన్నో విషయాలు తెలుసుకోవాలి.

# పరంలో ఏ ఏ లోకాలు వుంటాయి?

సహజంగా మరణించిన వాడిని తీసుకు వెళ్ళడానికి వచ్చిన సహాయకులు ఎన్ని చెప్పినా వీడు రానని అంటాడు. అప్పుడు తీసుకు వెళ్ళడానికి వచ్చిన సహాయకులు ఏమంటారంటే? ఆఖరిగా చెపుతున్నాం వస్తావా? రావా? అని అడుగుతారు. ఎంత చెప్పినా వినకపోతే ఆ సహాయకులు వెళ్ళిపోతారు. వాడిని తీసుకు వెళ్ళడానికి తెరుచున్న ఆత్మ ద్వారాలు మూసుకుపోతాయి. అప్పుడు వాడు ప్రేతాత్మ అంటే దెయ్యం అయిపోతాడు. అలా దెయ్యం అయినవాడు ఏమీ చేయలేడు. అటు, ఇటు తిరుగుతాడు, ఎవరూ పట్టించుకోరు. ఆ పిల్లల పక్కనే మంచం మీద పడుకుంటాడు; వాళ్ళకి ఏమీ తెలియదు. ఆ గదిలోనే వుంటాడు; 24 గంటలు ఏం చూస్తాడు? భార్య దగ్గరికి వెళ్తాడు, అక్కడే వుంటాడు. తాను సంపాదించిన ఆస్తుల దగ్గరికి వెళ్తాడు, అక్కడా వుంటాడు. అలా ఎంతో సమయాన్ని వృధా చేసుకుంటాడు. కొంతమంది అలా వందల సంవత్సరాలు ఉండిపోతారు కూడా.

వాడికి ఎప్పటికో అర్థమవుతుంది ఏంటిది అని. ఎవడూ పట్టించు కోవట్లేదు; ఎవడూ లెక్క చెయ్యట్లేదు; ఎవరి పనుల్లో వారు వున్నారు. ఇప్పుడు నేనేం చేయాలి? ఇలా ఉండి పోయానే? ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి? ఆ పై లోకాలకి ఎలా వెళ్లాలి? నన్నెవరు తీసుకు వెళ్తారు? మరి దారేది? ఇక్కడ ఏం లేదు, దారి చూపించే వాడు లేడు, తీసుకెళ్లేవాడు లేడు, అనుకుంటూ అలాగే ఉండిపోతాడు అయోమయంగా.

ఎప్పటికో, ఎన్నో వందల సంవత్సరాల తర్వాత ఇంక ఇక్కడ ఏం చేస్తాను? ఏముంది ఇక్కడ? ఎవరితోటి, వేటితోటి, ఏ విధమైన సంబంధంలేదు, ఎన్ని సంవత్సరాలు వుండను? ఆ సహాయకులు అడిగినపుడు వుంటే బాగుండేది. కనీసం ఇప్పుడైనా వెళ్ళిపోవాలి అనే అభిప్రాయం బలంగా కలుగుతుంది. అలా కలిగినపుడు పై లోకాల నుంచి ఎవరో ఒకరు వచ్చి వాడికి ఏదో రకమైన సాయం చేసి తీసుకెళ్లటం జరుగుతుంది. కానీ అలా వాడు ఎన్నో వందల సంవత్సరాలు నష్టపోతాడు, ఎంతో సమయం వృధా చేసుకుంటాడు.

ఇదంతా ఎవరికి జరుగుతుంది? అంటే ధ్యానం చేయని వాడికి జరుగుతుంది, కొద్దిగా కూడా జ్ఞానం లేని వాడికి జరుగుతుంది, పత్రి గారి పరిచయం కాని వాడికి జరుగుతుంది.

కానీ ఎవరైతే ధ్యానం చేస్తారో! జ్ఞానం సంపాదించుకుంటారో! పత్రి గారి పరిచయం పొందుతారో! పత్రి గారి మార్గంలో పయనిస్తూ వుంటారో! వారు చనిపోయిన తర్వాత జరిగేది తెలుసుకుంటారు. ఏమి జరుగుతుందో! ఏమవుతుందో! తెలుసుకుంటారు. మరణించిన తర్వాత సహాయకులు రాగానే వారితో వెళ్ళవలసిన లోకాలకు వెళ్ళిపోతారు. కారణం నేను దేహం కాదు, ఆత్మను అన్న విషయం వారికి తెలుస్తుంది. అంతేకాదు ఎప్పుడో ఒకప్పుడు నేను చనిపోవాల్సి వస్తుంది, అంటే దేహం వదిలివేయవలసి వస్తుంది అని అర్థమవుతుంది. అంతేకాదు చనిపోయినవాడికి ఇక దేనితో సంబంధం వుండదని కూడా అర్థమవుతుంది. ఈ ఆస్తులు, ఈ బంధుత్వాలు, వేటితోటి సంబంధం ఉండదు. వాళ్ళ దారి వారిదే, నా దారి నాదే అన్నది అవగాహన కలుగుతుంది.

ఎందుచేతనంటే? పత్రిగారు ఎక్కువగా ఇవే చెప్తూ వుంటారు కాబట్టి.

ఈ మధ్య చావు గురించి, చనిపోయిన దాని గురించిన టాపిక్స్ పత్రి గారు ఎక్కువగా చెప్తున్నారు. మీరు పత్రి గారి టాపిక్స్ వింటూ వుంటే మీకు కూడా తెలుస్తుంది.

అందుకే ఎవరైనా సరే రేపు మనం ఉండము అన్నట్టుగా జీవించమంటాను. మరుక్షణంలో మనం ఉండొచ్చు, ఉండకపోవచ్చు, మీరు ఏమి సర్దుకోవాలో సర్దేసుకోండి, అన్నిటికీ రెడీ అవ్వండి అని అంటాను.

చూడండి మీరు రైలు ప్రయాణం చేయాలి. మీరు ముందు ఏమీ సర్దుకోకుండా బయలు దేరే ముందు సర్దుకోవడం మొదలు పెడితే ఎంత కంగారు? ఎంత హడావిడి? చెప్పండి. అదే ముందు అన్నీ సర్దుకుంటే ఏమీ కంగారు పడరు, ఎంచక్కా పెట్టెలు తీసుకుని బయలు దేరిపోతారు.

అలాగే పై లోక ప్రయాణానికి కూడా మనం ఎప్పుడూ సిద్ధపడి వుండాలి. నా పిల్లలు ఏమైపోతారో! నావన్నీ ఏమైపోతాయో! మొగుడు ఏమైపోతాడో! పెళ్ళాం ఏమైపోతుందో! అవన్నీ ఏమైపోతాయో!ఇవన్నీ ఏమైపోతాయో! అనుకుంటే చావు ఆగదు. నువ్వు నిర్ణయించుకుని వచ్చినటువంటి సమయం అయిపోతే వెళ్ళిపోవలసిందే. ఆ సమయం నీకు తెలియదు కానీ ప్రకృతికి తెలుసు.

నువ్వు పై లోకాల నుంచి వచ్చేటప్పుడే ఇన్ని సంవత్సరాలు అని అక్కడే నిర్ణయించుకుంటావు. ఆ విషయం ప్రకృతికి తెలుసు, టైమ్ రాగానే ఏదో ఒక కారణంతో నువ్వు నిష్క్రమించవలసి వస్తుంది. నువ్వు ప్రిపరేషన్‌లో లేకపోతే శరీరం వదిలాక చాలా గందరగోళం పడతావు. శరీరం వదిలాక అయ్యో ఆ

పని అలా ఉండిపోయింది, ఈ పని ఉండిపోయింది, ఆ పని చేయలేదే, ఇది చేసుంటే బాగుండును అని బాధపడతావు, నష్టపోతావు. అందుచేత చావుకు ఎప్పుడూ మనం సిద్ధంగా ఉండాలి అంటారు.

ఒకవేళ నువ్వు ఈ రోజే వెళ్ళిపోదాం అనుకున్నా, నువ్వు వెళ్లవలసిన టైమ్ రాకపోతే ఇంకా 20 ఏళ్లయినా, 30 ఏళ్లయినా, 50 ఏళ్లయినా వుంటావు. నువ్వు వెళ్లవలసిన టైమ్ వస్తే నీకు ఎన్ని పనులున్నా, నువ్వు చేయాలనుకున్నవి మధ్యలో వున్నా, నువ్వు రెడీగా లేకపోయినా అన్నిటినీ వదిలేసి వెళ్ళిపోతావు.

చిన్న ఉదాహరణ చూద్దాం. ఒకడు బాగా సుఖపడాలి అనే ఉద్దేశ్యంతో, జీవితంలో కష్టపడి కోట్లు సంపాదించుకున్నాడు. ఎన్నో అంతస్తులున్న ఒక ప్యాలెసు లాంటి ఇల్లు కూడా కట్టుకున్నాడు, ఎన్నో సౌకర్యాలు సమకూర్చు కున్నాడు, నా అదృష్టమే అదృష్టం అనుకున్నాడు. ఇన్నాళ్ళు కష్టపడినందుకు ఇక హాయిగా ఉండొచ్చు, అన్నీ అనుభవించొచ్చు అని అనుకున్నాడు. అలా ఏదో నాలుగు రోజులు అనుభవించాడు. కానీ వాడి టైం అయిపోయింది చనిపోయాడు. ఏం చేస్తాడు? ఇన్నాళ్ళు కష్టపడి అమర్చుకున్నా అనుభవించ టానికి లేకుండా పోయిందే అని బాధపడతాడు.

వాడి ఇంటి మీదే దృష్టి అంతా. అలాంటి వాడు సహాయకుల కూడా రమ్మంటే వెళతాడా? వెళ్ళలేడు కదా? అందుచేత నేను రాను అంటాడు. భూమి మీదే వుండిపోతాడు, ప్రేతాత్మ అయిపోతాడు.

అందుచేత ఇక్కడ మనం తెలుసుకోవలసింది ఎవరైతే ధ్యానం చేస్తారో, జ్ఞానం సంపాదించుకుంటారో, చనిపోయిన తరువాత ఏం జరుగుతుందో తెలుసుకుంటారు. అంటే చనిపోయాక ఆ పై లోకాల నుంచి సహాయకులు వస్తారు, వాళ్లతో మనం వెళ్ళవలసి వస్తుంది, అక్కడ మనం కొత్త జీవితాన్ని ఎంచుకోవలసి వస్తుంది, కొత్త ప్రణాళికలు మనం ఎంచుకోవలసి వస్తుంది అన్న విషయాలు అవగాహనకు వస్తాయి. ఇవన్నీ అవగాహన అయితే అప్పుడు వేటి మీద మమకారం గానీ, వ్యామోహం గానీ ఉండదు. అంతేకాదు వీళ్ళంతా నా వాళ్లు అనుకుంటున్నవారంతా తాను ఎలా వచ్చాడో! అలా వచ్చిన వాళ్లే, ఎవరి పని కోసం వారు వచ్చారు అని తెలుసుకుంటారు. అందుచేత ఎవరైనా కొన్నాళ్ళు ఉండేవాళ్ళే, నేనూ అలాగే కొంతకాలం వుండేవాడినే అని తెలుసుకుంటాడు. అందువల్ల ఎవరి మీద మమకారం ఉండదు. అప్పుడు పై నుంచి వచ్చినటువంటి సహాయకుల కూడా పై లోకాలకు వెళ్లిపోతాడు.

ఇక్కడ మనం ఒక విషయం తెలుసుకోవాలి. సహజంగా చనిపోయిన ప్పుడు ఏమి జరుగుతుంది? ధ్యానం చేయకుండా పాపాలు చేస్తూ మరణించిన వాడిని తీసుకెళ్ళటానికి సామాన్య సహాయకులు వస్తారు. వీళ్ళని పితృ దేవతలు అంటారని పత్రీజీ అన్నారు. వారు వాడిని అధో లోకాలకి తీసుకు వెళ్తారు.

కానీ ధ్యానం చేస్తూ, సేవలు చేస్తూ, జ్ఞానం సంపాదించుకుని ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొని, ఎంతో సేవ చేస్తే మరణించిన తరువాత వీడిని తీసుకుని వెళ్ళటానికి గొప్పవారైనటువంటి యోగులు సహాయకులుగా వస్తారని ఊర్ధ్వ లోకాలకు, ఉన్నతమైన లోకాలకు తీసుకెళ్తారని పత్రీగారు చెప్పడం జరిగింది.

అందుచేత రోజు ఉదయం ధ్యానం చేయటమే కాదు, సాయంత్రం కూడా మనం ధ్యానం చేయాలి. కనీసం నా లెక్క అయితే ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధ్యానం చేయాలి. దాని ఫలితం ఇక్కడ మీకు తెలియదు కానీ, చనిపోయిన తర్వాత అర్థమవుతుంది. దీనినే మన హిందూ పురాణాలలో ఏమని చెప్తారంటే? పాపాలు చేసిన వారిని యమభటులు వచ్చి యమలోకానికి తీసుకువెళ్తారనీ, పుణ్యాలు చేసిన వారిని ఇంద్ర దూతలు వచ్చి స్వర్గలోకానికి తీసుకువెళ్తారని మనకి చెప్తూ వుంటారు.

అలా మనం ఇష్టపడి పైలోకాలకి వెళ్లాలనుకున్నప్పుడు ఒక పెద్ద చీకటి సొరంగ మార్గం గుండా ఆత్మ ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆ సహాయకులు ఏ లోకానికి వీడు చేరుకోవాలో ఆ లోకానికి తీసుకుని వెళ్తారు. అలా లక్షల, కోట్ల కిలోమీటర్లు ప్రయాణం చేశామన్న సంగతి కూడా వాడికి తెలియదు. అంత స్పీడుగా వెళ్ళిపోతాడు. ఆ లోకాలు దగ్గరైనప్పుడు, దగ్గరకొచ్చాము అన్న దానికి సూచనగా ఆ మార్గం యొక్క ముగింపులో వెలుగు కనిపిస్తుందట. చూడండి మీరు ట్రైన్‌లో సొరంగ మార్గంలో వెళ్తున్నప్పుడు ట్రైన్ బయటికి వచ్చే సమయంలో వెలుతురు ఎలా కనిపిస్తుందో! ఇక్కడ కూడా అంతే. అంటే దాని అర్థం వాడు చేరుకోవలసిన లోకం వచ్చిందని లెక్క.

ఇక్కడ మరికొన్ని విషయాలు తెలుసుకోవాలి. భూలోకము అంటే భూమి ఒక్కటే కాదు, మన కంటికి కనిపించే లోకాలన్నింటిని భూలోకం అంటారు. అలాంటి లోకాలు సృష్టిలో కోటానుకోట్లు ఉన్నాయి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, లక్షల కొద్దీ భూ మండలాలు, అలాగే ఎన్నో సూర్యుళ్లు, ఎన్నో

కనిపించే విశ్వాలు. ఇవన్నీ భూలోకం కిందకే వస్తాయి అంటారు. ఆలోచించండి? ఈ భూలోకమే ఇంత పెద్దది అవుతే ఇంకా పైన ఉండే సూక్ష్మలోకాలు ఎంత పెద్దవో, ఎన్ని రెట్లో ఒక్కసారి ఆలోచించండి!

అలా భూలోకం కాకుండా భూలోకం తరువాత ఉండే లోకాన్ని భువర్లోకం అంటారు. భువర్లోకం తరువాత ఉండే లోకం సువర్లోకం అంటే స్వర్గలోకం అంటారు. దాని పైన ఉండే లోకం జనాలోకం, దీనినే కారణ లోకాలు అంటారు. దానిపైన మహా లోకం ఉంటుంది. దానిపైన తపోలోకం ఉంటుంది. దానిపైన సత్యలోకం ఉంటుంది. పూర్ణాత్మలు ఉండేది, దేవుళ్ళు వుండేది సత్యలోకంలోనే. అది చాలా గొప్ప లోకం. అలాగే ఒక్కొక్కలోకంలో ఎన్నో భాగాలు ఉంటాయి.

సహజంగా పాపాలు చేసే వారు భువర్లోకం చేరుకుంటారు. పుణ్యాలు చేసేవారు సువర్లోకం చేరుకుంటారు. ఎవరైతే నిస్వార్ధంగా ఉండి గొప్ప గొప్ప సేవలు చేస్తారో వాళ్లు మహా లోకం చేరుకుంటారు. అలాగే ఎవరైతే కోరికలు, సంకల్పాలు లేకుండా ధ్యానం చేస్తారో! అంటే తపస్సు చేస్తారో! వారు తపోలోకం చేరుకుంటారు. అలాగే ఈ భూమ్మీద పత్రిగారిని బాగా అనుసరించి, ఆయన చెప్పిన మార్గంలో పయనించి చాలా తీవ్రమైన సాధన చేసి, స్వాధ్యాయం, సాంగత్యం చేసి, సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటే? సత్యలోకం చేరుకుంటారు. అలా చేరాలంటే మరణించిన తరువాత జరిగేదాని గురించి ఖచ్చితంగా తెలుకోవాలి. దానికి పత్రి గారు చెప్పినట్టు నాలుగు పనులు చెయ్యాలి. 1. శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చేయాలి, 2.జ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలి అంటే పత్రి గారి పుస్తకాలు చదవాలి. 3.జ్ఞానాన్ని బోధించేవారి సాంగత్యం చేయాలి, 4.ఈ జ్ఞాన మార్గంలో సేవ చేయాలి.

పత్రి గారిని మీరు గమనిస్తే ఆయన ఎంత సేపూ నేను దేహం అన్నట్టుగా జీవించరు, నేను ఆత్మ అన్నట్టుగానే ఆయన ప్రవర్తన ఉంటుంది. ఆయన ఆత్మకే టాప్ ప్రయారిటీ ఇస్తారు. భోగాలకు ఏమీ ప్రయారిటీ ఇవ్వరు. ఉంటే ఏసీలో పడుకుంటారు, లేకపోతే బయట అయినా ఉంటారు. ఆయనకి ఏదైనా ఒకటే. ఎవరైనాసరే సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొని, పూర్ణ జ్ఞానం పొంది అందరికీ జ్ఞానబోధలు చేస్తూ ఉంటే సత్యలోకం చేరుకుంటారు.

ఇలా పైకి వెళ్ళిన తర్వాత జరిగే దాని గురించి మనం సూక్ష్మంగా చెప్పుకున్నాం. అందుకే మేము భీమవరంలో మూడు రోజుల క్లాసులు పెట్టి ఈ జ్ఞానమంతా ఇస్తున్నాం.

# "పాపాలు చేసేవారు ఏ లోకానికి వెళ్తారు?"

ఇంతకుముందు చాలా విషయాలు తెలుసుకున్నాం. అంటే పాపాలు చేసిన వారు ఏ లోకానికి వెళ్తారు? పుణ్యం చేసిన వారు ఏ లోకానికి వెళ్తారు? మరి ధ్యానం చేసిన వారు ఏ లోకానికి వెళ్తారు? గొప్ప, గొప్ప కార్యాలు, సేవలు చేసిన వారు ఏ లోకానికి వెళ్తారు? ఇవన్నీ కూడా మనం తెలుసుకున్నాం.

అందుచేత వెళ్లిన తర్వాత ఆ లోకాలలో ఏం జరుగుతుంది అన్నది కొంచెం తెలుసుకుందాం. ఎందుచేతనంటే? ఇదంతా తెలుసుకోవాలి అంటే ముందు మన శరీరాల గురించి కొంత తెలుసుకోవాలి.

ఆత్మపైన 7 శరీరాలు ఉన్నాయని పత్రిగారు చెప్పారు. అందుచేత వాటి గురించి తెలుసుకుందాం. అలాగే ఈ సృష్టిలో వున్న లోకాల గురించి కూడా తెలుసుకుందాం. అప్పుడే మనకి చనిపోయిన తర్వాత జరిగేది అర్థమవుతుంది.

అందుచేత ముందు 7 శరీరాల గురించి తెలుసుకుందాం. మానవునకు

1) స్థూల శరీరము, 2) ప్రాణమయ శరీరము, 3) సూక్ష్మ శరీరము, 4) కారణ శరీరము, 5) మహా కారణ శరీరము, 6) విశ్వమయ శరీరము, 7) నిర్వాణమయ శరీరము అని 7 శరీరాలు ఉన్నాయి.

అలాగే సృష్టిలో 7 లోకాలు వున్నాయి.

1) భూలోకము, 2) భువర్లోకము, 3) సువర్లోకము, 4)జనాలోకం, 5) మహాలోకము, 6) తపోలోకము,7) సత్య లోకము అని 7 లోకాలు వున్నాయి.

ఇక్కడ మీరు గుర్తు పెట్టుకోండి స్థూల శరీరము, ప్రాణమయ శరీరము, రెండూ చనిపోయినప్పుడు భూలోకంలోనే వదిలేస్తారు.

సూక్ష్మ శరీరం అంటే మనోమయ శరీరము, భువర్లోకం కానీ, సువర్లోకం కానీ చేసిన కర్మలను బట్టి వెళ్తుంది.

నాలుగోదైన కారణ శరీరంతో జనాలోకానికి చేరుకుంటాం.

ఐదవది అయిన మహాకారణ శరీరంతో మహాలోకానికి చేరు కుంటాము. ఆరవది అయిన విశ్వమయ శరీరంత తపోలోకానికి చేరుకుంటాము. ఏడవది అయిన నిర్వాణమయ శరీరంతో సత్యలోకానికి చేరుకుంటాము.

ఇక్కడ మీరు గుర్తుంచుకోవలసింది ఏమిటంటే జనాలోకానికి ముందు క్రింద మూడు లోకాలు వున్నాయి. జనా లోకానికి పైన మూడు లోకాలు వున్నాయి. మధ్యలో జనాలోకం వుంది. అంటే జనాలోకానికి కింద మూడు లోకాలు, భూలోకము, భువర్లోకము, సువర్లోకము ఉన్నాయి. జనాలోకానికి పైన మహాలోకము, తపోలోకము, సత్యలోకము ఉన్నాయి.

ఇలా మనం చెప్పుకోవటానికి కారణం జనాలోకానికి ఒక విశేషం వుంది.

మొట్టమొదట భూలోకంలో వున్నటువంటి ఆత్మ అయిన మనం చనిపోయినపుడు మొదటి రోజు స్థూల శరీరం భూలోకంలోనే వదిలేస్తాము. ఇక రెండవది అయినటువంటి ప్రాణమయ శరీరం భూలోకంలో మూడో రోజు రాలిపోతుంది.

అప్పుడు ఆత్మ అయిన మనం సూక్ష్మ శరీరంతో భువర్లోకం కానీ, సువర్లోకం కానీ చేరుకుంటాము. ఈ రెండు లోకాలలో ఏ లోకానికి మనకి అర్హత వుంటే ఆ లోకానికి సహాయకులు తీసుకు వెళ్ళి వదిలేస్తారు. అర్హత అన్నది మనం అంతకు ముందు చేసుకున్న కర్మలను బట్టి ఉంటుంది.

భూలోకంలో రకరకాల కర్మలు చేసే వాళ్ళు వుంటారు. సృష్టిలో అది సహజం. కొంతమంది పాపాలు చేస్తారు, కొంతమంది పాపాలు–పుణ్యాలు రెండూ చేస్తారు, కొంతమంది పుణ్యాలే చేస్తారు. అలా చేయడానికి కారణం ఎవరైతే తమోగుణం, రజోగుణంలో వుంటారో వారు పాపాలే ఎక్కువ చేస్తూ వుంటారు. అలాగే కొంతమంది పాపాలతో పాటు పుణ్యాలు కూడా అంటే మంచి పనులు కూడా చేస్తుంటారు. ఈ రెండు గుణాలు దాటి, అంటే తమోగుణం, రజోగుణం దాటి సాత్వికగుణంలోకి వచ్చిన వారు పాపాలు చేయరు పుణ్యాలే చేస్తారు, మంచి పనులే చేస్తారు.

అందుకే నేను ధ్యానం చేసే వారిని కనీసం ఆ స్థాయికైనా రమ్మంటాను. సాత్విక గుణం అంటే మనస్సు శుద్ధి చేసుకోవటం. మనస్సు శుద్ధి అయితేనే సాత్విక గుణంలోకి వస్తారు. బాగా శుద్ధి చేసుకుంటే వారు శుద్ధ సాత్విక స్థితికి వెళ్తారు.

అందుచేత ఒకడు పాపాలే చేసాడు అనుకుందాం. వాడిని సహాయకులు భువర్లోకం తీసుకు వెళ్ళి అక్కడ వదిలేస్తారు. ఈ భువర్లోకంలో కూడా ఎనిమిది

భాగాలు వున్నాయంటారు పత్రిగారు. అందులో పై భాగాలు నాలుగు, క్రింద నాలుగు భాగాలు వుంటాయి. ఈ క్రింది భాగాలలో పూర్తిగా పాపాలు చేసే వాళ్ళు వుంటారు. పై భాగాలలో పాపాలు, పుణ్యాలు చేసే వాళ్ళు తీసుకెళ్ళబడతారు.

ఎవరైతే సాత్విక గుణంలోకి వచ్చి అన్నీ పుణ్యాలు చేస్తే సువర్లోకం అంటే స్వర్గలోకం తీసుకు వెళ్ళబడతారు.

భూలోకానికి ఎన్నో రెట్లు పెద్దగా భువర్లోకము ఉంటుంది. అలాగే సువర్లోకం కూడా చాలా పెద్దది. ఈ భూలోకమే మన అంచనాకి దొరకదు. ఇక దాన్ని బట్టి మిగతా లోకాలు ఎలా వుంటాయో మనం ఒక్కసారి అర్థం చేసుకోవచ్చు.

భగవద్గీతలో తొమ్మిదవ అధ్యాయం 21వ శ్లోకంలో ఏం చెప్పబడింది అంటే ?

**శ్లో॥ తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి।**
**ఏవం త్రయీ ధర్మ మను ప్రపన్నా గతాగతం కామకామా లభన్తే॥**

తాత్పర్యం :- వారు విస్తారమగు స్వర్గలోకమున భోగములను అనుభవించి, భోగ కారణమగు పుణ్యము నశింపగా, మనుష్య లోకమునకు తిరిగి వచ్చుచున్నారు. ఇట్లు కేవలము వైదిక కర్మలననుష్టించుచు, సంసార చక్రమున తిరుగుచున్నారు.

అంటే విశాలమైన స్వర్గలోకం అంటే ఎంత పెద్దదో అని చెప్పటం జరిగింది. అందుచేత సువర్లోకం అంటే ఏదో మన భూలోకంలాగా కొన్ని దేశాలు అనుకోవటం కాదు. ఎన్ని ఉంటాయో అంతే లేదు.

భూలోకంలో ఉండే మానవ ఆత్మలు ఎన్ని వున్నాయంటే? సుమారు 700 కోట్లకు పైనే వుంటాయి. అలాగే ప్రతి లోకంలో వందల, వందల కోట్ల మానవ ఆత్మలు వుంటాయి. ఎవరి అర్హతను బట్టి వారు ఆ లోకాలకి వెళ్ళిపోతారు.

భువర్లోకానికి చేరుకున్న తర్వాత ఏం జరుగుతుందంటే? ఏ ఆత్మ అయినా సరే, మొదట్లో విశ్రాంతి తీసుకుంటుంది. ఇక అక్కడ స్త్రీ పురుష భేధాలు వుండవు. పై లోకాలలో వుండేవన్నీ ఆత్మలే. ఎందుచేతనంటే

నిజజీవితంలో ఎన్నో కష్టాలు పడ్డారు. ఎన్నో బాధలు అనుభవించారు, అలసిపోయారు. అందుచేత అక్కడికి వెళ్ళిన తర్వాత మొదట్లో చాలా కాలం విశ్రాంతి తీసుకుంటారు.

విశ్రాంతి అయిన తర్వాత కాస్త తేరుకుంటారు. తేరుకొని తాను అంతకు ముందు చేసిన పనులన్నీ నెమరు వేసుకుంటూ ఉంటారు. నేను ఏమి చేసాను? ఎన్ని పాపాలు చేసాను? ఎన్ని తప్పులు చేసాను? ఎంత హింస చేసాను? ఎన్ని కోళ్ళను చంపాను? ఎన్ని మేకల రక్తం తాగాను? అని గుర్తు చేసుకుంటూ చేసిన పనులన్నీ గుర్తు చేసుకుంటారు. అలా ఒక్కొక్కటి గుర్తుకు వచ్చి ఫీల్ అవుతారు.

వాటిని అలా హింసించానే, నాకు అలా జరిగితే నా పరిస్థితి ఏమిటి? అని అనుకోగానే అదే రకమైన హింస వారు అనుభవిస్తారు. అలా ఆ జీవితంలో చేసినవన్నీ ఒక్కొక్కటి గుర్తు చేసుకుంటూ, ఇలా చేసాను ఏంటి? అని అనుకోవటం, ఎప్పుడైతే అనుకుంటారో ! ఆ నరకం అనుభవిస్తారు, ఆ కోడి ప్లేస్‌లో వీడే వుంటారు. ఆ నరకం అనుభవిస్తారు. ఇలా అన్నీ అనుభవిస్తూ వుంటారు. అలా ఏది అనుకుంటే అది అయి పోతుంది. అలాగే వారు ఏదైనా తినాలని అనుకున్నా, చెయ్యాలనుకున్నా, అవి అన్నీ ఆటోమేటిక్‌గా అక్కడ సమకూరిపోతాయి.

అలా చాలా కాలం ఇవన్నీ అయిన తర్వాత, అంతకు ముందు మిగిలి పోయిన కోరికలు, ఎటువంటివి వుంటే అన్నీ నెరవేరిపోతాయి. అంతా అయిపోయాక ఇక ఏమి చేయాలి? అంటే ఏమీ వుండవు. ఊహించుకున్నవి అన్నీ అయిపోయాయి. దీనికంతటికీ కొంత టైమ్ పడుతుంది. అలా కోరికలన్నీ తీరిపోగానే మనోమయ శరీరం అంటే సూక్ష్మ శరీరం రాలిపోతుంది. ఈ మనోమయ శరీరం రాలిపోయాక వుండేది కారణ శరీరం.

మళ్ళీ తెలుసుకుందాం. భూమి మీద మొదటి రోజు స్థూల శరీరం వదిలేస్తారు. మూడో రోజు ప్రాణమయ శరీరం రాలిపోతుంది. అలాగే సూక్ష్మ శరీరం అంటే మనోమయ శరీరం భువర్లోకంలో కోరికలన్నీ తీరిపోయిన తర్వాత రాలిపోతుంది. అప్పుడు ఉండేది కారణ శరీరం కాబట్టి, ఆ కారణ శరీరంతో కారణ లోకం అయినటువంటి జనాలోకానికి చేరుకుంటారు. సూక్ష్మ శరీరంతో జనాలోకానికి వెళ్ళలేరు. భౌతిక శరీరంతో భువర్లోకానికి చేరుకోలేరు. స్థూల

శరీరం భూలోకంలోనే ఉంటుంది. సూక్ష్మ శరీరమే భువర్లోకానికి చేరుకోగలుగుతుంది. అక్కడ సూక్ష్మ శరీరం కూడా వదిలేసి కారణ శరీరంతో జనాలోకానికి చేరుకో గలుగుతారు.

అలాగే కొంతమంది పాపాలు, పుణ్యాలు చేస్తారు. వారు భువర్లోకంలో ఉన్న పై లోకాలకి తీసుకువెళ్ళబడతారు. అక్కడ కూడా ముందు విశ్రాంతి తీసుకుంటారు. రెస్ట్ తీసుకుని కొన్ని పాపాలు చేసాడు కాబట్టి వాడిలాగే వీడు అవి ఊహించుకుంటూ, ఆ తప్పులు గుర్తు చేసుకుంటూ, నేను ఏమైనా అనుభవించాల్సి వస్తుందేమో అనుకుంటూ ఉంటే దానికి తగ్గ ఆ నరకం అనుభవించేస్తారు. అలాగే కోరికలన్నీ తీర్చుకుంటూ వుంటారు.

ఆ పాప కర్మలు అన్నీ అయిపోయాక వుండే పుణ్య కర్మలు వల్ల వీరు సువర్లోకానికి చేరుకుంటారు. అంతేకాదు ఎవరైతే సాత్విక గుణంలోకి వస్తారో, మనస్సుని శుద్ధి చేసుకుంటారో వారు పాపాలు చేయరు, పుణ్యాలే చేస్తారు. వారు కూడా సువర్లోకం చేరుకుంటారు.

సువర్లోకము అంటే స్వర్గలోకం, చాలా అద్భుతంగా వుంటుంది. ఎన్నో రమణీయమైన దృశ్యాలు, పక్షుల కిలకిలారావాలు, అందమైనటువంటి వృక్షాలు, పుష్పాలు, సెలయేళ్ళు ఎంతో సుందరంగా ఆహ్లాదంగా ఉంటుంది. అలా చేరుకున్న తర్వాత ముందు విశ్రాంతి తీసుకుంటారు. వారికి మిగిలిపోయిన కోరికలు ఒక్కొక్కటే ఊహించుకుంటూ వుంటే అవన్నీ నెరవేరి పోతూ వుంటాయి. అలా చాలా రోజులు అంటే ఇన్నాళ్ళు అన్న లిమిట్ ఏమీ లేదు, ఎన్ని సంవత్సరాలైనా ఎవరూ కాదనే వారు వుండరు. వారి ఇష్టం, చివరకు ఎన్నాళ్లు ఇలా వుంటుంది అనిపిస్తుంది. అలా వారికి వున్న కోరికలన్నీ తీరిపోయిన తర్వాత ఆ మనోమయ శరీరం రాలిపోతుంది.

భౌతిక శరీరం రాలిపోతే ప్రాణమయ శరీరం వుంటుంది. అది రాలిపోతే మనోమయ శరీరం వుంటుంది. మనోమయ శరీరం రాలిపోతే కారణ శరీరం వుంటుంది. ఈ శరీరాలు ఒక దాని కంటే ఒకటి చాలా సూక్ష్మమైనవి, తేలికైనవి. ఎంత సూక్ష్మ స్థితికి చేరుకుంటే అంత గొప్ప లోకాలకి చేరుకోగలరు. అలా కారణ లోకానికి అంటే జనాలోకానికి వెళ్తారు.

జనాలోకం చాలా పెద్దది. ఎంత పెద్దది అంటే ఎవరి ఊహకి అందదు. అలాగే పాపాలు చేసిన వాడు కూడా భువర్లోకం నుండి జనా లోకానికి వస్తారు.

అక్కడ ఊర్ధ్వ లోకాల నుంచి వచ్చిన మాస్టర్స్ కౌన్సిలింగ్ చేస్తారు.

ఊర్ధ్వ లోకాలు అంటే మహాలోకం, తపోలోకం, సత్యలోకం. ఈ లోకాలలో ఉండే వారినే ఊర్ధ్వలోకపు వాసులు అంటారు. వీరు కారణ లోకం వచ్చిన వారికి కౌన్సిలింగ్ చేస్తారు. వారు ఏమి చెబుతారంటే? అసలు నువ్వు భూలోకానికి వెళ్ళి ఏం చేయాలి? ఏం చేసావు? వెళ్ళింది దేని కోసం? నీ జీవితంలో చేయవలసింది మానేసి, ఇంకేదేదో చేసి సమయమంతా వృధా చేసుకొచ్చావు. నీకివ్వబడిన అవకాశాన్ని ఉపయోగించుకోలేక పోయావు. చాలా తెలివి తక్కువ వాడిలా వున్నావే నువ్వు అని చెప్తారు.

అవన్నీ వింటూ వుంటారు. మరి ఏం చేయాలండి? అని అడుగుతారు. నాయనా! నువ్వు ఈ లోకాలే అనుకుంటున్నావు. ఇంతకన్నా ఏమీ లేవని అనుకుంటున్నావు. కానీ ఈ సృష్టిలో వీటి కంటే ఇంకా గొప్ప గొప్ప లోకాలు వున్నాయి. ఆ లోకాలకి చేరుకోవాలి. పాపాలు చేస్తూ, మాంసం తింటూ, ఆ జంతువులను చంపుతూ, ఈ క్రింద లోకాలలో ఇన్ని బాధలు పడే కంటే, ఆ పై గొప్ప లోకాలు చేరుకునే ప్రయత్నం చేయి. మంచి అవకాశం నీకు ఇవ్వబడింది, నీకు ఒక దేహం ఇవ్వబడింది. దేహంతో నువ్వు ఎన్నో సాధించవచ్చు. ధ్యాన సాధన చేయవచ్చు, పుస్తకాలు చదవొచ్చు, అందరి మాటలూ వినవచ్చు, సేవలు చేయవచ్చు. ఇవన్నీ చేసి పుణ్యం సంపాదించుకుని, గొప్ప లోకాలకి చేరుకోవచ్చు. జ్ఞానం సంపాదించుకుని గొప్పవారు కావచ్చు. కానీ ఆ పనులు మానేసి పనికి రాని పనులన్నీ చేసావు అని అర్థమయ్యేటట్టు చెప్తారు వాళ్ళు.

అలా జనాలోకంలో పాపాలు చేసే వారికి, పుణ్యం చేసే వారికి కౌన్సిలింగ్ వుంటుంది. వారు ఇంకా ఏమి చెబుతారంటే? నువ్వు పాపాలతో పాటు పుణ్యాలు చేసావు బాగానే ఉంది, అసలు పాపాలు ఎందుకు చేసావు? ఈసారి ఆ పనులు చేయకు అని చెప్పడం జరుగుతుంది. అలాగే పుణ్యాలు చేసే వారికి నాయనా! ఈ పుణ్యాలే కాదు, పుణ్యాలకి మించింది వుంది. నువ్వు ఎంత పుణ్యం చేసినా క్రింద లోకానికే వెళ్తున్నావు. ఆ పై లోకాలకి, ఊర్ధ్వ లోకాలకి చేరుకోలేకపోయావు. అందుచేత ఈ పుణ్యాలు కాదు, పుణ్య కర్మలు కాదు, ముక్తి కర్మలు అంటే ఆత్మ కర్మలు అంటే ఏవైతే ఆత్మకు లాభిస్తాయో! ఆత్మ అయిన నిన్ను ఊర్ధ్వ లోకాలు చేరుస్తాయో అవి చేయాలి. ఇంకా ధ్యానం చేయాలి, జ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలి, ఆత్మజ్ఞానం బోధించే వారి

సందేశాలు వినాలి, ఆత్మ సేవలు చేయాలి, ఇవన్నీ చేస్తూ నువ్వు జ్ఞానం సంపాదించు కోవాలి. అప్పుడు నువ్వు పై లోకాలకి చేరుకోగలుగుతావు అని వాళ్ళు చెప్తారు.

అప్పుడు వాడికి అర్ధమవుతుంది. నేను ఇవే అనుకున్నాను. ఇంకా పై లోకాలకి వెళ్తే ఎంత గొప్పగా వుంటుంది? అని ఆలోచిస్తాడు. అప్పుడు వాడిలో కొంత మార్పు వస్తుంది. కానీ ఇది కొంతమందికి అర్థం కాదు. కానీ కొంతమంది ఏమంటారంటే ఏమండీ, అలా అయితే మేము మీరు చెప్పినట్టుగా ఆ పనులన్నీ చేస్తాం. మళ్ళీ మాకు అవకాశం ఇవ్వండి అంటే శరీరం ఇవ్వండి అంటారు. ఇంకా కొంతమంది అంతకు ముందు పడిన బాధలు, కష్టాలు అన్నీ మళ్ళీ గుర్తు తెచ్చుకుని ఎందుకు అక్కడికి వెళితే లేనిపోని కష్టాలు, గొడవలు, భర్తతో గొడవ, భార్యతో గొడవ, పిల్లలతో గొడవ, ఆర్థిక ఇబ్బందులు, ఈ రకరకాలైనటువంటివి ఎందుకు, ఇక్కడే వుండిపోవచ్చు కదా అనుకుంటారు. అలా అక్కడే వుండిపోయేవారు అక్కడే ఉండిపోతారు.

ఇక్కడ ఒక్కటే తెలుసుకోవలసింది. ప్రతి వారికి స్వేచ్ఛ ఉంది. ఎవరికీ ఏదీ, ఎక్కడా బలవంతం వుండదు. అందుచేత ఉండిపోవాలి అనుకున్న వారు ఉండిపోతారు. కారణం అక్కడ ఎన్నాళ్ళు కావాలంటే అన్నాళ్ళు ఉండు అంటారు. వెళ్ళాలి అనుకున్న వారు ఏమంటారంటే? మేము ఏమైనా సరే వెళ్తాము. మీరు చెప్పినట్టు చేస్తాము. ఇక్కడే కూర్చుని ఏం చేస్తాము? ఎన్నాళ్ళు కూర్చుంటాము, ఏముంది ఇక్కడ అంటూ? మరి ఏం చేయాలో చెప్పండి అని అంటారు.

అప్పుడు ఎవరైతే వెళ్లటానికి సిద్ధంగా వున్నారో వారు ఒక్కొక్కరిని ఒక గదిలోకి పంపుతారు. ఆ గదిని ఆకాశిక్ రికార్డ్స్ రూమ్ అంటారు. ఆ గదిలో పెద్ద స్క్రీన్ వుంటుంది. ఆ స్క్రీన్ మీద వీరికి ఆ జన్మలో, చిన్ననాటి నుండి ఏవైతే కర్మలు చేసారో, అవన్నీ సినిమాలా కనిపిస్తాయి.

వారు ఎన్ని హింసలు చేసారో! ఎంత మందిని బాధించారో! ఎంత మందిని మోసగించారో! ఎంతమందిని అన్యాయం చేసారో! ఎంతమందిని ఏడిపించారో! ఎంతమందికి సేవలు చేసారో! ఎంతమందికి ఉపకారం చేసారో! ఎంతమందికి లాభం కలిగించారో! ఎంతమందికి భోజనం పెట్టారో! ఇలాగా చేసినవి అన్నీ కనిపిస్తాయి. అలా వారు చేసిన కర్మలన్నీ చూపించబడతాయి.

ఆ గదిలోకి పంపేటపుడే ఆ గదిలోకి వెళ్తున్నావు అందులో నువ్వు చేసిన కర్మలన్నీ కనిపిస్తాయి. నువ్వు జన్మ తీసుకోవాలనుకుంటున్నావు కాబట్టి అందులో ఎన్ని కర్మలు నువ్వు అనుభవించాలనుకుంటున్నావో! వాటిని నువ్వు సెలక్ట్ చేసుకో. అంటే ఎన్ని పాప కర్మలు, ఎన్ని పుణ్య కర్మలు నువ్వు అనుభవించాలను కుంటావో! వాటిని సెలక్ట్ చేసుకో అంటారు.

అలా వీరు చేసిన కర్మలన్నీ చూసుకుంటారు, గుర్తుపెట్టుకోండి అక్కడ సహజంగా ఎక్కువ పాప కర్మలు చేసి వచ్చిన వారికి, సెలక్ట్ చేసుకోవడానికి ఆ పాప కర్మలే వుంటాయి. అందులో నుంచి కొన్ని తీసుకుంటారు. పుణ్యకర్మలు బాగా తక్కువ వుంటే అవి కొద్దిగానే తీసుకుంటారు. పాప కర్మలు, పుణ్యకర్మలు చేసిన వారు, అవి కొన్ని, ఇవి కొన్ని తీసుకుంటారు.

ఇంకా కొంతమంది పుణ్యకర్మలే చేసి వచ్చిన వారు వుంటారు. వారు ఆ పుణ్య కర్మలే తీసుకుంటారు. ఏవైనా వుంటే ఒకటీ, అరా పాప కర్మలు తీసుకుంటారు. అలా వారు సెలక్ట్ చేసుకుంటారు. ఇక్కడ కూడా మీరు తెలుసుకోవలసింది ఏమిటంటే? ఏది బలవంతం లేదు. అంతా మన ఇష్టమే. ఇంకొకటి, గత జన్మలలో వాడు చాలా కర్మలు చేసాడు. ఎన్ని చేసినా కూడా అన్నీ తీసుకోవాలని ఏమీ వుండదు. అందులో వీరు సెలక్ట్ చేసుకున్నవే, వీరు నిర్ణయించుకున్నవే, వీరు ఎంచుకున్న కర్మలే వీరు తీసుకోవడం జరుగుతుంది.

చూడండి ఎక్కడా కూడా బలవంతం ఉండదు. అంతా వారి, వారి ఇష్ట ప్రకారమే జరుగుతుంది. వారు చేసిన కర్మలలో, వారు ఎంచుకున్నవే వారు తీసుకోవటం జరుగుతుంది. అలా ఎంచుకున్న కర్మలనే ప్రారబ్ధ కర్మలు అంటారు. వాటిని తీసుకొని భూమి మీదకు వచ్చినప్పుడు అవి అనుభవిస్తూ ఉంటారు. ఆ కష్టాలు వచ్చినప్పుడు ఏమంటారంటే? దేవుడు నన్నిలా కష్ట పెట్టాడు అంటారు. కాని ఇక్కడ ఎవరూ ఎవరిని కష్ట పెట్టే వాళ్ళు లేరు. కారణం, వాడి ఇష్ట ప్రకారం, వాడు చేసిన కర్మలలో వాడు ఎంచుకున్న కర్మలే వాడికి కేటాయించ బడతాయి. సహజంగా ఎక్కువ కష్టాలను అనుభవించేవారు భగవంతుడు నా రాత ఇలా వ్రాసాడు అని బాధపడతారు.

అందుకే పత్రి గారు ఏమంటారంటే? “నీ వాస్తవానికి నువ్వే సృష్టికర్తవు” అంటారు.

ఇప్పుడు నీ జీవితంలో జరిగే వాస్తవము అంటే కష్టం వచ్చింది, లేకపోతే

భోగం వచ్చింది, లేకపోతే యాక్సిడెంట్ అయింది, లేకపోతే విపరీతమైన జబ్బు వచ్చింది, భరించలేని జబ్బు వచ్చింది, లేకపోతే ఏదైనా వచ్చింది, ఓ పిచ్చోడిలా పుట్టాడు, లేకపోతే బుద్ధి మాంద్యంతో పుట్టాడు, జైలులో పడ్డాడు, శత్రువుల చేతిలో చిక్కి నరకం అనుభవించాడు, పోలీసుల దగ్గర చిత్రహింసలకు గురయ్యాడు, స్త్రీ రూపంలో బ్రోతల్‌హౌస్‌లో చిక్కి అక్కడ నరకం అనుభవించింది. ఇంకొంతమంది భర్తల చేత, కుటుంబీకుల చేత గృహహింస అనుభవిస్తారు.

ఇట్లా రకరకాలుగా హింస అనుభవిస్తారు. అవి అనుభవిస్తూ ఉంటే దేవుడు ఏంటి నన్ను ఇలా చేశాడు, నా జీవితాన్ని ఇంతలా నాశనం చేశాడు. నేనేం చేశాను అని బాధపడుతూ ఉంటారు. దేవుడుని నిందిస్తారు. నిజంగా దేవుడు ఉన్నాడా? అంటారు. రోగాలు వచ్చినవాడు, ఆ కష్టం వచ్చినవాడు, ఇంకా ఏమంటారంటే? నేను ఎన్నో పూజలు చేశాను, ప్రార్థనలు చేసాను. అయినా నాకింత కష్టం వచ్చింది అంటూ బాధపడుతూ వుంటారు. కానీ గుర్తుపెట్టుకోండి. ఇవన్నీ కూడా వారు ఇంతకు ముందు చేసిన కర్మల నుంచి, వాళ్ళంతట వాళ్ళ ఇష్ట ప్రకారం ఎంచుకున్నవే తప్ప, ఎవరూ వీళ్ళ మీద బలవంతంగా రుద్దింది కాదు.

అందుచేత రోగాలు ఉన్న వాళ్ళు కానీ, కష్టాలు భరించలేని వాళ్ళు కానీ అర్థం చేసుకోవాలి. ఈ జన్మ నేనే ఎంచుకున్నాను, ఈ కర్మలు నేనే ఎంచుకున్నాను, ఈ జీవితం నా ఇష్టప్రకారం నేను ఎంచుకున్నదే అని మీకు అర్థమైతే వాటిని ధైర్యంగా అనుభవిస్తారు. లేకపోతే ఇలా అయిపోయిందేమిటి నా జీవితం అని విలవిలలాడి పోతారు, దడ దడ లాడిపోతారు. అందుచేత మన వాస్తవానికి మనమే సృష్టికర్తలం అని తెలుసుకోవాలి.

పై లోకాలకు రకరకాల వాళ్ళు వెళ్తారు. ఎక్కువ పాపాలు చేసిన వాళ్ళు వెళ్తారు, పాపాలు పుణ్యాలు చేసిన వాళ్లు కూడా వెళ్తారు. ఉత్తి పుణ్యాలు చేసిన వాళ్లు కూడా వెళ్లారు. సహజంగా భూమి మీదకి వెళ్ళాలంటే ముందు ఆలోచించుకుంటారు. మరి ఈ పాపాలన్నీ తీసుకుని భూమి మీదకు వెళితే నా బ్రతుకు ఏమవుతుంది? మళ్ళీ వెళ్లాలా? మానాలా? వెళితే ఏమవుతుంది? ఇక్కడే ఉంటే ఏమవుతుంది? అని ఆలోచిస్తారు!

చివరకు ఇక్కడ ఎన్నాళ్ళు ఉంటాను? అందుచేత వెళ్లి ఈసారైనా

జీవితాన్ని సరి చేసుకుంటాను, ఇక అలాంటి పనులు చేయను, ఆ తప్పులు చెయ్యను, ఆ పాపాలు చెయ్యను, ఏదో రకంగా కష్టమైనా, నష్టమైనా సరే ఎంచుకున్న పాపకర్మలు అనుభవించేస్తాను. ఇప్పటి నుంచైనా ఏ తప్పులు చేయను అప్పుడు నా భవిష్యత్తు మారిపోతుంది కదా? అని చెప్పి భూమి మీద జన్మ తీసుకోవడానికి నిర్ణయించుకుంటారు.

కానీ మరి కొంతమంది ఆలోచిస్తారు! జన్మ తీసుకుంటే మళ్ళీ కష్టాలు అనుభవించాలి కదా? ఎందుకొచ్చిన గొడవ ఇక్కడే ఉండిపోతే పోలే! అని అనుకుంటూ అక్కడే ఉండిపోవాలనుకుంటారు.

కొంతమంది మాత్రం ఇక తప్పదు, ఇక్కడే ఏం చేస్తాం? ఎన్నాళ్ళు వుంటాం? అని చెప్పి కొన్నికర్మలు సెలెక్ట్ చేసుకుంటారు. ఎక్కువ పాపకర్మలు చేసినవారు పాపకర్మలే సెలెక్ట్ చేసుకుంటారు, ఎప్పుడైతే వీళ్లు అనుభవించాల్సిన కర్మలు సెలెక్ట్ చేసుకుంటారో! అలా సెలెక్ట్ చేసుకున్న కర్మలనే ప్రారబ్ధ కర్మలు అంటారు. అప్పుడు అక్కడ ఉన్నటువంటి మాస్టర్స్ వాళ్ళ యొక్క నాడీమండల శరీరాన్ని ఈ కర్మలతో తయారుచేస్తారు. నాడీ మండల శరీరం అంటే కంటికి కనిపించేది కాదు. పాపకర్మలు ఎక్కువ ఉంటే నాడీమండల శరీరం మలినంగా ఉంటుంది. పుణ్యకర్మలు ఎక్కువ వుంటే ఆ నాడీ మండల శరీరం శుద్ధంగా వుంటుంది.

ఇదే మనకి స్పిరిచ్యువల్ రియాలిటీ వీడియోలో చూపిస్తారు. అందులో ధ్యానం చేసేటపుడు ఆలోచనలు ఆగినపుడు, పై నుంచి విశ్వశక్తి వచ్చినప్పుడు, ఈ నాడీ మండల శరీరంలో వున్నటువంటి మలినాలన్నీ శుద్ధి కావించబడుతూ వుంటాయి అన్నది మనకు చూపిస్తారు.

అంతేకాదు ఆ మాస్టర్లు ఇంకా ఏం చూస్తారంటే వీడు తీసుకున్న ఈ కర్మలు అనుభవించాలంటే? ఎలాంటి తల్లి గర్భంలో తయారయ్యే శిశువులో వీడిని ప్రవేశపెడితే ఈ కర్మలన్నీ వీడు అనుభవించగలుగుతాడు అన్నది చూస్తారు. వాడు పేదవాడుగా పుట్టాలంటే? పేదవాడి తల్లి గర్భం కావాలి. వాడు ఎంచుకున్న కర్మలను బట్టి ధనవంతుడిగా పుట్టవలసి వస్తే బాగా డబ్బు వున్న తల్లి గర్భం కోసం చూస్తారు. అందంగా పుట్టాలి అంటే అందమైన తల్లిదండ్రులు వున్నటువంటి గర్భం కోసం చూస్తారు. అందవికారంగా పుట్టాలంటే? అలాంటి వారు నల్లగా వున్న తల్లి గర్భం కోసం చూస్తారు.

అలా ఏ కర్మలు అయితే ఎంచుకున్నాడో! దానికి అనుగుణంగా, అంటే స్త్రీ గానా, పురుషుడి గానా, ఏ కులంలో, ఏ మతంలో, ఏ ప్రాంతంలో, ఏ దేశంలో అన్నది ఎంచుకున్న కర్మలను బట్టి నిర్ణయించబడుతుంది.

చూడండి అంతకు ముందు జన్మలలో పురుషుడిగా జన్మించాడు. భార్యని చాలా ఇబ్బంది పెట్టాడు. ఇప్పుడు ఇబ్బంది పడే జన్మ తీసుకోవాల్సి వస్తుంది. అంటే తాను స్త్రీ అయి దానికి అనుగుణమైన బాధలు అనుభవించాలి. అలాగే అంతకు ముందు స్త్రీ అయి భర్తను బాధపెట్టింది. ఇప్పుడు దానికి తగ్గట్టుగా మళ్ళీ అలాంటి జన్మ వస్తుంది.

అలా అనుభవించవలసిన కర్మలు నిర్ణయించుకున్నాక అక్కడి మాష్టర్సు ఆ కర్మలు అనుభవించడానికి అనుగుణమైన తల్లి గర్భం కోసం చూస్తారు. కానీ వెంటనే దొరకవు కదా? అందుచేత ఎదురుచూస్తారు.

కొంతమంది అలా ఎదురుచూడలేక కంగారు పడేవారు, అంటే అప్పటికే 500 సంవత్సరాలు, 1000 సంవత్సరాలు ఆగినా అటువంటి గర్భం దొరకకపోతే ఏమంటారంటే? కొంచెం అడ్జెస్ట్‌మెంట్ చెయ్యండి, నాకు కోట్లు అవసరం లేదు, లక్షల్లో వున్న తల్లి గర్భం ఉంటే చూడండి అంటారు. అలాగే అందంగా పుట్టాలి, కానీ గర్భం దొరకలేదు. అప్పుడు ఏమంటారంటే నాకు అందం అక్కర్లేదు, ఏదైనా ఫరవాలేదు అంటారు. ఇలాగ అడ్జస్టైంట్ అవుతారు. అలాగే కుటుంబంలో, కులంలో, మతంలో, ప్రాంతంలో, దేశంలో అడ్జస్ట్‌మెంట్ అవుతారు. కానీ తరువాత బాధపడతారు. కానీ అంతా వారి ఇష్టప్రకారమే జరుగుతుంది.

చూడండి పెళ్ళి సంబంధాలు చూసుకునేటప్పుడు స్త్రీ అయినా పురుషుడు అయినా సరే, ముందు ఎన్నో కోరికలు వుంటాయి. ఆ భర్తకి ఎంతో అందం ఉండాలని, ఎంతో డబ్బు ఉండాలని, వాడి గుణాలు బాగుండాలని స్త్రీ చూస్తుంది. అలాగే వీడూ ఆ స్త్రీ అందంగా వుండాలి, అప్సరసలా వుండాలని అనుకుంటాడు వీడు మటుకు నీగ్రోలా వుంటాడు; వీడికి ఐశ్వర్యరాయ్ కావాలి. అలా కోరికలు బాగానే వుంటాయి. మంచి కట్నం కావాలి, మంచి హోదా వుండాలి.. ఇవన్నీ అనుకుంటూ వుంటాడు. కానీ అటువంటి సంబంధాలు దొరకకపోతే ఏం చేస్తాడు... ఒక్కొక్కటి, ఒక్కొక్కటి తగ్గిపోతాయి. అడ్జస్ట్ అయిపోతారు, ఫర్వాలేదు, ఫర్వాలేదు అని. చివరికి ఏ స్థాయికి వస్తారంటే భార్య దొరికితే చాలని వాడు,

మొగుడు దొరికితే చాలని ఈవిడ చూస్తారు. ఎవరైనా ఊ కొడితే చాలు వీరు ఊ అనేస్తారు. పై లోకాలలో కూడా అంతే! వీడికి అనుకూలమైంది, సూటబుల్ అయినది రాకపోతే అడ్జస్ట్మెంట్ చేసుకుని క్రిందకి వస్తారు. భూమి మీదకు వచ్చాక మళ్ళీ బాధపడతారు ఇలాంటి జన్మ వచ్చిందే అని.

కానీ ఏది ఏమైనా పైన అంతా వారి ఇష్టమే. వారు ఆగుతానంటే ఎంతకాలమైనా, ఎన్ని సంత్సరాలైనా ఆగమంటారు. ఎన్ని వేల సంవత్సరాలు ఆగినా వాళ్ళకు అభ్యంతరం వుండదు. అందుచేత అక్కడ కూడా వాళ్ళ ఇష్టమే.

అలా మూడు రకాల వాళ్ళు వుంటారు. ఎక్కువగా పాప కర్మలు తీసుకుని భూమి మీదకి వచ్చిన వాళ్ళు, పాపాలు-పుణ్యాలు కూడా తెచ్చుకున్న వాళ్ళు వుంటారు. ఎక్కువ పుణ్యకర్మలు తెచ్చుకున్న వాళ్ళు వుంటారు. సహజంగా వీరు అలా భూమి మీదకి వచ్చిన తర్వాత, మీరు గమనించినట్లయితే, మీకు రకరకాల వాళ్ళు కనిపిస్తారు. కొంతమంది ఎంతో మంచిగా వుంటారు. కానీ కష్టాలు వస్తాయి, భరించలేని కష్టాలు కూడా వస్తాయి. అంటే వారు గతంలో చేసిన పాపాలు తెచ్చుకోవడం వల్లనే?

అలాగే కొంతమంది జీవితాలు గమనించినట్లయితే కొన్ని కష్టాలు వస్తుంటాయి, కొన్ని భోగాలుంటాయి. కారణం పాపాలు, పుణ్యాలు రెండూ తెచ్చుకున్నారు కాబట్టి.

అలాగే కొంతమంది వుంటారు. వారు అన్నీ పుణ్యకర్మలే తెచ్చుకున్నారు. వారి జీవితం చాలా వైభవంగా ఉంటుంది, ఏ లోటూ వుండదు. ఆర్థికంగా గానీ, ఇంకో రకంగా గానీ, అన్నీ బాగానే వుంటాయి. ఆ గర్వంతో విర్రవీగుతూ తప్పులు, పాపాలు చేస్తారు. ఈ వెధవ ఇన్ని పాపాలు చేస్తున్నాడు? వీడికేంటి ఇంత డబ్బు అని తిట్టుకుంటూ వుంటారు కూడా.

దీనికి ముఖ్య కారణం ఇప్పుడు వెధవ పనులు చేస్తున్నా కూడా గతంలో చేసుకున్న పుణ్యకర్మలు తెచ్చుకోవడమే కారణం!

అందుచేత తెలుసుకోండి మనం ఇక్కడ ఇలా ఉండటానికి కారణం పై లోకాలలో మనం నిర్ణయించుకున్న దాన్నిబట్టే.

# నేర్చుకునే జన్మలు - నేర్పించే జన్మలు

చూడండి జనాలోకం పైన చాలా గొప్ప లోకాలు ఉన్నాయి. అవి చాలా గొప్ప లోకాలు. అవి మహాలోకం, తపోలోకం, సత్యలోకం అని చెప్పుకున్నాం.

సహజంగా మనకి వచ్చే సందేహం ఏమిటంటే? అందరూ జనాలోకం వెళ్లి, మళ్లీ తిరిగి వస్తారు. మరి ఆ పై లోకాలకి ఎలా వెళ్తారు? ఎప్పుడు వెళ్తారు? అసలు ఆపై లోకాల యొక్క గొప్పతనం ఏమిటి? అన్న విషయాల మీద అవగాహన కలగాలి, లేకపోతే ఏమి ఉపయోగం లేదు.

పాపాలు చేసేవారు, పుణ్యాలు చేసేవారు భువర్లోకము, సువర్లోకం వెళ్ళి, అక్కడ నుంచి జనాలోకం వెళ్లి తిరిగి వస్తుంటారు. ఇలా ఎన్ని జన్మలు తిరుగుతారు? అంటే కచ్చితంగా 300 నుండి 350 జన్మలు తిరుగుతారు. ఎందుకంటే? తమోగుణంలో ఉన్న వాళ్ళు, రజోగుణంలో ఉన్న వాళ్ళు తప్పులు, పాపాలు చేస్తారు. ఏమైనా కొద్దిగా పుణ్యాలు చేస్తే చేయొచ్చు.

తమోగుణంలో 100 నుంచి 150 జన్మలు పడుతుందని, రజోగుణంలో ఇంకొక 100 నుంచి 150 జన్మలు పడుతుందని పత్రిగారు చెప్పడం జరిగింది. సాత్విక గుణంలోకి వచ్చేసరికి మొత్తం మీద 300 జన్మలు పైగా పడుతుంది. ఈ సాత్విక గుణంలోకి వస్తే తప్ప పుణ్యాలు, పుణ్యకర్మలు చేయరు.

ఈ తమోగుణంలో ఉన్నవాళ్ళు, రజోగుణంలో ఉన్నవాళ్ళు చావడం... ఆ పైలోకాలకు వెళ్లడం... మళ్ళీ జనాలోకం వెళ్లడం... మళ్ళీ భూమి మీదికి రావడం... ఇదే జరుగుతూ ఉంటుంది. ఆఖరికి సాత్విక గుణంలోకి వచ్చినా ప్రారంభ దశలో పుణ్యాలే చేస్తారు, పాపాలేమి చెయ్యరు. కాని ఎన్ని పుణ్యాలు చేసినా, ఎంత చేసినా వాళ్లు కూడా ఆ సువర్లోకం అంటే స్వర్గలోకం చేరుకుని, అక్కడినుంచి జనాలోకం వెళ్లి మరల భూమి మీద జన్మ తీసుకుంటారు. ఇలా ఇంకొక 50 జన్మలు అయిపోతాయి. ఇంచుమించు 350 జన్మలు ఈ రోటేషన్‌లోనే వుంటారు వాళ్ళు. పుట్టడం, ఏవేవో చేయడం, చావడం, అనుభవాలు పొందడం, జనాలోకం వెళ్ళి మరలా భూమి మీదకు రావడం జరుగుతుంది. ఇన్ని జన్మలు కూడా అసలు జనాలోకం దాటి వెళ్లరు. దీన్నిబట్టి జనాలోకం దాటి వెళ్ళగలిగిన వాడు ఎంత గొప్పవాడో మీరు అర్థం చేసుకోండి.

ఇప్పుడు పత్రిగారు  పరిచయం అయ్యాక,  మనం భీమవరం క్లాసులు, ఈ జూమ్ క్లాసులు వింటూ ఆధ్యాత్మిక త్రిరత్నాలు పాటిస్తూ ఉంటే? జ్ఞానం పొంది ఆ అర్హత సంపాదించుకోవచ్చు.

అందుచేత జనాలోకం దాటాలి, అప్పుడే మీరు గొప్ప వాళ్ళు, చాలా గొప్ప వాళ్ళు. భూమ్మీద మీరు ఏది సాధించాలో అది సాధించిన వాళ్ల క్రింద లెక్క.  భూమి మీద ఏవో గొప్ప గొప్ప పనులు చేస్తే, మీరు ఏదో గొప్పవారు అయినట్టు కాదు, జనాలోకం దాటితేనే మీరు గొప్పవాళ్ళు. కారణం  జనాలోకం దాటిన తర్వాత  మహాలోకం, తపోలోకం, సత్యలోకం  ఉన్నాయి.  అవి చాలా గొప్ప, గొప్ప లోకాలు.  అక్కడ ఉండేవాళ్లంతా చాలా గొప్ప గొప్ప వాళ్ళు. మామూలు వాళ్ళు కాదు. మహాత్ములు అనండి, తపోధనులనండి, దేవుళ్ళు, దైవాలు అనండి, ఎవరినైతే గొప్పవాళ్లుగా చెప్పుకుంటున్నామో!  వాళ్ళంతా ఆ లోకాల్లో ఉండేవారు.  అలాంటి లోకాలకి మనం చేరుకోగలిగితే మనంకూడా గొప్పవాళ్ళమే.

మీరు ముఖ్యంగా తెలుసుకోవలసింది ఏమిటంటే? జనాలోకం క్రింద వుండే లోకాలను చేరుకునే వాళ్ళంతా నేర్చుకునేవారు. అలాంటి వారి జన్మలన్నీ నేర్చుకునే జన్మలు. కానీ జనాలోకంపైన వుండే లోకాలకు చేరుకునే వారంతా నేర్పేవారు. అలాంటి వారి జన్మలన్నీ నేర్పించే జన్మలు.

అందుచేత ఎంతసేపు ఇక్కడే బొంగరంలాగ తిరిగితే ఏం ప్రయోజనం లేదు. ఒకటే గుర్తుపెట్టుకోండి తమోగుణంలో దేహస్థితిలో ఉంటారు.  అంటే దేహానికి ప్రాముఖ్యం ఇస్తారు, ఓ కుంభకర్ణుడి లాగ. అంటే  ఖానా, పీనా, సోనా  తప్ప ఇంకో గొడవ ఉండదు. ఎంతసేపు ఏది తిందాం? ఎంత తిందాం? ఎలా తిందాం? ఏది తాగుదాం? ఈ గోలే తప్ప ఇంకో గోల ఉండదు. ప్రక్కవాడి గొడవ కూడా ఉండదు.  ఎంతసేపు  దేహ లాభాలు చూసుకుంటారు, దేహం నేను అనేటువంటి భావంలో వుంటారు.  నేను సుఖ పడాలి,  నేను అనుభవించాలి, నేను ఎంజాయ్ చేయాలి అనుకుంటూ ఏది తినాలో, ఏది తినకూడదో కూడా తెలీదు. అడ్డమైనవి తింటూ ఉంటారు, వాడికి రుచిగా ఏది కనబడితే అది, కోడి కనబడితే కోడి, మేక కనబడితే మేక అన్ని తింటూ ఉంటారు. ఎంతసేపు తన ఆరోగ్యం కోసం చూసుకుంటూ ఉంటారు.  ఎంత సేపు దేహస్థితి. అలా తమోగుణంలో 100 నుండి 150 జన్మలు పడుతుంది ఎవరికైనా.

తర్వాత మెల్లిగా మెల్లిగా వారిలో మార్పు వచ్చి ఆ తమోగుణంలోంచి రజోగుణంలోకి వస్తారు. ఇక్కడికి వచ్చిన వారిది మనోస్థితి. నేను ప్రెసిడెంట్, నేను ఎమ్మెల్యే, నేను కలెక్టర్, నేను పురుషుడు, నేను స్త్రీ, నేను ఈ మతం, నేను ఈ కులం అంటూ వుంటారు.

నేను అందరికంటే గొప్పగా ఉండాలి, అందరూ నా మాటే వినాలి అంటారు. ఇవన్నీ రజోగుణం లక్షణాలు, మనో స్థితిలో ఉన్నవాళ్లు. కోరికలకి, డబ్బుకి ప్రాముఖ్యం ఇస్తారు. అందరికంటే బాగా సంపాదించి గొప్ప అనిపించుకోవాలి, అందర్నీ నేను డామినేట్ చేయాలి, అందరిని నా అదుపులో ఉంచుకోవాలని రావణాసుడులాగ. ఇది రజోగుణం లక్షణం ఇలాంటి జన్మలు 150 దాకా తీసుకుంటారు.

ఇక్కడ వరకు వీళ్ళంతా దేహం, మనస్సు ఈ గోలలోనే ఉంటారు. అందుచేత ఎంతసేపు ఆ భువర్లోకం వెళ్లి అక్కడినుంచి మళ్ళీ జనాలోకం వెళ్లి, మళ్ళా తిరిగివస్తూ ఉంటారు. అలా 150 జన్మలు అయిపోయాక అంటే 300 జన్మలు అయ్యాక అందులోంచి బయటపడి సాత్విక గుణంలోకి వస్తారు.

పత్రిగారు ఏమంటారంటే? అలా ఖచ్చితంగా తీసుకోవాలని లేదు, వారి వారి కృషిని బట్టి ఆధారపడి వుంటుందంటారు.

సాత్విక గుణంలో మనసు శుద్ధం అవుతుంది, మంచిగా మారుతుంది. అందుచేత ఎటువంటి తప్పులు చేయరు, ఎటువంటి పాపాలు చేయరు. వీలైనంత మంచి పనులు చేస్తారు, లోకకళ్యాణకరమైన పనులు చేస్తారు. అంటే పుణ్యాలు చేస్తారు. ఈ స్థితిలోకి వచ్చిన తర్వాత వీరు కూడా ఏమంటారంటే?

అలా మంచి పనులు చేస్తూ, నేను ఎంతో గొప్ప పని చేస్తున్నా, ఎంతోమందికి సేవ చేస్తున్నాను అని భావిస్తూ ఉంటారు. వీళ్లు భువర్ లోకం వెళ్లరు కానీ అన్ని మంచి పనులు చేయడం వలన సువర్లోకం అంటే స్వర్గలోకం చేరుకుంటారు. ఆ స్వర్గలోకం చేరుకోవడం వల్ల అక్కడ ఆ భోగాలు అనుభవిస్తారు. ఆ సువర్లోకం చాలా పెద్దది, చాలా అద్భుతంగా ఉంటుంది భగవద్గీతలో కూడా ఇలా చెప్పబడింది..

**శ్లో॥ తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి ।**
**ఏవం త్రయీ ధర్మ మను ప్రపన్నా**
**గతాగతం కామకామా లభన్తే ॥ (భ.గీ.9-21)**

తా:– వీరు చేసుకున్న పుణ్యానికి తగ్గట్టు విశాలమైన ఆ సువర్లోకం వెళ్లి, అక్కడ భోగాలు అనుభవించి అవి అయిపోయిన తర్వాత మళ్ళా భూలోకానికి వస్తారు. ఈ మూడు రకాల గుణాలలో వుండేవారు అలా సంసార చక్రంలో తిరుగుతారు. దీనిని బట్టి పుణ్యాలు చేసేవాళ్ళకు కూడా ఆ జనాలోకం దాటే అర్హత లేదు.

గుర్తుపెట్టుకోండి మనకి పండితులు చెప్తారు, పుణ్యాలు చేయండి మోక్షం పొందుతారు అని. కాని అసలు జనాలోకమే దాటలేదు, ఇంక మోక్షం ఎక్కడ వస్తుంది? మోక్షం పొందాలంటే సత్యలోకం చేరాలి. చాలామందికి ఇది అర్థం కాదు, నేను పుణ్యాలు చేస్తున్నాను అంటారు. అసలు పుణ్యాలేమైనా గొప్పవా? అందుకే పత్రి గారు మీకు పాపాలు వద్దు, పుణ్యాలు వద్దు, రెండు వదిలేయండి, ఆత్మ కర్మలు అంటే ముక్తి కర్మలు చేయండి... అవి మిమ్మల్ని మోక్షానికి చేర్చగలుగుతాయి అంటారు. నేను మొదట్లో చాలా సందేహ పడ్డాను, పుణ్యాలు వద్దంటారు, మరి మంచి పనులు చేయకుండా ఎలాగా? అని నేను కొంచెం సందేహించాను.

కానీ తరువాత అర్థమైంది. ఎందుచేతనంటే? ఎవరూ భూమి మీద శాశ్వతంగా వుండరు, కొన్నాళ్ళకు భూమ్మీద శరీరం వదిలేస్తారు, స్త్రీ అయినా, పురుషుడైనా చేసిన కర్మలకు తగ్గ లోకాలకే వెళ్తారు. ఎన్నో పుణ్యాలు చేసిన వారు ఏదో గొప్ప లోకానికి వెళ్ళిపోయాను అని అనుకుంటారు. కానీ ఆ సువర్లోకం వెళ్లిన తరువాత కూడా జనాలోకానికే వస్తారు. అక్కడ కౌన్సిలింగ్ లు చేసేవాళ్ళు అంటే పై మూడు లోకాల్లో ఉండేవాళ్లు. ఈ సువర్లోకం నుండి వచ్చిన వాళ్ళకి కౌన్సిలింగు ఇస్తారు.

వారు ఏమని చెప్తారు అంటే? నాయనా నువ్వు ఏదో గొప్ప పనులు చేసి, ఏదో గొప్ప స్థాయికి వెళ్లిపోయానని ఫీల్ అవుతున్నావు, కానీ వాటి వల్ల ఊర్ధ్వ లోకాలకు చేరలేవు. నువ్వు దానం చేశావు, సేవ చేశావు, కానీ వాటి వల్ల నువ్వు మరలా భూమి మీదకు వెళ్లినపుడు చేసిందానికి భోగాలు అనుభవిస్తావు, అంతకన్నా ఇంకేమీ వుండదు అని చెపుతారు.

కానీ పైన ఇంకా ఎన్నో లోకాలు ఉన్నాయి. నువ్వు ఆ లోకాలకి చేరుకోవాలి. ఇప్పుడు మమ్మల్ని చూస్తున్నావుగా, మేము ఆ లోకాల్లో ఉన్న వాళ్ళమే! మా లాగా ఆ లోకాలకి వెళ్లాలంటే ఏం చేయాలో మేము నీకు బోధిస్తున్నాం. కారణం నువ్వుకూడా మాలా అవ్వాలనే! నువ్వు ఎంతో పుణ్యం

సంపాదించుకున్నానని అనుకుంటున్నావు, కాని మళ్ళీ భూమి మీదికి వెళ్లడమేగా! కాని ఆ పైలోకాలకు వెళ్ళిన వాడే గొప్పవాడు, మాలా ఎదిగిన వాడే గొప్పవాడు. అందుచేత మాలా మీరూ ఎదగాలి, అంటే పైలోకాలకి చేరుకునే ప్రయత్నం చేయాలి అని చెప్తారు. చూడు నువ్వు నేర్చుకుంటున్నావు, మేము నేర్పుతున్నాము. నీకు ఏమీ తెలియదు, మాకు ఎన్నో తెలుసు అని చెపుతారు.

మరి అక్కడకు చేరుకోవాలంటే? నువ్వు ఎంత సేపు దేహం, దేహం అంటూ, నేను, నేను అంటూ కూర్చుంటే ఏమీ ప్రయోజనం లేదు? నువ్వు ఎంత సేపూ దేహం అన్న భావంతోనే జీవించావు, దేహం కోసమే పాటుపడ్డావు, దేహ లాభాల కోసమే చూసుకున్నావు. నువ్వు దేహ లాభాలు చూసుకున్నంత కాలం, జనాలోకం వరకే వెళ్లగలవు, కాని జనాలోకం దాటలేవు.

అందుచేత నేను ఆత్మను అన్న అవగాహన ఉండాలి. ఈ అవగాహనే లేకపోతే నువ్వు ఎటువంటి పరిస్థితుల్లో జనాలోకం దాటలేవు. ఎందుచేతనంటే? భూమి మీద చాలామంది కోట్లు సంపాదించి నేను చాలా సంపాదించాను అనుకుంటారు. కానీ కోట్లు సంపాదించినా, అవన్నీ భూమిమీదే వదలివెయ్యాలి. ఎంత సంపాదించినా శరీరం వదిలాక భువర్ లోకం వెళ్లవలసిందే? ఎందుచేతనంటే? ఆ కోట్లు సంపాదించడానికి ఎన్నో పాపాలు చేస్తారు. మరి భువర్ లోకం కాకపోతే సువర్లోకం వస్తుందా? అని చెప్తారు.

ఇంకా కొంతమంది సీఎం అవుతారు, ప్రైమ్ మినిస్టర్ అవుతారు నా కంటే హైలెవల్ వాడు ఎవడున్నాడు? అని ఫీలై పోతారు, గర్వ పడతారు, అహంకరిస్తారు, చేయకూడని పనులు ఎన్నో చేస్తారు. ఇన్ని తప్పులు, పాపాలు చేసినవారు సువర్లోకం వెళ్లే అర్హత కూడా ఉండదు.

వారు ఆ భువర్ లోకంలో ఉండి మళ్ళీ భూమిమీదకి వస్తారు. అంతకు ముందు సీ.ఎం. అయినా ఇప్పుడు చేసిన పనులన్నిటికీ తగ్గ జన్మ తీసుకోవాల్సి వస్తుంది. ఓ పేదవాడిగానో! లేనివాడిగానో! లేకపోతే ఏ కష్టాలు ఇతరులకు పెట్టాడో! ఆ కష్టాలన్నీ అనుభవించేటటువంటి జన్మ తీసుకోవాల్సి వస్తుంది. మరి అంత గొప్పవాడు ఏమైపోయాడు? తెలుసుకోగలిగితే ఆశ్చర్యమేస్తుంది.

చాలామంది ఏమనుకుంటారంటే? పెద్ద పదవి సంపాదించుకుని ఇంక నాకు భూమ్మీద చేయవలసింది ఏముంది? అంటారు. ఎంత ఫీల్ అయిపోతారో! వాళ్ళు అనుకుంటారు, నేను చేయవలసిన దాని కంటే ఎక్కువ చేసేశాను అని అనుకుంటారు. ఇంకొకడు 10 బిల్డింగులో, 20 బిల్డింగులో

కడతాడు. అలా ఎవడు కట్టాడు? అని అంటాడు. నా ఇల్లు చూడు ఎలా ప్యాలెస్ లా ఉందో? అంటాడు. ఇంత గొప్ప ఇల్లు ఎవడు కట్టగలడు? అని ఫీల్ అయిపోతాడు.

కానీ ఎన్ని బిల్డింగులు కట్టినా, ప్యాలస్ లు కట్టినా, చివరకు భువర్లోకమే వెళ్తాడు. గుర్తుపెట్టుకోండి వాడికి సువర్లోక ప్రాప్తి కూడా లేదు. కాని వాడు అదేదో గొప్ప అనుకుంటాడు. కాని భూమ్మీద అలాంటి వాడిని చూసి ఏమనుకుంటారంటే? అబ్బ వాడు ఎంత అదృష్టవంతుడో! ఎంత సంపాదించాడో! మనమే దురదృష్టవంతులం, మన దగ్గర ఏముంది? అని అనుకుంటారు.

కాని మీ దగ్గర ఏమున్నా, ఏమీ లేకపోయినా... హోదా ఉన్నా, హోదా లేకపోయినా... గొప్ప ఉద్యోగం ఉన్నా, లేకపోయినా మీరు ధ్యానం చేయండి, జ్ఞానం సంపాదించుకోండి, పత్రి గారు చెప్పినట్టుగా ఆ పుస్తకాలు చదవండి, మీరు జ్ఞానం సంపాదించుకుని మీరు చేయకూడనివి ఏంటో తెలుసుకుని, చేయవలసినవి ఏంటో తెలుసుకుని, చెయ్యవలసినవి చేస్తూ, చెయ్యకూడనివి చెయ్యకుండా ఉంటే? అలాగే ప్రాముఖ్యం ఇవ్వాల్సినవి ఏంటో తెలుసుకుని, ప్రాముఖ్యం ఇవ్వకూడనివి ఏంటో తెలుసుకుని, ఆ రకంగా జీవిస్తే సువర్లోకం కాదు, జనాలోకం కూడా దాటగలుగుతారు.

అందుచేత ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి ఉన్నవాళ్ళు జనాలోకం దాకా వెళ్లి తిరిగి వస్తారు. కానీ ఆత్మ మీద ఆసక్తి ఉన్నవాళ్లే జనాలోకం దాటే అర్హత ఉంటుంది. అందుచేత ఎవరికైనా "విషయ విరక్తి - ఆత్మ ఆసక్తి" వుండాలని పెద్దలు చెపుతారు.

అందుచేత కనీసం 50% అయినా ఆత్మని పట్టించుకోగలిగితే, ఆత్మకు సంబంధించిన పనులు, సాధనలు చేసి, ఆత్మకు సంబంధించిన జ్ఞానం సంపాదించుకుంటే? జనాలోకం దాటే అవకాశం ఉంది.

అందుచేత ఊరికే భూమి మీదికి రావడం, ఏదో జీవితాన్ని గడపడం చివరకు శరీరాన్ని వదలడం అన్నది పెద్ద గొప్ప పనేమి కాదు. ఏదిఏమైనా శరీరం వదిలిన తర్వాత జనాలోకం దాటగలిగితే భూమ్మీద చాలా సాధించినట్టే కాదు, చాలా గొప్ప వాళ్ళనే చెప్పవచ్చు.

ఒకరకంగా 350 జన్మలు దాటితే తప్ప, అది సాధించలేరు. మీరు అది సాధిస్తే కోట్లాది మంది కంటే ఎంతో గొప్పవారని చెప్పుకోవచ్చు. మీరు

స్త్రీ కావచ్చు, పురుషుడు కావచ్చు, డబ్బు లేనివారు కావచ్చు, పదవులు లేకపోవచ్చు, గొప్ప ఉద్యోగం లేకపోవచ్చు, కాని మీరు గొప్పవారే.

ఎందుచేతనంటే? భూమ్మీద గొప్పతనం గొప్పతనం కాదు, పైకి వెళ్ళినప్పుడు, అక్కడ గొప్పవాడే అసలైన గొప్పవాడు. అందుకే భూమిమీద ఎంత గొప్పవాడైనా పైలోకాలలో గొప్ప వాళ్ళ దగ్గర ట్రైనింగ్ అవ్వాలి. మనం ట్రైనింగ్ పొందే వాళ్ళలా కాదు, ట్రైనింగ్ ఇచ్చే వాళ్ళ స్థాయికి ఎదగాలి. ఇవన్నీ ఎలా తెలుస్తాయంటే మరణించిన తరువాత జరిగేది జీవించి వుండగానే తెలుసుకున్నప్పుడు.

సహజంగా సాత్విక గుణంలోకి వచ్చాక మూడు స్టేజీలు ఉన్నాయి. అవి ఏమిటంటే? సాత్వికం అంటే శుద్ధత్వం అంటే మనసు శుద్ధం అవ్వాలి. తరువాత స్టేజీ పరిశుద్ధత్వం అంటే బాగా శుద్ధి అవ్వాలి. అలాగే తరువాత స్టేజీ మహాపరిశుద్ధత్వం అంటే చాలా చాలా శుద్ధి అవ్వాలి. దీన్నే పత్రిగారు 'శుద్ధ సాత్వికం' అన్నారు. వీరు భూమి మీద గొప్ప గొప్ప కార్యాలు చేస్తారు, సేవలు చేస్తారు, మహాత్ములుగా పిలువబడుతారు. వీరు మాత్రం జనాలోకాలు దాటి మహాలోకం చేరుకుంటారు.

మనకి ఇవ్వబడిన అవకాశంవల్ల భూమ్మీదికి వచ్చాం. మళ్లిపై లోకాలకు వెళతాం. అక్కడ లాభం పొందాలంటే ఇక్కడ సాధన ఎక్కువ ఉండాలి, మనసును బాగా శుద్ధి చేసుకోవాలి. మనసు శుద్ధమయ్యే కొద్ది మీరు చేసే పనులు మారిపోతాయి, మీ ప్రాముఖ్యతలు మారిపోతాయి, మీ ప్రవర్తన మారిపోతుంది, అన్నీ మారిపోతాయి.

అందుచేత 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం చెయ్యాలి, సాత్వికమైన శాఖాహారం తీసుకోవాలి. అలాగే భీమవరం మూడు రోజులు క్లాసులకి రావడం వల్ల, ఇలాంటి జూమ్‌ల వల్ల ఎంతో నేర్చుకుంటాం, మనస్సు శుద్ధి చేసుకుంటాం.

తెలుసుకోండి దేహానికి ప్రాముఖ్యం ఇచ్చేవాడు అజ్ఞాని, ఆత్మకు ప్రాముఖ్యం ఇచ్చేవాడు జ్ఞాని. ఆత్మకి ప్రాముఖ్యం ఇచ్చిన వాడు ధ్యాన సాధన బాగా పెంచుతాడు, తీవ్రంగా చేస్తాడు. అందుచేత గుర్తుపెట్టుకోండి ఆత్మకి ప్రాముఖ్యం ఇచ్చే వాడికి అన్ని లాభాలు ఉన్నాయి, దేహానికే ప్రాముఖ్యం ఇచ్చేవాడికి దేహలాభం తప్ప, మిగతాలాభాలు ఉండవు.

# జనాలోకం దాటాలంటే ఏం చేయాలి?

జనాలోకంలో చేరుకున్నవారికి కౌన్సిలింగ్‌లు జరుగుతాయని చెప్పుకున్నాం. ఆ కౌన్సిలింగ్ లు జరిగేటప్పుడు వాళ్లకి బాగా అర్థం అవుతుంది. ఎందుకంటే? ఆ కౌన్సిలింగ్ లు చేసే మాస్టర్లు ఎవరు అంటే? మహాలోకము, తపోలోకం, సత్యలోకంలో ఉండేటటువంటి మాస్టర్స్. వారు వచ్చి వాళ్లకన్నీ చెప్తూ ఉంటారు.

నాయనా... నువ్వు భూమి మీదికి వెళ్లి ఎంతసేపూ ఆ కోడి మీద, ఆ మేక మీద, ఆ పంది మీద దృష్టి పెట్టావ్ కాని అంతకన్నా ఆలోచించలేదు?

భూమి మీద ఉన్నంతకాలం దేహమే నేను అనుకున్నావు. కాని నువ్వు అనుకున్న ఆ దేహం ఇప్పుడు ఉందా? అంటే లేదు కదా? ఇప్పుడు ఉన్నది ఆత్మేగా? ఆత్మగానేగా ఈ లోకానికి వచ్చావు, అంటే నువ్వు ఆత్మవే కదా? ఆ సంగతి కనీసం ఒక్కసారైనా ఆలోచించావా? అని అడుగుతారు.

ఆ మాస్టరు ఇంకా ఏమంటాడంటే? నీవు ఎన్నో జన్మలనుండి ఇక్కడికి వస్తున్నావ్ మళ్లీ వెళ్తున్నావ్.. నీ పని ఇదే అనుకుంటున్నావా? నువ్వు ఇంకా చాలా విషయాలు తెలుసుకోవాలి. ఈ లోకానికి పైన ఇంకా చాలా గొప్పలోకాలు ఉన్నాయి. ఆ లోకాల నుంచి వచ్చిన వాళ్ళమే మేము. మేము నీకు ఇంత బోధిస్తున్నాము అంటే? మేము ఆ స్థాయికి ఎదిగాము. మేము ఎంతో జ్ఞానం సంపాదించుకున్నాము, భూమి మీద ఎన్నో గొప్ప పనులు చేశాము. ఆ పై లోకాలు గురించి నీకు తెలియదు, నువ్వు తెలుసుకోవట్లేదు. అందుచేత ఇప్పుడు నువ్వు ఉన్న లోకం కాదు, ఇంకా ఉన్నతమైన లోకాలు చేరుకునే ప్రయత్నం చేయాలి. ఇప్పటికీ నువ్వు ఎన్నో జన్మలు ఎత్తావు. నువ్వు భూలోకానికి వెళ్తున్నావు, మళ్లీ అలాగే వస్తూనే ఉన్నావు. అసలు అలా వెళ్లి రావడం దేనికిది? ఇంకా ఉన్నత స్థితికి చేరుకోవాలి, గొప్పవాడిగా ఎదగాలి, గొప్పవాడివి కావాలి.

ఇప్పుడు నువ్వు వున్న ఈ జనాలోకం కంటే ఇంకా పైలోకాలకు చేరుకునే ప్రయత్నం చెయ్యాలి అని చెప్తారు. అంతేకాదు అలా ఎదగాలంటే? భూమిమీద ఏం చేయాలో అన్ని చెప్తారు. ముఖ్యంగా ధ్యాన సాధన చేయాలి, జ్ఞానం

సంపాదించుకోవాలి అని ఇంకా ఎన్నో చెప్తారు. అప్పుడు వాడు భూమి మీదకు వెళ్లాలని నిర్ణయించుకుంటాడు.

అప్పుడు వాళ్ళని అడుగుతాడు, మరి ఇప్పుడు నేను భూమి మీదకు వెళ్లాలంటే ఏమి చెయ్యాలి? అంటాడు. అప్పుడు వాళ్ళు నువ్వు భూమిమీదకు వెళ్లాలంటే? ఇంతకు ముందు నువ్వు చేసిన కర్మలు కొన్ని అనుభవించాలి అని చెప్పి వాడిని ఆకాసిక్ రికార్డ్స్ రూమ్ లోకి పంపుతారు.

ఆ గదిలో వాడు గతంలో తాను చేసిన కర్మలన్నీ సినిమా చూసినట్టు చూసుకుంటాడు. అప్పుడు వాడు ఆశ్చర్యపోతాడు! నేను ఇన్ని పాపాలు చేశానా? మరి ఇవన్నీ తీసుకుని భూమి మీదకు వెళితే ఎన్ని కష్టాలు అనుభవించాలి? ఎలాగా? అని సంశయంలో పడతాడు. సరే ఈసారైనా పాపాలు చెయ్య కుండా, ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకుంటాను అని నిర్ణయించుకుంటాడు.

అప్పుడు కొన్ని కర్మలను ఎంచుకుంటాడు. భూమి మీదకి వస్తాడు. వచ్చిన తర్వాత పై లోకాలలో అనుకున్నవి, నిర్ణయించుకున్నవి అన్నీ మర్చిపోతాడు. మళ్లీ మామూలే! అంతకుముందు అలవాట్లు, వాసనలను బట్టి, మళ్లీ అవే పనులు చేస్తాడు, అవే పాపాలు చేస్తాడు. దానికి తోడు వాడి చుట్టూ ఉండే సమాజం, కుటుంబం యొక్క ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. వారందరిని చూస్తూ, వారిలాగే ప్రవర్తిస్తూ ఉంటాడు. తప్పులు, పాపాలు చేస్తూవుంటాడు, జీవహింస, మాంసభక్షణ చేస్తాడు.

అంతేకాదు ఈ దేహం నేను అనుకుంటూ ఉంటాడు, మళ్లీ దేహం కోసమే నానా పాట్లు పడతాడు. ఎంతసేపూ దేహ సుఖం, దేహ అందం, దేహ ఆరోగ్యం, దేహ అలంకారం లాంటి వాటికే ప్రాముఖ్యం ఇస్తాడు. దేహాసుఖం కోసం తినకూడనివి తింటాడు. వాడి కోరికలు తీర్చుకోవడం కోసం చేయకూడదని పనులు చేస్తాడు. అలా చేయకూడని పనులు, పాపాలు చేసి మళ్ళీ పైకి వెళ్తాడు.

మళ్లీ అక్కడ దొబ్బులే! దీనినే శంకరాచార్యులు వారు 'పునరపి జననం, పునరపి మరణం' అన్నారు. ఇదీ జరిగేది. మరి ఇప్పుడు ఇవన్నీ ఎందుకు తెలుసుకోవాలి? పత్రి గారు ఎందుకు తెలుసుకోవాలని అంటారు?

అంటే అక్కడ ఎలాంటి కౌన్సిలింగ్ లు జరుగుతాయో! భూమ్మీద కూడా అలాంటి కౌన్సిలింగ్ లే ఇప్పుడు మనకు జరుగుతున్నాయి. ఇప్పుడు పత్రిగారి

ద్వారా ఎంతోమంది ఈ విషయాలన్నీ తెలుసుకుని, మరల ఈ విషయాలన్నీ అందరికి చెబుతున్నారు. ఇప్పుడు ఒకరకంగా మేము చేసేదంతా కౌన్సిలింగే!

మేము ఏమి చెబుతున్నామంటే? నువ్వు ఇప్పుడు ఏం చేస్తున్నావో అది కాదు, నువ్వు చేయవలసిందేమిటో తెలుసుకో! దానికి తగ్గట్టు ప్రవర్తించు, అలాంటి పనులే చెయ్యి అని చెపుతున్నాం, అలాగే చెయ్యకూడనివి చెప్తున్నాం.

అందుచేత తెలుసుకోండి! పై లోకాలకి వెళ్ళిన తరువాత, ఎన్ని తెలుసుకున్నా ధ్యానం చేయడానికి శరీరం ఉండదు, జ్ఞానం సంపాదించు కోవడానికి వీలుండదు. తెలుసుకున్న వాటిని అనుభవం పొందే వీలుండదు. కానీ భూమి మీదకు వచ్చిన తర్వాత మనం తెలుసుకోగలిగితే ధ్యానం చేసుకునే అవకాశం ఉంటుంది. కారణం భూమిమీద శరీరం ఉంటుంది, శరీరంతో ధ్యానం చెయ్యవచ్చు, జ్ఞానవంతమైన పుస్తకాలు చదవచ్చు, జ్ఞానులతో సాంగత్యం చేయవచ్చు. ఎంతో జ్ఞానం పొందవచ్చు, పొందవలసిన అనుభవాలు పొందవచ్చు.

విచిత్రం ఏమిటంటే? పైలోకాలలో అనుకున్నది ఇక్కడ గుర్తువుండదు, అన్నీ మర్చిపోతాం. కానీ పత్రి గారి లాంటి గురువుల ద్వారా ఇక్కడ మనం ఏమిచేయకూడదో! ఏమిచేయాలో! తెలుసుకుంటాం. వారి భోధలు అనుసరించి మనం చెయ్యకూడనివి మానేసి, చెయ్యవలసినవి చేసినప్పుడు! మరల పైకి వెళ్ళిన తర్వాత, పైలోక మాస్టర్స్ మనల్ని ప్రశంసిస్తారు, చాలా మంచి పని చేసి వచ్చావు నాయనా, చాలా కష్టపడ్డావు, చాలా కృషి చేశావు అని ప్రశంసిస్తారు.

నువ్వు ఏది చేయాలో అవన్నీ భూమ్మీద చేసి వచ్చావు, చాలా అదృష్టవంతుడివి, నువ్వింకా గొప్ప లోకాలకి చేరుకోగలుగుతావు అని చెప్తారు. అందుచేత గుర్తుపెట్టుకోండి! ఎంతసేపు జనాలోకం దాకా వెళ్లి తిరిగి రావడం కాదు. జనాలోకం దాటే ప్రయత్నం చేయాలి. అప్పుడు వాడు గొప్పవాడు. భూమ్మీదకి వచ్చిన వాడు ఎంతసేపు జనాలోకానికి ఆటోమేటిక్‌గా వెళ్తాడు, అది పెద్ద విశేషమేమీ కాదు. కావలసింది జనాలోకం దాటాలి, అప్పుడే వాడు గొప్పవాడు అని చెబుతారు.

మీరు స్త్రీ అయినా సరే, పురుషుడైనా సరే, ధనం వున్నా సరే లేకపోయినా సరే, ఏ కులమైనా సరే, ఏ మతమైనా సరే, ఎవ్వడైనా సరే గుర్తుపెట్టుకోండి నేను ఆత్మను, ఈ దేహం నేను కాదు అన్న అవగాహనతో ఉండాలి. అంతేకాదు

నేను సామాన్యమైన కుటుంబం, సామాన్యమైన కులం, ఈ మతం ఇవన్నీ వదిలేయండి. మీరు ఆత్మ. ప్రతి ఒక్కరు మీరు నల్లగా ఉన్నారా, తెల్లగా వున్నారా, అందంగా ఉన్నారా, అందంగా లేరా, ముసలోళ్ళా, పడుచోళ్ల ఇవ్వన్నీ ఎవడికి కావాలి. ఎవ్వడైనా సరే నేను ఆత్మ అని నిత్యము గుర్తు పెట్టుకోవాలి.

నేను అందుకే మీకు బాగా కనిపించే చోట వ్రాసుకోమంటాను. "నేను ఆత్మను" అన్నది ఎప్పుడూ కనిపిస్తూ ఉండాలి. కారణం మనం మాయలో పడిపోయి, మర్చిపోతూ వుంటాం. కానీ రోజూ అలా చదువుకుంటూ మనం మళ్లీ గుర్తు చేసుకుంటా వుండాలి.

ఎందుచేతనంటే? నేను దేహం అనుకుంటే చేసేవి ఒకరకంగా వుంటాయి. నేను ఆత్మ అనుకుంటే చేయవలసినవి ఇంకొక రకంగా ఉంటాయి. అందుచేత నేను ఆత్మ అన్నది గుర్తు చేసుకుంటూ ఉండాలి. ఇప్పుడు ఈ సబ్జెక్ట్ మనం విన్నాం కాబట్టి దీన్ని మీరు బాగా జీర్ణం చేసుకోవాలి. ఇప్పటిదాకా తెలుసుకున్న వన్నీ ఒక ఎత్తు అయితే! ఇప్పుడు మనం తెలుసుకోబోయే వన్నీ ఒక ఎత్తు. అందుకే అంత డీటెయిల్ గా చెప్తున్నాను. ఇదంతా దేనికి అంటే మీరు జనాలోకం దాటాలనే.

ఎందుచేతనంటే? "లైఫ్ ఆఫ్టర్ డెత్" అంటే ఎనో విషయాలు ఉన్నాయి! ఎంతో ఆలోచించాలి! ఎన్నో తెలుసుకోవాలి! ఊరికే చనిపోయింతర్వాత పైకి వెళ్తాం, ఏదో లోకానికి వెళ్తాం, అక్కడ కొన్నాళ్ళు వుంటాం, మళ్ల భూమ్మీదకి వచ్చేస్తాము అని అనుకుంటే? ఏం ప్రయోజనం లేదు. అందుచేత తప్పని సరిగా వీటి గురించి ఆలోచించండి.

భూమిమీద స్త్రీ అయినా సరే! పురుషుడు అయినా సరే! శరీరం వదిలేస్తే అందరూ ఆత్మలే! ఎవరైనాసరే శరీరం ఉన్నంత వరకే స్త్రీ అయినా, పురుషుడు అయినా. అంతేకాదు ఈ కులము, ఆ కులము… ఈ మతము, ఆ మతము… ఈ దేశం, ఆదేశం అన్నవన్నీ ఈ శరీరం ఉన్నంత వరకే.

అందుచేత శరీరం గురించి ఆలోచించడం కాదు, మనం ఆత్మలం కాబట్టి ఆత్మగురించి ఆలోచించాలి. మనది భూలోకం కాదు. భూమి అన్నది మనకి పరలోకం. పరలోకాలే మన స్వలోకాలు. ఆత్మలమైన మనం ఉండేది ఇక్కడ కాదు, పరలోకాలలోనే.

మనం భూలోకం నుంచి అక్కడికి వెళ్ళటం కాదు, పై లోకాల నుంచి

ఇక్కడికి వచ్చాం. అందుచేత ముందు ఇది తెలుసుకోవాలి.

ఎందుచేతనంటే? ప్రతి ఒక్కరు కొన్ని అనుభవాలు పొందడానికి, వాటి ద్వారా కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి, ధ్యాన సాధన చేయడానికి, కొంత జ్ఞానం సంపాదించడానికి, ఇక్కడికి అంటే భూమిమీదకు వచ్చాం. అంతేకానీ భూమి ఏమీ మన పర్మినెంట్ ప్లేసు కాదు. అలాగే ఇక్కడ మనకున్న వన్నీ మన సొంతం కాదు, ఇక్కడున్న వాళ్లంతా మనవాళ్లు కాదు. ఇక్కడ ఉన్నంతవరకే ఇవన్నీ. ఎప్పుడైతే మనం శరీరం వదిలేస్తామో! భూమిమీద ఉన్నవాటితో దేనితో కూడా సంబంధం ఉండదు, అన్నీ వదిలేసి పైకి వెళ్ళి పోవాలి. ఈ విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

అందుచేత పరలోకమే మన స్వలోకం. అక్కడ మన ఎదుగుదల, ఉన్నతి, గొప్పతనం అన్నీ అక్కడ ఉంటాయి. అందుచేత భూమిమీద ఉండే గొప్ప, గొప్పకాదు. ఎందుచేతనంటే? భూమ్మీద సీఎం అయినా, గొప్పవాడు అయినట్టు కాదు.

ఎందుచేతనంటే? భూమి మీద ఎన్నాళ్లు ఉంటారు? ఆలోచించండి! ఎంతమంది సీఎంలు వెళ్ళిపోలేదు? పి.ఎం.లు వెళ్లిపోలేదు? అందుచేత సి.ఎం అయినా , పి.ఎం. అయినా గొప్పకాదు. కారణం కొన్నాళ్లే ఆ భోగం. దాన్ని చూసి మురిసిపోవడానికి ఏమి లేదు. పైలోకాలలో పొందిన గొప్పతనమే శాశ్వతం. దాన్ని పొందాలి. నేను ఒకటే చెప్తున్నాను ఆఖరికి మీరు స్వర్గలోకం వెళ్ళినా పెద్ద ఉపయోగం లేదు.

మనకి పండితులు పుణ్యాలు చేసి స్వర్గానికి వెళ్లాలి అంటారు. కాని స్వర్గం అన్నది జనాలోకం కంటే క్రింది వున్న లోకమే! అందుచేత స్వర్గలోకం కూడా దాటాలి. జనాలోకానికి పైన ఒక్క లోకానికి చేరుకోగలిగినా నువ్వు గొప్పవాడివే! ఎందుచేతనంటే? ముందుగానే సత్యలోకం దాకా కూడా వెళ్లనక్కరలేదు, జనాలోకం దాటి మహాలోకానికి చేరుకోగలిగినా మీరు భూమి మీద చాలా కృషి చేసినట్టే! చాలా కష్టపడినట్టే! చాలా సాధించినట్టే! అందుచేత భూమిమీద చేసే కృషి వల్లే ఆ జనాలోకం దాటే స్థితి ఎవరైనా సంపాదించవచ్చు.

ఏది ఏమైనా జనాలోకం దాటితేగాని అందరూ కోరుకునే మోక్షం

అన్నది సిద్ధించదు, ఆ స్థాయి రాదు. ఎందుచేతనంటే? సత్యలోకానికి వెళితేనే మోక్షం కలుగుతుంది. ఇదే భగవద్గీతలో కూడా చెప్పడం జరిగింది.

**శ్లో॥ అబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తినో-ర్జున !**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే !! (భ.గీ.8-16)**

తా:- అర్జునా! బ్రహ్మలోకము అంటే తపోలోకం చేరుకున్నా తిరిగి భూలోకంలో జన్మించవలసిందే కానీ నేనుండే సత్యలోకంలో చేరి వారు భూమి మీద తిరిగి జన్మించవలసిన పని లేదు.

చాలామంది ధ్యానంలోకి రాగానే, కొద్దిరోజులు ధ్యానం చేసి మూడోకన్ను వచ్చిందని, వస్తుందేమోనని అనుకుంటారు. కాని మూడో కన్ను అంటే అంత తేలిగ్గా ఉందా? ఊరుకే ఏవో కొన్ని కనపడగానే " థర్డ్ ఐ మాస్టర్ " ఐపోయానని అనుకుంటారు. కాని దానికి ఎంత కష్టపడాలి? ఎంత కృషి చేయాలి? ఎంత ఎదగాలి? మూడోకన్ను అంటే అంత తేలికా? ఆషామాషీయా?

అందుచేత ఇప్పుడు మనం జనాలోకం దాటాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం?

చాలామంది ఏమనుకుంటారంటే? ధ్యానం అంటే తపస్సు కదా? మరి మనం తపస్సు చేస్తున్నట్టే కదా? అందుచేత తపో లోకాలకి వెళ్ళిపోతామేమోనని అనుకుంటారు.

కాని తెలుసుకోండి! మీరు ఊరికే ధ్యానంలోకి వచ్చినంత మాత్రాన, ధ్యానం చేస్తున్నంత మాత్రాన తపోలోక ప్రాప్తి రాదు.

కారణం... ధ్యానం చేసే వాళ్లలో 90% అంటే ఎక్కువమంది దేహలాభాలు అంటే రోగాల కోసం, కోరికల కోసం, అనుభవాల కోసం చేస్తున్నారు, అవే గొప్పవనుకుంటున్నారు. చాలా ఎదిగిపోయామని అనుకుంటూ వాటి కోసమే చేస్తున్నారు. చాలామందికి ఎన్నో కోరికలు వుంటాయి, ఆ కుటుంబంలో, ఆ సంసారంలో ఎన్నో సమస్యలు ఉంటాయి, వాళ్ళకి కావాల్సినవి ఎన్నో ఉంటాయి. ధ్యానం చేస్తే ఆ లాభాలు వస్తాయి, కోరికలు తీరుతాయి, కష్టాలు పోతాయి అనేటువంటి భావంతో చేస్తూ వుంటారు. అంతేకాని ఏ కోరిక లేకుండా ధ్యానాన్ని చేయరు. అందుచేత ఈ కోరికలతో ధ్యానం చేస్తే

ఏమీ ప్రయోజనం లేదు, కారణం వారు జనాలోకం దాటలేరు.

కారణం వారు ఆత్మ లాభంకోసం ధ్యానం చెయ్యలేదు. ఎంతసేపూ కోరికలు, సంకల్పాలతో ధ్యానం చేస్తారు. మాస్టర్లుకూడా ఆ సలహాలే ఇస్తూ వుంటారు. ఏమంటారంటే? సంకల్పాలు పెట్టుకుని ధ్యానం చెయ్యి... నీ సమస్యలు పోతాయి, నీ కష్టాలు తీరిపోతాయి, రోగాలు తగ్గిపోతాయి అంటారు.

ఆలోచించండి **ఆత్మవైన నువ్వు వచ్చింది దేనికి? దేహలాభాల కోసమా? ఆత్మ ఉన్నతి కోసమా? ఎంతసేపూ దేహ లాభాల కోసం ధ్యానం చేస్తే? ఆత్మ ఉన్నతలోకాలకు ఎలా వెళ్తుంది? జనాలోకం ఎలా దాటుతుంది? ఎంత సేపు దేహం కోసమే కిందా, మీద పడుతూ ఉంటే ఆత్మ ఉన్నతలోకాలకు ఎలా వెళు తుంది? అసలు ఆత్మ గురించి నువ్వు ఏం చేశావు అన్నది ఆలోచించవే? ఎంతసేపు దేహమేనా? ఆత్మ గురించి పట్టించుకోండి.** ధ్యానం చెయ్యండి, జ్ఞానవంతమైన పుస్తకాలు చదవండి, జ్ఞానులతో సాంగత్యం చెయ్యండి, ధ్యానమార్గంలో సేవలు చెయ్యండి. జ్ఞానం సంపాదించుకోండి.పత్రిగారు చెపుతారు కదా? “ధ్యానం వల్లనే జ్ఞానం” అని. అప్పుడు ఆత్మ అయిన మీకు ఉన్నతలోకప్రాప్తి కలుగుతుంది, జనాలోకం దాటగలుగుతారు.

కాని కొంతమంది మాస్టర్లు ఏమంటారంటే ? రోగాలు తగ్గకుండా ఆత్మ గురించి ఏం చేస్తారండి? అని అంటారు. కాని ఆలోచించండి! భూమి మీద ఉన్న మానవులంతా రోగాలతో ధ్యానంకూడా చేయలేని స్థితిలో ఉన్నారా? ఆత్మగురించి ఆలోచించలేని స్థితిలో ఉన్నారా? జనాలోకం దాటాలని, మోక్షం పొందాలనే కాంక్షలో వుండేవారు భూమిమీద లేరా? అంటే ఎందుకుండరు? వుంటారు, వారికోసమే మనం ఇదంతా చెప్పేది.

ఇంకా కొంతమంది మాష్టర్లు ఏమంటారంటే? ఏమండీ రోగాలు తగ్గుతాయని మనం చెప్పకపోతే కొత్తవాళ్ళు ఎలా వస్తారండి? రోగాలకోసమేకదా ఎవరైనా ధ్యానంలోకి వచ్చేది అని అంటారు.

కాని ధ్యానంలోకి వచ్చి ఏడాది అయినా, మూడేళ్ళయినా, ఐదేళ్ళయినా ఇంకా దేహం, రోగాలు అంటూ కూర్చుంటే? ఆత్మ గురించి ఎప్పుడు ఆలోచిస్తారు? ఆత్మజ్ఞానం ఎప్పుడు సంపాదించుకుంటారు? అసలు ఆత్మలైన మీరు భూమిమీదకు ఎందుకు వచ్చినట్టు? దేహ రోగాలు తగ్గించు కోవడానికా?

ఆలోచించండి! అసలు రోగాలు ఎందుకు వచ్చాయి? ఆత్మజ్ఞానం లేకేగా? అందుచేత రోగాలు వుండకూడదంటే? ముందు ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి, కృషి చెయ్యాలి.

అందుకే నేను చెప్తున్నాను కోరికలతో ధ్యానం చేసేవాళ్ళు, సంకల్పాలు పెట్టుకొని ధ్యానం చేసేవాళ్ళు ఎవ్వరూ కూడా జనాలోకం దాటలేరు. కానీ ఎప్పుడైతే మీరు "నేను ఏమైనా సరే జనాలోకం దాటాలి అని నిర్ణయించు కుంటారో! అలాంటి తీవ్ర తపన, కాంక్ష మీలో కలుగుతుందో! అప్పుడు స్వార్థం లేకుండా కోరికలు, సంకల్పాలు లేకుండా శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చేస్తారు, జ్ఞానం సంపాదించుకుంటారు, అప్పుడే జనాలోకం దాటగలుగుతారు.

అసలు జనాలోకం ఉందన్న సంగతే చాలామందికి తెలీదు. కాని చాలామందికి మోక్షం పొందాలి అనే కోరిక ఉంటుంది. కాని మోక్షమంటే ఏంటో కూడా తెలీదు, కాని ఆ పదం వాడుతూ వుంటారు.

శాస్త్రాల్లో ఒక వాక్యం ఉంది. ఏమిటంటే? "కామి గాని వాడు మోక్ష గామి కాడు". కామి అంటే కామము. కామము అంటే కోరిక. ఏ కోరిక? నేను మోక్షం పొందాలి అనే కోరిక. ఆ కోరిక లేనివాడు మోక్షాన్ని పొందలేడు అని అర్థం. ఊరికే మోక్షం పొందాలి అనుకుంటే చాలదు. అది పొందాలనే తీవ్రమైన కోరిక, వాంఛ, పట్టుదల, జిజ్ఞాస, ఆసక్తి, తపన వుండాలి. అంత పట్టుదల వున్నవాడే దాన్ని సాధించగలడు.

పత్రి గారు చెప్తారు "యద్భావం తద్భవతి" అని.

అంటే "నీ భావం ఏలావుంటే? నువ్వు అదే సాధిస్తావు" అని.

పత్రిగారు పరిచయం అయ్యాక "నేను దేహం కాదు, నేను ఆత్మ" అని అర్థమయ్యింది. ఈ డబ్బు, సంపదలు ఆత్మ అయిన నాకు ఏమీ ఉ పయోగపడవు, లాభించవు, ఆత్మ ఉన్నతి కలిగించవు, జ్ఞానమే నాకు కావాలి అన్నది తెలుసుకున్నాను.

అలా నేను ఆత్మను అన్న విషయం అర్థం చేసుకుని అన్నీ వదిలేసి ఈ స్థాయికి చేరుకున్నాను. అంతకు ముందు అందరిలాగే ఉండేవాడిని. కానీ నాలాగే ఎవరైనా చేయగలరు, చేరుకోగలరు.

ఈ మధ్యనే **"P.M.C"** లో పత్రిగారు "యూత్ ఫర్ ట్రూత్ " అని యువకులతో ఇంటర్వ్యూలు చేశారు. దాంట్లో ఒకళ్ళు ఏమని అడిగారు అంటే? మీ స్థాయికి రావాలి అంటే? ఎన్ని జన్మలు తీసుకోవాలి? లేక ఒక జన్మలోనే సాధించవచ్చు? అని అడిగారు.

అప్పుడు పత్రి గారు నువ్వు చేసే కృషిని బట్టి ఆధారపడివుంటుంది. నువ్వు దానికి తగ్గ కృషి చెయ్యాలి. చూడు నేను ఎలా చేస్తున్నానో! నువ్వు కూడా అలా కృషి చేస్తే, ఈ జన్మలోనే సాధిస్తావు. నీలో అంత పట్టుదల లేకపోతే? ఖచ్చితంగానే ఎన్నో జన్మలు పడుతుంది అని చెబుతూ ఆయన ఏమన్నారంటే? నేను 50 వేల పుస్తకాలు చదివాను, మరి మీరు ఎన్ని పుస్తకాలు చదివారో తెలుసుకోండి. ఆయన ఇంకా ఏమన్నారంటే? నా సమయాన్ని ఎంత వెచ్చిస్తున్నాను? మీరు మీ సమయాన్ని ఎంత వెచ్చిస్తున్నారు? దీనికోసం నాలా మీరు కృషి చేస్తే నాలా ఎందుకు కారు? తీవ్రంగా కృషి చేస్తే ఈ జన్మలోనే అవుతారు అని చెప్పారు.

ఆయన ఇంకా నేను ఎన్నో లక్షల మందికి ధ్యానం చెప్పాను. మరి మీరు ఎంత మందికి చెప్పారో చూసుకోండి అని అన్నారు.

కాని చాలామంది ఎంతసేపూ ఎదో ఒక జూమ్ పట్టుకొని, ఓ పాతిక మందికో, యాభై మందికో సంవత్సరాల నుంచి చెబుతున్నారు. అలా చెబితే పత్రిగారిలా అయిపోతారా?

అసలు వీరికి మతి ఉందా? మతి లేదా? ఎదో కాలక్షేపం కోసం వాళ్ళోచ్చి కూర్చుంటారు, వీరికి కాలక్షేపం లేక కొంతమందిని పిలిచి కూర్చోబెడతారు. సంవత్సరాలనుంచి వాళ్లేనా, ఇంక ఎవరూ లేరా? ఆలోచించండి?

అందుచేత మీరు జనాలోకం దాటాలి అన్నది అర్థమైతే, దానికితగ్గ కృషి చేస్తారు. ఆ ఊర్ధ్వలోకాలకు చేరుకుంటారు, మోక్ష స్థితిని పొందగలుగుతారు. అంటే సత్యలోకానికి చేరుకుంటారు. అందుచేత దానికి పట్టుదల ఉండాలి. అందుచేత గుర్తుపెట్టుకోండి, జనాలోకం దాటాలంటే? ఎంతో కృషి చేయాలి అంటే తీవ్రాతి తీవ్ర సాధన చేయాలి, అలా కొన్ని నెలలు, సంవత్సరాలు కష్టపడితే సాధించవచ్చు.

అందుకే ధ్యానం రెండు గంటలు చాలదు, ఇంకా పెంచండి అని నేను చెప్పడానికి కారణం. మనం ఎదగాలి అంటే గొప్ప స్థితికి చేరుకోవాలి. అంటే ఇంకా, ఇంకా మనసు శుద్ధి కావాలి. ధ్యానంతోపాటు ఆహార నియమాలు కూడా గట్టిగా పాటించాలి. నిస్వార్ధంగా లోకులకు సేవ చెయ్యాలి. వాళ్ల గురించి, వీళ్ల గురించి ఆలోచించకూడదు. అందరూ బాగుండాలి, అందరూ లాభం పొందాలి అని భావించాలి.

అలా సేవచేసిన వారిలో గాంధీ మహాత్ముడు, మదర్ తెరిస్సా లాంటివారేకాదు, ఇంకా ఎంతోమంది ఉన్నారు. వారు తమ స్వార్థాన్ని వదిలేసి, పరుల కోసమే తమ జీవితాన్ని అంకితం చేసారు. వీళ్ళని ఏమంటారంటే? మహాత్ములు అంటారు. ఇలాంటి వారు మహాలోకం చేరుకుంటారు అంటే జనాలోకం దాటతారు.

అందుచేత ఎవడు జనాలోకం దాటగలరు అంటే? ఒక గాంధీ గారిలా, మదర్ థెరిస్సాలా తమ స్వార్థాన్ని వదులుకొని, తమకోసం కాకుండా పరుల కోసమే, లోకం కోసమే జీవించి తమ జీవితమంతా ఇతరుల కోసం అంకితం చేసిన వారు మహాలోకానికి చేరుకుంటారు.

గుర్తుపెట్టుకోండి ఇంకా ఎవరైనా సరే అక్కడితో ఆగకుండా, మనస్సును మహా పరిశుద్ధి చేసుకుంటే? వారిని పత్రిగారు ఏమంటారంటే? శుద్ధ సాత్వికంలో ఉన్నవారు అంటారు. అలా మహా పరిశుద్ధిచేసుకున్నవారు నిర్గుణానికి చాలా దరిదాపుల్లో ఉన్నట్లు లెక్క.

అప్పుడు వారి మనసు యొక్క ప్రభావం పూర్తిగా కోల్పోతుంది అంటే ప్రాముఖ్యం కోల్పోతుంది. అంటే అసలు ఉందా? లేదా? అన్న స్థితికి వచ్చినట్టు, అదే శుద్ధ సాత్వికం. మనకి రామాయణంలో ఆంజనేయస్వామిని ఉదాహరణగా చెప్తారు. ఈ స్థాయికి ఎదిగిన వారికి సిద్ధులు, శక్తులు వస్తాయి, మరెన్నో లాభాలు కలుగుతాయి. ఆంజనేయస్వామికి ఎన్నో సిద్ధులు ఉన్నాయని చెప్తారు కదా!

అటువంటి వారికి మూడో కన్ను వస్తుంది. ఇలాంటివన్నీ ఈ స్థాయిలో వస్తాయి, అంతేకాని ధ్యానంలో కూర్చోగానే రావు.

చూడండి ఆంజనేయ స్వామి రెండో సంవత్సరం నుండే ధ్యానం

చేశాడు. అలాంటివారికి ధ్యానం తప్ప ఇంకో గొడవ ఉండదు. అలాంటివారు అంతులేని తపనతో చేస్తూ ఉంటారు, దీనినే తపస్సు అంటారు.

ఎవరైతే ఈ రకమైన సాధన అంటే తపస్సు చేస్తారో! వారికి ఏ కోరికలు ఉండవు, ఏ సంకల్పాలు ఉండవు, ఏ ఆశ కాని, ఏ స్వార్థం కానీ ఏమీ ఉండదు. వారికి ధ్యానమే అంటే తపస్సే వాళ్ళ పని. ఆ తపనతో తీవ్రమైన సాధన సంవత్సరాలు తరబడి చేస్తారు. అలాంటి వారు శరీరం వదిలాక తపోలోకానికి వెళ్తారు.

శుద్ధసాత్విక స్థితి అంటే మహా పరిశుద్ధస్థితి. వీరు సత్యలోకం చేరుకోలేరు. కానీ సత్యలోకం చేరుకోవడానికి చాలా కష్టపడారు. పట్టుదలగా ధ్యానం చేస్తారు.

మేము అందరిలో అలాంటి తపన కలగ చేయడానికే భీమవరంలో మూడు రోజుల క్లాసులు పెడుతున్నాం. ధ్యానం ఏదో మొక్కుబడిగా ఒక గంట కూర్చోవడం, లేచిపోవడం కాదు. భీమవరంలో 3-4 గంటలు ఒకే సిట్టింగులో తేలికగా కూర్చుంటారు. అక్కడ సైలెన్స్ మెడిటేషన్ అంటే పత్రీగారు చెప్పిన 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం అంటే సరియైన ధ్యానం చేస్తారు. అందుచేత ఫలితాలు చాలా బాగుంటాయి.

చాలా మంది గైడింగ్ చేస్తున్నారు. గైడింగ్‌లో మనసు పనిచేస్తుంది, అందుచేత ఆలోచనా రహితస్థితి రాదు, అంటే ధ్యానస్థితి రాదు, అందువల్ల శక్తిరాదు. ఎందుచేతనంటే? ఆలోచనా రహిత స్థితి అంటే ఆలోచనలు లేకపోవడం, అంటే మనసు పని చెయ్యని స్థితి. ఆ స్థితిలోనే శక్తి లభిస్తుంది. లాభాలు పొందగలుగుతారు. జ్ఞానం సంపాదించుకోగలుగుతారు. కాని గైడింగ్‌లో మాష్టర్ ఏవో మాటలు చెబుతూ ఉంటాడు, చేసేవాళ్ళు మనసుతో వింటూ వుంటారు. అంటే మనసు పనిచేస్తూ ఉన్నట్టే కదా? అందుచేత వారికి ఎంతసేపు కూర్చున్నా శక్తిరాదు.

అందుచేత పత్రీజీ చెప్పిన 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం చేస్తే మన మనసుని శుద్ధం చేసుకోవడమే కాదు, మహా పరిశుద్ధం చేసుకుంటాం అపార శక్తిని సంపాదించుకొని జనాలోకం దాటగలుగుతారు.

# జ్ఞానం సంపాదించుకుంటే?

లోకంలో అంతా నేను దేహం అన్నట్టుగానే జీవిస్తున్నారు. కాని సత్యం ఏమిటంటే? మనం ఆత్మలమే కానీ దేహాలం కాదు. ఇక్కడ అంటే భూమిమీద కొంతకాలమే ఉండి తరువాత ఈ దేహాన్ని వదిలేస్తాం. ఆత్మలమైన మనకి కావలసింది జ్ఞానం. జ్ఞానం సంపాదించుకోవడానికే ఈ దేహం తీసుకున్నాం.

ఈ దేహంతో చేసే ధ్యాన సాధన, స్వాధ్యాయం, సాంగత్యం, సేవల వల్లే ఆత్మ అయిన మనం జ్ఞానం సంపాదించుకుని చనిపోయిన తర్వాత గొప్ప స్థితి పొందుతాం, గొప్ప లోకాలకి చేరుకుంటాం. అంతే కాని భూమి మీద చేసే కర్మకాండల వల్ల, కర్మకాండల సమయంలో చేసే దానాల వల్ల ఏమి ప్రయోజనం లేదు.

చాలా మంది చనిపోయాక, వారి పిల్లలు చేసే కర్మకాండలు ఉర్ధ్వలోకాలు చేరుస్తాయని నమ్ముతారు. అందుచేత చనిపోయిన తరువాత జరిగే దాని గురించి అంత ఆలోచించరు. అందుకే చాలామంది కొడుకు పుట్టాలి అంటారు. దేనికి? అంటే తల కొరివి పెట్టడానికి, అంటే కర్మకాండలు చేయడానికి.

కాని కొడుకు అయినా ఒకటే, కూతురు అయినా ఒకటే అని తెలుసుకోవాలి. ఎందుచేతనంటేకొడుకు చేసే కర్మకాండల వల్ల చనిపోయిన వారికి ఏమీ ప్రయోజనం లేదని తెలుసుకోవాలి. వారు జీవించి ఉన్నపుడు వారు స్వయంగా చేసుకొనే కర్మలనుబట్టే వారు వెళ్లే లోకాలు ఆధారపడివుంటాయని తెలుసుకోవాలి.

అలాగే కర్మకాండల సమయంలో కొడుకులు చేసే దానాల ఫలితం, ఏమైనా ఉంటే, అదికూడా ఆ కొడుకులకే చెందుతుంది తప్ప చనిపోయిన వారికి చెందదని తెలుసుకోవాలి. కబీర్ మహాశయుడు చెప్పాడు కదా? **"ఏ చేయి కర్మలు ఆచరిస్తుందో! ఆ చేయే ఫలితాలు అనుభవిస్తుంది"** అని.

నారదుడు కూడా వాల్మీకితో చెప్పాడు కదా? " నువ్వు చేసిన పాపాలలో నీ భార్య ఏమన్నా వాటా తీసుకుంటుందేమో?" అని అడుగు అన్నాడు. కాని వాల్మీకి అడిగినప్పుడు, ఆవిడ నీ పాపాలు నాకు సంభంధం లేదు అంది.

అందుచేత మనం జీవించి ఉండగానే ఈ శరీరంతో మనం చేసే కృషి వల్ల, మనం చేసే సాధనల వల్ల, మనం చేసే సేవల వల్ల మాత్రమే మనం ఏదైనా సాధించ గలుగుతాం.

అంటే ఉన్నత లోకాలు, ఊర్ధ్వలోకాలు, గొప్ప లోకాలు, లాంటివన్నీ మనం చేసుకున్న వాటివల్లే మనం పొందగలుగుతాం అని తెలుసుకోవాలి. అంతేకాని ఎవరో చేసే వాటి వల్ల ఏ ప్రయోజనం లేదు అన్న విషయం ప్రతి ఒక్కళ్ళు తెలుసుకోవాలి. అది స్త్రీ అయినా సరే, పురుషుడు అయినా సరే.

మీరు రమణ మహర్షిని చూస్తే తెలుస్తుంది, ఆయన జన్మ తీసుకుని ఆయన జీవితంలో ఎంత సాధించాడు? అలాగే ముమ్మడివరం బాలయోగి జన్మ తీసుకొని ఎంత సాధించాడు. అలా గొప్ప వాళ్ళని ఎవరిని చూసినా, చిన్న వయసు నుంచే వాళ్ళ యొక్క భవిష్యత్తు కోసం ఎంతో కృషి చేసి వాళ్ళ జీవితాన్ని తీర్చిదిద్దుకున్నారు, గొప్పవాళ్ళయ్యారు, గొప్ప లోకాలకి చేరుకున్నారు.

అందుచేత ఇది మనం గుర్తు పెట్టుకోవాలి. ఇప్పుడు మనం భూమి మీద ఉన్నాం, దేహంతో ఉన్నాం. అంటే మనం దేహధారులమే కాని దేహాలము కాదు, అంటే దేహాన్ని ధరించిన వాళ్ళం అంటే దేహం ధరించిన 'ఆత్మలం'. ఎవరైనాసరే ముందు ఈ విషయం తెలుసుకోవాలి. ఎంత తెలుసుకుంటే? జీవితంలో అంత లాభం పొందుతారు.

చూడండి! తల్లితండ్రులు పిల్లల చదువుకి, అంటే ప్రాపంచిక విద్యకి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. ఇంచుమించు 20- 25 సంవత్సరాలు వాళ్ళని చదివిస్తారు. అలా వారు గొప్పగా చదివితే కనుక వారు గొప్పవారైనట్టుగా భావిస్తారు. కాని గుర్తుపెట్టుకోండి గొప్పగా చదివిన వాడు గొప్ప వాడు కాదు, గొప్ప జ్ఞానం పొందిన వాడే గొప్పవాడు. మరి ఇది ఎప్పుడు తెలుస్తుంది? అంటే శరీరం వదిలి పైలోకాలకు వెళ్ళినప్పుడు అర్ధమవుతుంది.

ఇక్కడ "IAS" చదవనివ్వండి, ఏదో గొప్ప ఇంజనీర్ అవ్వనివ్వండి, టాప్ ర్యాంకర్ అవ్వనివ్వండి. దానివల్ల ప్రయోజనం ఏమిటి? భూమి మీద ఉన్నంత వరకే. కాని ఆలోచించండి? ఇన్ని సంవత్సరాలు చదువుతున్నారే? అంటే 20- 25 సంవత్సరాల జీవితాన్ని వెచ్చిస్తున్నారే? అందులో కొద్దిగా అయినా జ్ఞానం కోసం, ఆత్మ కోసం కేటాయిస్తున్నారా? అంటే అది ఏమీ

కనిపించదు.

దానికి ముఖ్య కారణం వారి తల్లిదండ్రుల యొక్క అజ్ఞానం వల్ల, తల్లితండ్రులు పిల్లలకు జ్ఞానం గురించి ఏమీ చెప్పలేరు. అందుచేత పిల్లలు ఏమీ తెలుసుకోలేకపోతున్నారు. అలా తరతరాలనుంచి ఇలాగే జరుగుతూ వస్తుంది. అందరూ పుడుతున్నారు, అజ్ఞానం లోనే జీవిస్తున్నారు, చివరకు నిష్క్రమిస్తున్నారు.

ఎంతసేపు వీళ్ళ ఆలోచన ఎలా ఉంటుందంటే చనిపోయే లోపు ఎంత వైభవంగా జీవించాలి? ఎంత సుఖపడాలి? ఎంత బాగా జీవితాన్ని ఎంజాయ్ చేయాలి? అన్న దానిమీద దృష్టి పెడతారు. మరి ఇలా ఎంజాయ్ చేయాలన్నా, జీవితాన్ని భోగించాలన్నా, సుఖ పడాలన్నా ముఖ్యంగా కావలసింది డబ్బు కాబట్టి 20–25 సంవత్సరాలు ఆ డబ్బు సంపాదనకు ఉపయోగపడే చదువులే చదువుతున్నారు.

అందుకే క్షర విద్య కాదు, అక్షర విద్య అభ్యసించాలని పెద్దలు అంటారు. క్షర విద్య అంటే నశించిపోయే దానికి సంబంధించిన విద్య, అక్షర విద్య అంటే నశింపు లేని దానికి సంభందించిన విద్య.

చాలామంది మా అబ్బాయికి అక్షరాభ్యాసం చేసాము అంటారు. నిజంగా వీళ్ళు చేసింది అక్షరాభ్యాసం కాదు క్షరాభ్యాసం. వీళ్ళు ఏమి నేర్పుతున్నారు, ఏమి చెప్తున్నారు అంటే నశించిపోయే ప్రాపంచిక విద్యను నేర్పుతున్నారు. కానీ ప్రాపంచికం అంతా నశించిపోయేదే! ఆశాశ్వితమైనదే!

అక్షర విద్య అంటే నశింపు లేని ఆత్మకు సంబంధించినది. క్షరవిద్య అంటే నశించిపోయే దేహానికి సంబంధించినది. క్షరవిద్యలో దేహం మీద రీసెర్చ్‌లు చేసే విద్యని అభ్యసిస్తున్నారు. కాని, నశింపు లేని ఆత్మకు సంబంధించిన విద్యను అభ్యసించట్లేదు.

నిజంగా ఎవరైతే చిన్నప్పటినుంచి పిల్లలకు ఆత్మజ్ఞానాన్ని నేర్పుతూ, ధ్యానం నేర్పుతూ ఉంటారో! ఆ పిల్లలు అక్షరాభ్యాసం చేసుకున్న వాళ్ళవుతారు. అంతే కాని ఊరికే నాలుగు అక్షరాలు వ్రాసినంత మాత్రాన వాడికి అక్షరాభ్యాసం అయినట్టు కాదు. ఇక్కడ ఏమిటి అంటే? ఎవరు ఎంత జ్ఞానం సంపాదిస్తారో! వారు అంత గొప్ప వాళ్ళక్రింద లెఖ?.

ఇంతకుముందు మనం తెలుసుకున్నాం. చనిపోయిన తర్వాత అజ్ఞానంలో ఉన్నవాళ్ళు సహాయకులు వచ్చినా, వారి మాట వినకుండా ఈ భూమి మీదే ఉండిపోయి, ప్రేతాత్మలుగా అయిపోతారు. అలా కొన్ని వందల సంవత్సరాలు వృథా చేసుకుంటారు. కాని ఎవరైతే ఈ ధ్యానం చేసి కొద్దిపాటి జ్ఞానం సంపాదించుకుంటారో! ఇలాంటి విషయాలు తెలుసుకుంటూ ఉంటారో, వారు ఆ వచ్చిన సహాయకుల కూడా పై లోకాలకు వెళ్ళి పోతారు. జీవితాన్ని వృదాచేసుకోకుండా ఆ పైలోకాలకి వెళ్లిన తర్వాత చేయవలసింది చేస్తారు.

అందుచేత తెలుసుకోండి, భూమి మీద 300 నుండి 350 జన్మలు సామాన్యంగా జీవించిన వారు, ఎంత సేపు జనా లోకం దాకా వెళ్లి, అక్కడినుంచి తిరిగి వచ్చేస్తూ ఉంటారు. జనాలోకం దాటి వెళ్ళలేరు. కాని అది దాటి కృషి చేయగలిగిన వాళ్ళే గొప్ప వాళ్ళు.

ఆ పనే ఇప్పుడు మనమంతా చేస్తున్నాం. ఎవరైతే మన జూమ్ లోకి వస్తు న్నారో! భీమవరం మూడు రోజుల క్లాసులకి వస్తున్నారో! ఈ జ్ఞానం పొందుతున్నారో! ఖచ్చితంగా వాళ్లంతా ఈ ప్రయత్నం చేస్తున్నట్టే లెక్క. కొద్దిగా ఇది అర్థం చేసుకుని ఇంకొంచెం కృషి చేస్తే, నిజంగా సాధించవలసింది సాధిస్తారు.

ఈ విషయం మీరు పైకి వెళ్ళాక తెలుస్తుంది. అంతేకాదు నేను ఎంతో అదృష్టవంతుడిని అని కూడా తెలుసుకుంటారు. అంతేకాదు నేను ఆలోచించవలసిన విషయాలు ఇన్ని ఉన్నాయా? అని ఆశ్చర్యపోతారు. కాని భూమిమీద ఇదంతా అర్థం కాదు. కాని పైకి వెళ్లిన తరువాత ఎన్నో విషయాలు తెలుసుకోవాలి, ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి అని తెలుస్తుంది.

సహజంగా చనిపోయిన తర్వాత ఏమవుతుంది? అంటే సింపుల్ గా ఈరకంగా చెప్పుకోవచ్చు. పాపం చేస్తే భువర్లోకం, పుణ్యం చేస్తే సువర్లోకం, సేవలు చేస్తే మహా లోకము, తపస్సు చేస్తే తపోలోకం, సత్యము అనుభవంలోకి తెచ్చుకుంటే సత్యలోకం చేరుకుంటారు అని చెప్పేయొచ్చు. అలా విన్నంత మాత్రాన, తెలుసుకున్నంత మాత్రాన సత్యలోకం చేరిపోతామా? అది అంత తెలికా? భూమి మీద ఎవరినవుతే మనం దేవుళ్లని అనుకుంటున్నామో! ఆ స్థాయికి చేరుకోవాలి. అప్పుడే అది సాధ్యం.

గుర్తుపెట్టుకోండి ఎవరైనా సరే మానవ జన్మ తీసుకున్నాక, ముందు చాలా జన్మలు నేర్చుకుంటారు, తరువాత, తరువాత జన్మలలో నేర్పుతారు. నేను చెప్పాను కదా, 300 నుండి 350 జన్మల దాకా వింటూ వుంటారు, తెలుసుకుంటూ వుంటారు, నేర్చుకుంటూ వుంటారు.

అలాగే ఇప్పుడు మనమంతా కూడా నేర్పే స్థాయికి వచ్చాము. అందుకే నేను అందరిని క్లాసులు చెప్పమంటున్నాను. అలా చెప్పగలిగితే మీకు ప్రమోషన్ వచ్చినట్టే. మీరు నేర్చుకునే స్థాయి నుంచి నేర్పే స్థాయికి ఎదగాలి అనుకుంటే మీరు తెలుసుకున్న జ్ఞానాన్ని అందరికీ చెప్పాలి.

గుర్తు పెట్టుకోండి ఎప్పుడైతే మీరు జ్ఞాన బోధలోకి వెళ్తారో, పై లోకాలలోకి వెళ్ళటానికి కావలసిన అర్హత సంపాదించుకున్న వాళ్లు అవుతారు. పూర్తి అర్హత అని నేను అనను కాని, మొత్తం మీద అర్హత సంపాదించినట్టే! అందుకే పత్రిగారు ధ్యానాన్ని అందరికి నేర్పండి అంటారు. ఆయన చెప్పేదే నేను చెప్తున్నాను. నేర్చుకోవటమే కాదు, నేర్పే స్థాయికి వెళ్లాలి. నేర్పటం అన్నది పైలోకాల స్థాయిలో ఉండేటటువంటి వారి యొక్క లక్షణం. గుర్తు పెట్టుకోండి క్రింది మూడు లోకాల వాళ్లు శిష్యులుగా ఉంటారు. పై మూడు లోకాల వారు గురువులుగా అవుతారు, అంటే బోధిస్తారు. అందుచేత ప్రతి ఒక్కరు గురువులుగా అవ్వాలి అంటే బోధ చేయాలి. అదే పత్రి గారు మనందరకు చెపుతున్నారు.

నేను కూడా మొదట్లో పత్రిగారు అలా చెప్పమంటారేమిటి? అని అనుకునేవాడిని. చెప్పటంలో ఇంత గొప్పతనం ఉందా? అని తర్వాత నాకు అర్థమైంది. తరువాత ఆయన ఏమన్నారంటే? "పంచింది పెంచబడుతుంది" అని అన్నారు. అంటే ధనాన్ని పంచితే ధనం, జ్ఞానాన్ని పంచితే జ్ఞానం పెంచబడుతుంది అని అర్థం అయ్యింది.

గుర్తుంచుకోండి ఆత్మకు కావలసింది ధనం కాదు జ్ఞానం. మరి జ్ఞానం పెరగాలి అంటే "ఈ జ్ఞానాన్ని పంచాలి". కొద్దిగా పంచితే కొంచెమే పెరుగుతుంది, ఎక్కువ పంచితే ఎక్కువ పెరుగుతుంది, అపారంగా పంచితే అపారంగా పెరుగుతుంది. పెంచబడాలి అంటే ఖచ్చితంగా పంచాలి. నేను ఇది అర్థం చేసుకున్నాను. అందుచేత నా వ్యాపారాలన్నీ మూసేశాను, పిల్లల్ని

కూడా బయటకి పంపేసాను. ఇంక నేను, మా మేడం ఇద్దరం  మా పూర్తి దృష్టంతా జ్ఞానాన్ని పంచటం మీదే పెట్టాము.

ధ్యానాన్ని, జ్ఞానాన్ని గత 20 సంవత్సరాల నుంచి, అంటే 2002 నుంచి పంచుతూ పెంచుకోవటమే మా పని. అంటే పత్రి గారు పరిచయం అయినప్పటి నుంచి ధ్యానాన్ని, జ్ఞానాన్ని పంచుతున్నాం. మాకు తెలియకుండానే మా జ్ఞానాన్ని పెంచుకుంటున్నాం, ఇంకా పెంచుకుంటూనే ఉన్నాం. అందుచేత మీరు కూడా కొద్దిగా అయినా పంచండి.

ఎందుచేతనంటే? పరిశుద్ధత లోకి వెళ్ళిన వాడు మహా లోకానికి చేరుకుంటాడు. మహా పరిశుద్ధత సాధించినవాడు తపో లోకానికి చేరుకుంటాడు. మరి పూర్తిగా మనస్సు శూన్యం చేసుకున్నవాడు, అంటే నిర్గుణ స్థితిలోకి వెళ్లిన వాడు సత్యలోకం చేరుకుంటాడు. అంటే ఈ మూడు గుణాలు అధిగమించాలని అర్థమవుతుంది.

ఈ విషయమే భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ (భ.గీ.2-45)**

తా:- ఓ అర్జునా! వేదాలు త్రిగుణాత్మకములైన సంసార విషయాలను తెలుపుతున్నాయి. నువ్వు త్రిగుణాలను వదిలిన వాడవుగాను, ద్వందాలు లేని వాడవు గాను, నరంతరం శుద్ధ సత్యాన్ని ఆశ్రయించినవాడవు గాను యోగక్షేమములు దృష్టి లేనివాడగుము. ఆత్మజ్ఞానివి కమ్ము.

అలాగే ఆంజనేయ స్వామికి కూడా పూర్ణజ్ఞానం లేదు. శ్రీరాములవారి కున్నంత జ్ఞానం లేదు.  ఆయన మంచి తపస్సే చేశాడు, అంటే సాధనే చేశాడు, ఎన్నో సిద్ధులు ఉన్నాయి, ఎన్నో మహత్యాలు ఉన్నాయి, శక్తులు ఉన్నాయి, కాని జ్ఞానవంతుడు కాలేదు.ఆంజనేయస్వామి రాముని ఆశ్రయించి తర్వాత జ్ఞానాన్ని పొందగలిగాడు.

మరణించిన తర్వాత ఈ మూడు గుణాలలో ఉన్న వారు జనాలోకం క్రిందే ఉంటారు. మూడు గుణాలు దాటితేనే జనాలోకం దాటుతారు అన్నదే దీనర్థం. ఇక్కడ పత్రి గారు చెప్పిన విషయాలు, గొప్ప వారు చెప్పిన విషయాలు, భగవద్గీతలో చెప్పబడిన విషయాల లోని సారమే మీకు చెప్పటం జరిగింది.

అందుచేత గుర్తుపెట్టుకోండి. క్రింద మూడు లోకాలలో ఉండేవాళ్లే త్రిగుణాలలో ఉంటారు. వారు భూమి మీద పూజలు చేస్తూ ఉంటారు, ఆరాధనలు చేస్తూ ఉంటారు, భక్తులమని అనుకుంటారు.

అంతేకాదు దైవం అంటే నాకు బాగా ఇష్టం అంటారు. కానీ దైవానికి వీడు ఇష్టుడు అయ్యాడా? లేదా? అన్నది తెలుసుకోడు. మరి దైవం ఎవరంటే ఇష్టపడతాడు అంటే పై మూడు లోకాలు చేరుకోగలిగినటువంటి అర్హత సంపాదించిన వారు. మరి ఆ అర్హత ఎవరికి వుంటుంది? అంటే జ్ఞానం సంపాదించిన వారికి. వారే ఆ లోకాలు చేరుకోగలరు కాబట్టి.

ఆయన ఏమన్నారంటే? నన్ను ఆరాధించే వాళ్ళలో నాలుగు రకాల భక్తులు ఉన్నారు. వాళ్ళు ఎవరంటే? ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసులు, జ్ఞానులు. వీళ్ళందరిలో  జ్ఞానే నాకు ఇష్టుడు అని భగవద్గీతలోని భ.గీ.7-17, 7-18 శ్లోకాలు బట్టి మనం తెలుసుకోవచ్చు.

అందుచేత జ్ఞానం సంపాదించిన వాళ్ళంటేనే భగవంతుడికి ఇష్టం. అటువంటి వాళ్ళే పై లోకాలకు అర్హత సంపాదిస్తారు, జనాలోకం దాటి వెళ్తారు.

అటువంటి జ్ఞానమే పత్రి గారు మనల్ని సంపాదించుకోమంటున్నారు. పత్రి గారు చెప్పేవన్నీ కూడా ఉన్నత లోకాలు పొందటానికే.  అందుచేత ధ్యానం చేయండి,  జ్ఞానవంతులు కండి.

జ్ఞానవంతులు కావడానికి నాలుగు విషయాలు పత్రి గారు చెప్పారు. అవే 1.ధ్యాన సాధన, 2.స్వాధ్యాయం, 3.సాంగత్యం, 4.సేవ. అందుచేత ఊర్ధ్వ లోకాలకు చేరుకోవాలనుకునే వారు ఈ నాలుగు ఆచరించాలి.

# ఊర్ధ్వ లోకాలు చేరుకోవాలంటే ఎటువంటి లక్షణాలు ఉండాలి?

ఎవరైనాసరే  జీవించి ఉండగానే మరణించిన తర్వాత లాభం కలిగే పనులు చేస్తుంటారో! వాడు గొప్పవాడు. నా విషయం వరకు వస్తే నేను ఆ పనులే చేస్తున్నాను. నేను అంతకుముందు చేసేవన్నీ వదిలి పెట్టేశాను. నా జీవితం పూర్తిగా మారిపోయింది, గట్టిగా చెప్పాలంటే  యూ టర్న్ అయిపోయింది. నన్ను చూసేవాళ్ళకు ఆశ్చర్యం కలుగుతుంది, ఏమిటి? ఈయన ఇలా మారిపోయాడు అనుకుంటారు.

దానికి కారణం పత్రి గారు పరిచయం అయిన తర్వాత **'నేను దేహం కాదు, నేను ఆత్మను'** అన్న సంగతి తెలుసుకున్నాను. నేను భూమి మీద శాశ్వతంగా  ఉండను అన్న సంగతి కూడా తెలుసుకున్నాను. అలాగే ప్రతి ఒక్కరు ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందేనన్న సంగతి తెలుసుకున్నాను. అంతేకాదు మరణించిన తర్వాత పొందే లాభమే శాశ్వతం కాని,  భూమిమీద పొందే లాభాలు శాశ్వతం కాదు అని తెలుసుకున్నాను.

అప్పటి నుంచి నాకు ఉన్నవన్నీ కూడా మరణం తర్వాత నాకు అంటే 'ఆత్మ'కు లాభం కలిగే వాటికే నేను ఉపయోగిస్తున్నాను. దానికి ఏం చేయాలి? ఏమి చేస్తే మరణించిన తర్వాత లాభం పొందుతాము అన్నవి కూడా తెలుసుకున్నాను. పత్రి గారు చెప్పినట్టు చేస్తే ఆత్మకు అంటే నాకు లాభమని తెలుసుకున్నాను. అందుచేత ఆత్మ లాభానికే ప్రాముఖ్యం ఇస్తున్నాను.  అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆత్మ లాభానికే కృషి చేస్తున్నాను.

ముఖ్యంగా ఎవ్వరైనా సరే పత్రిగారు చెప్పినవన్నీ చెయ్యాలి. ఆయన ఏమి చెపుతున్నారంటే?  అజ్ఞానంలోంచి బయట పడాలి, జ్ఞానం సంపాదించు కోవాలి, జ్ఞానవంతులు అవ్వాలని చెప్తారు. దానికి ధ్యానం చేయాలి అంటారు. ఈ ధ్యానం అన్నది జ్ఞానం కోసమే కాని,  రోగాల కోసం, కోరికల కోసం, ఇంకా ఏవో లాభాల కోసం, అనుభవాల కోసం కాదు అని పత్రీజీ పదే, పదే చెప్తూ వుంటారు.

ఆయన ఇంకా ఏమంటారంటే? మీరు జ్ఞానం కోసం ఈ ధ్యానం చేస్తే మీరు కోరుకునే లాభాలుఆటోమేటిక్ గా వస్తాయి. చిన్న, చిన్న లాభాలు అన్నవి పెద్ద విశేషమేమీ కాదు, అవిమీ మీరు కోరుకోవక్కర్లేదు, అడగక్కర్లేదు, వాటికోసం చూడక్కరలేదు అని అంటారు. అందుచేత వాటికోసం మనం ఆందోళన చెందనక్కరలేదు అన్నది నాకు అర్థమైంది.

ఈ మార్గంలో చేయవలసిన ఆధ్యాత్మిక సేవలన్నీ పత్రీజీ చెప్పారు. వాటిని మనం చేస్తూ ఉంటే భౌతిక జీవితంలో మీకు ఏ ఇబ్బందులు వున్నాయో! అవన్నీ తొలగిపోతాయి అని చెప్పడం జరిగింది. మీరు అంతకు ముందు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాకూడా వాటి నుంచి బయటపడటమే కాదు, బాగా జీవించగలుగుతారు. మన సొసైటీలోనే శ్రీకాంత్ అందరికీ తెలుసు. అన్నిచోట్లా క్లాసులు చెబుతూ ఉంటాడు. ఒకప్పుడు ఉన్న ఊరు వదిలేసి హైదరాబాద్ వచ్చేశాడు. అతనికి అక్కడి జీవితం నచ్చలేదు. ఎంతసేపూ ఏదో తెలుసుకోవాలి? ఏదో చెయ్యాలి? ఇది కాదు జీవితం అనేటటువంటి బలమైన కోరికతో కుటుంబాన్ని వదిలేశాడు. అక్కడ ఏవో కొద్దో, గొప్పో ఆస్తులు వున్నా వాటిని కూడా వదిలేశాడు. వాళ్లంతా ఎంత బలవంతం చేసినా, ఏం చేసినా నేను అక్కడ ఉండలేను అని చెప్పి వచ్చేసాడు.

సరే వచ్చేసాడు బాగానే ఉంది. వాళ్ళను కాదని వచ్చేస్తే వాళ్ళు పైసా ఇవ్వలేదు; అయినా వీడు లెక్క చేయలేదు. శ్రీకాంత్ లో ఉన్న తపన నాకే ఆశ్చర్యం వేసింది. పోన్లే ఒక ఉద్యోగం చూసుకొని రావడం వేరు, ఉద్యోగం లేదు, సంపాదన లేదు, ఆధారం లేదు, ఏమీ లేదు వచ్చేసాడు. రావడం అంటే తేలికే, కాని తిండి కావాలి ఎవరు పెడతారు చెప్పండి? ఎవడు ఇస్తారు చెప్పండి? అలా వాళ్లని, వీళ్ళని పట్టుకొని మేనేజ్ చేసేవాడు. ఎంత చేసినా ఏవో లోపాలు కనిపించి ఉండలేకపోయేవాడు. ఎక్కడో సెంటర్ ఉంటే! అందులో ఎక్కడో పడుకుంటూ, ఎవడైనా పెడితే అలా తినేవాడు, అలాగే ఉండేవాడు. అలా మెల్లిమెల్లిగా నా దగ్గరికి చేరాడు. నా క్లాసులు వింటూ జ్ఞానాన్ని పెంచుకున్నాడు; చాలా శ్రద్ధగా వినేవాడు. శ్రీకాంత్ లో ఉన్నటువంటి ఒక గొప్ప గుణం ఏంటంటే విన్నది మర్చిపోడు, విన్న తర్వాత మళ్ళ చెప్పమంటే

బాగా చెప్పేస్తాడు. పత్రి గారు చెప్పిన విషయాలు కానీ, నేను చెప్పిన విషయాలు కాని చెప్పగలిగేవాడు.  దానివల్ల  నా క్లాసులన్నీ వింటూ ఆ జ్ఞానాన్ని పట్టాడు.

అప్పుడు  నువ్వు  ఈ విషయాలు అందరికీ చెప్పు, జ్ఞానాన్ని పంచు అని చెప్పాను. అది గొప్పసేవ కిందకు వస్తుంది అని చెప్పాను. అది  అర్థం చేసుకొని తనూ చెప్పడం మొదలు పెట్టాడు.

భీమవరం క్లాసులకి కంటిన్యూగా రావడం వల్ల, చాలామంది పరిచయం అయ్యారు. అలా వాళ్లందరినీ పట్టుకొని వాళ్ల దగ్గరికి వెళుతూ ఈ క్లాసులు చెబుతూ ఉండేవాడు. ఇతను చెప్పే పద్ధతి చూసి అందరికీ బాగా నచ్చింది. అలా ఒక చోటు నుంచి ఇంకోచోటకు వెళ్లడం, తిరుగడం చేసేవాడు. ఆధ్యాత్మిక పుస్తకాలు కూడా అందిస్తే అది కూడా ఒక సేవ అని చెప్పాను, అర్థం చేసుకున్నాడు. పుస్తకాలు తీసుకెళ్లి ఇచ్చేవాడు. అందులో కొంత డబ్బు రావడం వల్ల మెయింటెయిన్ అయ్యేవాడు. అలా మెల్లిమెల్లిగా వీడు చేసే ఈ కృషి వల్ల, సేవ వల్ల, అన్నీ అనుకూలించేవి.

చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ అంటారు కదా? అలా వాడికి అన్ని రకాలుగా ఒక్కొక్కటి, ఒక్కొక్కటి అనుకూలించడం వల్ల, మెల్లిగా యజ్ఞాలలో బుక్స్ స్టాల్ పెట్టడం ప్రారంభించాడు. అలా అందరిని పరిచయం చేసుకుంటూ...ఇప్పుడు ఏ స్థాయికి వచ్చాడు అంటే అందరితో సమానంగా మార్కెటింగ్ చేస్తున్నాడు. ఎవరికి ఏ పుస్తకాలు కావాలన్నా శ్రీకాంత్ సప్లై చేస్తాడు. ఏమీలేనివాడు అంత స్థాయికి వెళ్ళాడు. ఇదంతా దేనివల్ల జరిగింది అంటే! వాడు చేసే సేవ వల్లే.

అందుచేత ఎవ్వరైనా సరే లోటు ఉందని బాధపడకండి. అది గతంలో చేసుకున్నది  అనుభవిస్తున్నారు.  ఇక్కడి నుంచైనా మీరు  ఎంతో కొంత సేవ చేయడానికి ప్రయత్నించండి.   మీ భవిష్యత్తు కూడా మారుతుంది. అంతే తప్ప, ఏమి చేయకుండా నా పరిస్థితి మారాలి  అంటూ కూర్చుంటే ఏమీ ప్రయోజనం ఉండదు. ఏమీ చేయకుండా ఏం వస్తుంది? నువ్వు ఏది చేస్తే అదే వస్తుంది.

నన్ను చాలామంది అడుగుతూ ఉంటారు. చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామండి బయటపడడం ఎలాగో చెప్పండి అంటారు. నాయనా నువ్వు చేసుకున్నది అనుభవిస్తున్నావు, ఎంత చేశావో అంతా అనుభవించాల్సిందే! అందుచేత కొన్నాళ్ళు ఓపిక పట్టాలి, అంతకన్నా ఏమీ లేదు. నువ్వు ఖాళీగా కూర్చోకుండా కనీసం ఇప్పటి నుంచైనా ఎంతో కొంత సేవ చెయ్యి. నువ్వు డబ్బే ఇవ్వక్కర్లేదు. శరీరంతో చేసే సేవలు చేయవచ్చు, యజ్ఞాల్లో పాల్గొనవచ్చు అని చెప్తాను. ఎంతోమంది ఎన్నోరకాలుగా సేవలు చేస్తున్నారు. మీ వూరిలో ధ్యానం క్లాసులు పెడితే వాళ్లకు సహకారం చేయండి. అలా చేస్తూ ఉంటే? మీ భవిష్యత్తు మారిపోతుంది అని చెబుతూ ఉంటాను.

ఇలా నేను చాలామందిని చూశాను. మన సొసైటీ లోనే చాలా ఇబ్బందులు పడేవాళ్ళు ఇప్పుడు మంచి జీవితం పొందడం జరిగింది.

మేము కూడా అన్నీ వదిలేసి ఈ సేవలో పాల్గొనడం వల్ల మాకు అంతకు ముందు ఉండే కొద్ది, కొద్ది లోపాలు అన్నీ కూడా సర్దుకున్నాయి. అందుచేత ప్రతి ఒక్కరికి నేను ఇచ్చే సలహా ఏమిటంటే? పత్రి గారు చెప్పినటువంటి సాధన, స్వాధ్యాయం, సాంగత్యం, సేవ చేసినట్లయితే ఎవరైనా సరే, ఆర్థికంగానే కాదు, సంసార పరంగానే కాదు, మానసికంగా కూడా శాంతిగా జీవిస్తారు. ఆలోచించండి? అంతకన్నా ఏం కావాలి? ఇక అంతకన్నా గొప్ప జీవితం ఏముంటుంది?

తెలుసుకోండి! ఏమున్నా, లేకపోయినా శాంతి ఉంటే వాడే గొప్పవాడు. అలా పత్రి గారు చెప్పేటువంటివి ఒక్కొక్కటి మనం పాటించాలి. ఆయన ఏం చెప్పారంటే? "మరణించకముందే మరణించాలి" అన్నారు. అంటే మరణించిన తర్వాత జరిగేదేదో! మరణించక ముందే మనం తెలుసుకంటే? ఇప్పుడు మనం ఏం చేయాలో అర్థమవుతుంది.

ముఖ్యంగా చావు అంటే భయం పోతుంది. చనిపోయిన తర్వాత లాభం పొందాలి అంటే ఏం చేయాలో తెలుస్తుంది. అవన్నీ చేయడానికి ప్రాముఖ్యం ఇస్తాం.

పత్రి గారు చెపుతారు కదా.. దేని మీద శ్రద్ధ పెడితే అదే మనం

సాధిస్తాం అని. మీరు సంగీతం మీద శ్రద్ధపెడితే సంగీతంలో విద్వాంసులు అవుతారు. మీరు రాజకీయాల్లో శ్రద్ధ పెడితే ఓ రాజకీయ నాయకుడు అవుతారు. మీరు వ్యాపారం మీద దృష్టి పెడితే డబ్బు బాగా సంపాదిస్తారు. అలాగే జ్ఞానం మీద దృష్టి పెడితే మీరు గొప్ప జ్ఞానవంతులు అవుతారు. ఆ జ్ఞానమే మనల్ని ఉన్నత లోకాలు చేర్చగలిగేది.

ఈ విషయమే ఇంతకు ముందు కొంత తెలుసుకున్నాం. అది ఏమిటంటే? ఎవరైతే భగవంతునికి ఇష్టులు అవుతారో! అంటే జ్ఞానులవుతారో! వారు ఖచ్చితంగా జనాలోకం దాటి పై లోకాలకే వెళ్తారు. అందుచేత భగవంతునికి ఇష్ఠులు అవ్వాలి.

అందుచేత గుర్తుపెట్టుకోండి ధ్యానం చేసి, అటువంటి జ్ఞానం మీరు సంపాదించుకోండి. అంతేకాదు మీ ప్రవర్తన ఎలా ఉంది? అసలు ఎలా వుండాలి? ఏ లక్షణాలు మీకు ఉండాలి? ఎటువంటి గుణాలతో మీరు ఉండాలి? అన్నది ముందు తెలుసుకోవాలి.

ధ్యానం చేస్తున్నారు, జ్ఞానం సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ మీ ప్రవర్తన మారితేనే జ్ఞాని అయినట్లు లెక్క, అప్పుడే మీరు భగవానుడుకి ఇష్టులు అవుతారు, అప్పుడే మీరు జనాలోకం దాటి పైలోకాలకు వెళ్తారు.

అందుకే పత్రిగారు ఏమని చెప్పారంటే? **"కష్టాలు, నష్టాలు, అవమానాలు అన్నవి ఆధ్యాత్మిక ప్రగతికి అంటే ఆత్మ ఉన్నతికి సోపానాలు"** అన్నారు. ఆయన ఇంకా అవి మీ ఆత్మ ఎదుగుదలకు తోడ్పడుతాయి తప్ప, అవేమి మీకు ఇబ్బంది కలిగించేవి కావు అన్నారు. అసలు అవేమి లేకపోతే మీ ఆత్మకు పురోగతి ఉండదు అంటే ఆత్మ ఎదుగుదల ఉండదు అన్నారు. అందుచేత ఆత్మ ఉన్నతి ఉండాలంటే ఖచ్చితంగా కొన్ని కష్టాలు ఉంటాయి, ఎంత ఉంటే అంత ఆత్మపరంగా మీరు ఎదుగుతారు అని తెలుసుకోవాలి. అందుచేత సుఖదుఃఖాలలో సమభావం ఉండాలి అని పత్రిగారు చెప్పారు.

అలాగే ఇప్పుడు మనం ధ్యానసాధన చేస్తున్నాం. ఈ ధ్యానం చెయ్యడం కూడా చాలా కష్టమే, ఊరికే చెప్పుకున్నంత తేలికేం కాదు. ఊరికే అనడానికి చాలా ఈజీ అంటారు. సోఫాలో కూర్చోడం ఈజీయే! చేతులు కట్టుకోవడం

ఈజీయే! కాళ్లు కట్టుకోవడం ఈజీయే! కళ్ళు మూసుకోవడం కూడా ఈజీయే! అక్కడి నుంచి ఉంటుంది తిప్పలు, ఇబ్బందులు, బాధ. వాడు ఎంత ఇబ్బంది పడతాడో అప్పుడు తెలుస్తుంది.

రెండు గంటలు అనుకుంటే కళ్ళు మూసిన తరువాత రెండు గంటలయ్యాక కళ్ళు తెరవాలి. ఈ లోపలో ఇబ్బంది రావచ్చు. కానీ ఎటువంటి పరిస్థితుల్లో కళ్ళు తెరవకూడదు. ఆ ఓర్పు ఉండాలి, ఆ సహనం ఉండాలి, ఆ తితీక్ష, ఆ సబూరి ఉండాలి. ఇవే గొప్ప గొప్ప వాళ్ళు చెప్పిన మాటలు.

అందుకే శ్రీ కృష్ణులవారు ఏం చెప్పారు అంటే ఓర్పు వుండాలి అన్నారు. పత్రి గారు సహనం అని చెప్తుంటారు, షిరిడి బాబా సబూరి అన్నారు.

అంతేగాని ఏదో ఒక ఆలోచన రాగానే, ఏదైనా కొంచెం ఇబ్బంది అనిపించగానే లేచిపోవడం కాదు. కష్టమైనా కూర్చోవాలి. ఎందుచేతనంటే? ఆ భగవానుడు ఇష్టపడే లక్షణాలలో సహనం కూడా ఒకటి.

ధ్యానం ద్వారా భగవానుడి మీద మనం దృష్టి పెడుతున్నాము. అందుచేత ఆయన మీద దృష్టి పెట్టడానికి ఓర్చుకోవాలి. శరీరాన్ని అదుపు చేస్తావు, బాగానే ఉంది. కాని ఇక్కడే ఆలోచనలు వస్తాయి. అప్పుడే సహిస్తూ కూర్చోగా, కూర్చోగా ఆలోచనలులేని స్థితి వస్తుంది. అప్పుడే భగవత్ స్థితిలో ఉంటావు.

అలా ఆ భగవానుడి మీద దృష్టి పెట్టాలన్నా, ఆయన్ని పొందాలన్న, ఆయన్ని చేరుకోవాలన్న, ఓర్పు ఉండాలి. ఊరికే కూర్చోవడం గొప్పకాదు, కూర్చోవడం అందరూ కూర్చుంటారు కాని, కూర్చోడానికి సహనం చూపించాలి. అందుకే పత్రి గారు "సహనమే ప్రగతి" అని అంటారు.

ఆయన జ్ఞాన నవరత్నాలలో ఎవరైతే సహనం చూపిస్తాడో! వాడే జీవితంలో ప్రగతి సాధిస్తాడు అని అన్నారు. ఆధ్యాత్మిక ప్రగతికి మార్గం, ధ్యానం చేయడం. అంటే అందులోనూ సహనం ఉంటేనే ఆ ప్రగతి ఉంటుంది, అదే పత్రి గారు చెప్తారు. అందుచేత ఉన్నత లోకాలు చేరుకోవాలంటే సహనం కూడా చాలా అవసరం.

# మానవ జీవిత లక్ష్యం

ధ్యానంలోకి రాక ముందు నేను దేహం అన్నట్టుగా జీవించే వాడిని. పత్రి గారు పరిచయం అయ్యాక **'నేను దేహం కాదు, నేను ఆత్మను'** అన్నది అర్థం చేసుకొని, దానికి అనుగుణంగా నేను జీవించడం మొదలుపెట్టాను.

అంతకుముందు ఏదైనా సందేశం ఇవ్వాలంటే చాలా కష్టమయ్యేది. కానీ ధ్యానంలోకి వచ్చాక గంటల తరబడే కాదు, రోజుల తరబడి ఎన్నో విషయాలు అనర్గళంగా చెప్పగలుగుతున్నాను. మరి ఈ స్థితి ఎలా వచ్చింది అంటే? పత్రి గారు చెప్పినట్టు "శ్వాస మీద ధ్యాస ధ్యానం వుంచి ధ్యానం చేయడం వల్లనే".

పత్రిగారు ఇచ్చే సందేశాలలో మరణానంతర జీవిత ప్రస్తావనలు అప్పుడప్పుడు వస్తూ ఉంటాయి. నేను ఆయన సందేశాలు ఎక్కువ వినడం వల్ల, నాకు ఎన్నో విషయాలు తెలిసాయి. ఆయన ఒక విషయాన్ని అనేక కోణాల్లో, అనేక చోట్ల చెప్తూ ఉంటారు. నేను ఏం చేస్తానంటే? ఆయన మరణానంతర జీవితం గురించి ఎక్కడ చెప్పినా, అవన్నీ తెచ్చి ఒకచోట వ్రాసుకుంటాను. అలాగే ఏ పుస్తకంలో మరణాంతర జీవితం గురించి చదివినా అవన్నీ ఒక చోట వ్రాసుకుంటాను.

ఎందుచేతంటే? చాలామంది ఏదో ఒక్కటి విన్నంత మాత్రాన, అంతా అర్థమైందని అనుకుంటారు. కానీ పూర్తి క్లారిటీ రాదు. కానీ వాటన్నింటినీ కలుపుకుంటే! మంచి క్లారిటీ వస్తుంది. దాన్ని ఒక సీరియల్ లో పెట్టుకుంటే అద్భుతమైన కాన్సెప్ట్ అవుతుంది.

అలాగా నేను భగవద్గీతనుంచో, లేకపోతే భజగోవిందంనుంచో, వశిష్టామృతంనుంచో అధ్యయనం చేయడం వల్ల, దీనికి అనుగుణమైన వాటిని దీంట్లో యాడ్ చేస్తూ వుంటాను. అలా చేయడం వల్ల ఇంకా ఎంతో విపులంగా తెలుసుకో గలగడమే కాదు బాగా అర్థం చేసుకోగలిగాను.

మీరు అయినా సరే జ్ఞానాన్ని పెంచుకోవాలి అనుకుంటే తప్పనిసరిగా యోగులందరూ చెప్పిన విషయాలు అన్నీ ఒక చోట పెట్టుకోవాలి.

అలాపెట్టుకుంటూ వాటిని మీరు ఒక ఆర్డర్లో తయారు చేసుకోవాలి. అలా కొంచెం కృషి చేయాలి, కష్టపడాలి. అలా కష్టపడితేనే మన జ్ఞానం పెరుగుతుంది, ఏమీ లేకుండా ఉత్తినే పెరగాలంటే? ఎలా పెరుగుతుంది? మనం ఊరికే ధ్యానం చేసేస్తేనే అన్ని వచ్చేస్తాయని అనుకుంటాం. గంటలు, గంటలు ధ్యానం ఒక్కటే సరిపోదు అని పత్రి గారు చెప్తూనే ఉంటారు.

ఆయన ఏమంటారంటే? ధ్యానం నీకు చాలా సహకరిస్తుంది, నీ బుద్ధిని వికసింపజేస్తుంది, నువ్వు అవగాహన చేసుకునే శక్తి నీకు పెంచుతుంది, ప్రతిదీ తేలికగా అర్థం చేసుకుంటావు, ప్రతిదీ విశ్లేషణ చేసుకుంటావు అంటారు.

కానీ జ్ఞానం పెరగాలి అంటే జ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలి, సజ్జన సాంగత్యం అంటే జ్ఞానుల సాంగత్యం చెయ్యాలి . మామూలుగా కొత్తవాళ్ళు ఆ అనుభవాలు, ఈ అనుభవాలు అంటూ... నాకు అది వచ్చింది, ఇది కనబడింది అని అంటూ ఉంటారు. కాని ఇలాంటి అనుభవాల వల్ల మనకేం ప్రయోజనం లేదు.

కానీ జ్ఞానుల సందేశాలు మనం వింటూ ఉండడం వల్ల అపారమైన జ్ఞానం మనం సంపాదించుకోవచ్చు. అలా నేను చెప్పే వాటిలో కూడా, ఇంకో పని లేకుండా వింటూ ఉంటే! ఎందుకు ఎదగరు?

పత్రి గారు ఏమంటారంటే? సమయాన్ని వృధా చేయొద్దు అంటారు. నీ పనులు చేసుకో, సంసారం చూసుకో, సుఖపడు, ఎంజాయ్ చెయ్ అని చెప్తారు. వాటితో పాటు నీకు ఖాళీ దొరికినపుడు, వ్యర్థమైన కబుర్లు, అక్కర్లేని కబుర్లు వద్దు అంటారు. అవసరం లేని పుస్తకాలు చదవద్దు, టైం వృధా చేయొద్దు అని పత్రి గారు చెప్తూ ఉంటారు.

మనకు పగలే కాదు, రాత్రి కూడా చాలా టైం ఉంటుంది. ఆ సమయాన్ని సాధనకు, స్వాధ్యాయానికి, సాంగత్యానికి ఉపయోగించి కృషి చేస్తే ఎందుకు ఎదగం? మనకు ఇంకో దృష్టి లేకపోతే జ్ఞానం ఎందుకు సంపాదించుకోలేం? మనం కూడా ఎందుకు గొప్పవాళ్ళు కాలేం?

ప్రస్తుతం మనం మరణించిన తర్వాత జరిగేదాని గురించి తెలుసు కుంటున్నాం. ఏమిటంటే? ఈ భూలోకం కాకుండా ఇంకా ఆరు లోకాలు ఉ న్నాయని తెలుసుకున్నాం. వాటిలో జనాలోకాన్ని ఎక్కువగా ప్రస్తావిస్తున్నాను.

కారణం జనాలోకం పైన కొన్ని లోకాలు, జనాలోకం క్రింద కొన్ని లోకాలు వున్నాయి. సామాన్యులు జనాలోకం క్రింద లోకాలకు వెళ్లగలుగుతారు. కానీ మహాత్ములు, జ్ఞానులు, యోగులు తపఃసంపన్నులు లాంటివాళ్లు జనాలోకం దాటాగలుగుతారు అని చెప్పడం జరిగింది.

ఆ జనాలోకం యొక్క ప్రాముఖ్యం గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

పత్రి గారు ఏమన్నారంటే? పూర్ణత్మలు కానీ, మూలాత్మ కానీ తనలోంచి అంశల్ని సృష్టిస్తుంది. అంటే అంశాత్మల్ని సృష్టి చేసి వాటికి ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఏమిటంటే? మీరు కూడా అపారమైన జ్ఞానసంపన్నులై నా స్థాయికి ఎదిగి, నేను ఉండే ఈ సత్యలోకానికి మీరు చేరుకుంటే! మీకు భూమిమీద జన్మలంటూ ఉండవు. కానీ సత్యలోకానికి చేరుకునే దాకా, ఏ లోకానికి మీరు వెళ్ళినా మళ్లీ, మళ్లీ జన్మ తీసుకోవాల్సిందే! ఆఖరికి సత్యలోకానికి క్రింద వున్నటువంటి తపోలోకం అంటే బ్రహ్మ లోకం చేరుకున్నా అంటే అంత గొప్ప స్థాయికి చేరుకున్నా మళ్లీ భూమ్మీదికి రావాల్సిందే అని చెప్తారు.

ఇదే మనకి భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ అబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తినో ర్జున ।**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥ (భ.గీ.8-16)**

తా: ఓ అర్జునా! ఆ బ్రహ్మలోకాల్లాంటి లోకాలకు చేరుకున్నా మరల జన్మ తీసుకోవలసిందే! కానీ నేను వుండేటటువంటి లోకానికి అంటే సత్యలోకానికి చేరుకుంటే! మరల పునర్జన్మ ఉండదు. అంటే భూమిమీద తిరిగి జన్మించవలసిన పని ఉండదు అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పినటువంటి విషయం ఎన్నోసార్లు మనం చెప్పుకున్నాం.

అలా ఆ పూర్ణాత్మ అంశాత్మకు ఒక లక్ష్యాన్ని నిర్దేసిస్తుంది. అంటే అంశాత్మలైన మనం పరం సత్యలోకం చేరుకోవాలి. అదే అందరి జీవిత లక్ష్యం. మరి ఆ సత్యలోకం ఎవరు చేరుకోగలరు? అసలు సత్యలోకంలో ఎవరు వుంటారు? అంటే పూర్ణత్మలే ఉంటాయి. అంటే పూర్ణత్మలకే సత్యలోకం చేరుకునే అర్హత లభిస్తుంది.

అంటే ఎవ్వరైనా సరే పూర్ణాత్మ కావాల్సిందే! పూర్ణాత్మగా

తయారవ్వాల్సిందే! అదే ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యం.

సహజంగా కొంతమందికి సందేహం కలుగుతూ వుంటుంది. ముఖ్యంగా ఎక్కువ కష్టాలు వచ్చినపుడు ప్రశ్నిస్తూ వుంటారు. ఆ దేవుడు నన్ను ఎందుకు పుట్టించాలి?ఎందుకు నన్ను ఇన్ని కష్టాలు పెట్టాలి? అసలు జీవితంలో నేను ఏం చేయాలి? అసలు ఈ జీవితం ఎందుకు? ఇలా చాలా సందేహాలు, చాలా మందిలో కలుగుతూ ఉంటాయి.

కొంతమంది ఏమనుకుంటారంటే? ఎంజాయ్ చేయడం కోసమే ఈ జీవితం అనుకుంటారు. అందుచేత ఎంతసేపూ సంపాదించడం, ఎంజాయ్ చేయడం లాంటివే చేస్తూ ఉంటారు.

కాని జన్మలు పెరిగేకొద్దీ! ఇలాంటి ప్రశ్నలు వస్తూ ఉంటాయి. అసలు నేను ఏంచేయాలి? ఎందుకు ఈ జీవితం? నేను సాధించవలసింది ఏమిటి? లాంటి ప్రశ్నలతో అంతా అయోమయంగా ఉంటుంది, సమాధానం దొరకదు.

ఇప్పుడు మనం ఇలాంటి ప్రశ్నలకు సమాధానం తెలుసుకుంటున్నాం.

పూర్ణాత్మ మొదట అంశాత్మను సృష్టి చేసి, ఆ రకమైన లక్ష్యాన్ని నిర్దేశించి, వాళ్లని జనాలోకంలో ప్రవేశ పెడుతుంది. ఈ అంశాత్మకు అది ప్రారంభ జన్మ కాబట్టి, అక్కడ ఆపైలోకాల్లో ఉన్నటువంటి ఆ సీనియర్స్ వాళ్ళకి చెప్పవలసినవన్నీ చెప్తారు. నువ్వు జన్మ తీసుకున్నాక కృషి చేసి లక్ష్యాన్ని సాధించాలని గుర్తు చేస్తారు. అప్పుడు వాళ్ళు మొదట్లో ఏదో ఒక జన్మ తీసుకుంటారు. స్త్రీగానో, పురుషుడుగానో, ధనవంతుడుగానో, పేదవాడిగానో! ఏదో ఒకటి తీసుకుంటారు.

అలా మొట్టమొదటి జన్మ భూమి మీద ప్రారంభం అవుతుంది. అలా తల్లి గర్భంలో ప్రవేశించి జన్మ తీసుకుంటారు. మొదట్లో కొన్నాళ్లు అవన్నీ గుర్తుంటాయి, తరువాత ఏది గుర్తుండదు, అన్నీ మర్చిపోతారు. వారి మీద ఆ చుట్టూ ఉన్నవారి ప్రభావం పడుతుంది.

ముఖ్యంగా మొదట 7, 8 సంవత్సరాలు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల యొక్క ప్రభావం వారి మీద బాగా ఉంటుంది. వాళ్లెలా చెబితే అలా చేస్తారు, వాళ్ళు తినే ఆహారం తింటారు, వాళ్లేమి చేస్తే అలా చేస్తూ ఉంటారు, వాళ్లు ఎలా జీవిస్తే అలా జీవిస్తారు. అది వాళ్ల పరిస్థితి. వాళ్లు మాంసాహారులు

అవుతే వీళ్లు మాంసాహారులు అవుతారు, వాళ్ళు శాకాహారులు అవుతే వీళ్లు శాఖాహారులు అవుతారు, అలాగే వాళ్ళు హిందువులు అవుతే వీళ్ళు హిందువులే అనుకుంటారు, వాళ్ళు క్రిస్టియన్ అవుతే వీళ్ళు క్రిస్టియనే అనుకుంటారు. అలా ఆ ప్రాంతం యొక్క ఆచారాలు, వ్యవహారాలు పాటిస్తూ ఉంటారు, ఇంచుమించు వారిలా తయారయిపోతారు.

మెల్లిగా 7, 8 సంవత్సరాలు దాటాక సమాజంలోకి వస్తారు. ఈ సమాజంలోకి వచ్చిన తర్వాత వాళ్ళందరి ప్రభావం వీరి మీద పడుతుంది. ఆ ఫ్రెండ్స్‌తో గడపడం, ఆ స్కూల్ కి వెళ్లడం, ఆ వాతావరణం అవన్నీ వీళ్ళ మీద పడతాయి. సహజంగా ప్రతి ఒక్కళ్ళు డబ్బుకి ప్రాముఖ్యం ఇస్తారు, డబ్బున్న వాడికి విలువ ఇస్తారు, డబ్బున్న వాడిని గౌరవంగా చూస్తారు, డబ్బులేని వాళ్లని చాలా హీనంగా చూస్తారు, చాలా తక్కువగా భావిస్తారు. అందుచేత ఆ డబ్బున్న వాడికి ఉన్న భోగాలు, వాడికుండే కార్లు, వాడకుండేవన్నీ చూసి నేను కూడా డబ్బు సంపాదిస్తే వారిలాగా హాయిగా ఉండొచ్చు కదా? అనేటువంటి అభిప్రాయం ఏర్పడుతుంది.

అలా వాళ్ళు ఎలా జీవిస్తూ ఉంటే వీళ్ళు అలా జీవిస్తారు. వాళ్లకు ఎలాంటి అలవాట్లు ఉంటే వీళ్లకు అవే అలవడతాయి. అలా చదువులు చదవడం అయిపోయాక మళ్లీ సంసారంలో ప్రవేశించడం జరుగుతుంది. మళ్లీ అదొక కొత్త రకమైన జీవితం. తర్వాత వాళ్లకి పిల్లల పుట్టడం, వారిని పెంచడం, చూసుకోవడం చేస్తూ ఉంటారు. అలా ప్రారంభ జన్మలో వాళ్లు తెచ్చుకున్న కర్మలు ఉండవు కాబట్టి కష్టాలు ఎక్కువ ఉండవు.

అందుచేత వీరికి అహంకారము, గర్వము ఎక్కువగా ఉంటుంది. అందుకే అంటారు ఏ కష్టం లేకపోతే దేవుడు గుర్తుకురాడు, కష్టం ఉన్నప్పుడే దేవుడు గుర్తొస్తాడు అంటారు. అంచేత ఏ కష్టం లేనివాడు ఎవరిని పట్టించుకోడు, అసలు దేవుని తలుచుకోవడమే తలుచుకోడు. చాలా గొప్పగా ఫీల్ అవుతూ ఉంటాడు. అలా గర్విస్తూ, అందరికంట తానే గొప్పవాడు అనుకుంటూ మెల్లిమెల్లిగా తప్పులు, పాపాలు చేస్తూఉంటాడు.

అలా మొదలవుతాయి వాడి కర్మలు. వాడు చేసిన కర్మలన్నీ వాడి కాతాలో జమ అవుతూ ఉంటాయి. ఆ జన్మలో కొన్ని అనుభవిస్తాడు, మిగిలినవి

శరీరం వదిలాక పైన వాడి అకౌంట్లో అంటే సంచితంలో పడతాయి.

చనిపోయిన తరువాత శరీరం వదలి పైకి వెళ్ళి పోతాడు. మరల జన్మ తీసుకున్నప్పుడు వాని సంచిత కర్మలలో కొన్ని తీసుకొని మళ్లీ భూమ్మీదికి వస్తాడు. మళ్లీ మామూలే! ఆ కర్మలు అనుభవిస్తూ, మళ్లీ చేస్తూ, కర్మలు పెంచుకుంటూ జన్మలు పెంచుకుంటాడు. అలా జన్మలు పెరుగుతూ, జీవిత ప్రయాణం సాగుతూవుంటుంది.

పత్రి గారు ఏం చెప్తారంటే? ప్రారంభ జన్మలో దేహాభావంతో వుంటారు అంటే దేహానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ ఉంటారు. అంటే ఖానా, పీనా, సోనా తప్ప ఇంకేమి వుండదు.

అలా 100, 150 జన్మలు జరిగాక వారిలో కొంచెం మార్పు వస్తుంది. వాళ్ల గుణము మారుతుంది. అప్పుడు వాళ్లు మనోస్థితిలోకి వస్తారు. అంటే మనసుకు ప్రాముఖ్యం ఇస్తారు. ఎన్నో కోరికలు ఉంటాయి, చాలా గొప్పవాడు అవ్వాలి అనుకుంటాడు, అందరికంటే గొప్పవాడు అవ్వాలి అనుకుంటాడు. ఏదో పదవి సంపాదించాలి అనుకుంటాడు, లేకపోతే ఏదో చాలా గొప్ప పేరు సంపాదించాలని అనుకుంటాడు. గర్వంతో తప్పులు పాపాలు చేస్తూ ఉంటాడు. కర్మలు అలా పెరుగుతూ ఉంటాయి. కర్మలతో పాటు, కష్టాలుకూడా పెరుగుతూ ఉంటాయి, అలా ఇంకో 100, 150 జన్మలు గడచిపోతాయి.

అలా జన్మ, జన్మకి కష్టాలు ఇంకా ఎక్కువ అవుతాయి. కారణం ఎన్నో జన్మలలో చేసిన కర్మలన్నీ ఉంటాయి కాబట్టి, వారు అవే తెచ్చుకుని, అవి అనుభవిస్తూ వుంటారు.

ఈ కష్టాలు ఎక్కువైనప్పుడు వారు ఆలోచనలో పడతారు. ఏమిటి ఈకష్టం? ఎందుకు వచ్చింది? అని ఆలోచిస్తారు. వాళ్ళకు ఏమీ అర్థం కాదు. అప్పుడు పెద్దల్ని, గురువుల్ని పట్టుకుంటాడు. వాళ్లని ఆశ్రయిస్తాడు, వాళ్లని అడుగుతూ ఉంటాడు. నేను ఈ కష్టంలోంచి బయట పడాలి అంటే ఎలా? ఏం చేయాలి? అని అడుగుతాడు. వారు చెప్పినట్టు చేస్తూ ఉంటాడు.

అంతకుముందు జన్మలలో వీడికి ఏ గురువు అక్కర్లేదు, ఎవడు అక్కర్లేదు. కానీ ఆ స్థాయికి వచ్చేసరికి అంటే 250, 300 జన్మలు దాటే సరికి గురువుని వెతుక్కుంటూ ఉంటాడు. వాడికి నచ్చిన గురువు పరిచయమైతే మెల్లి, మెల్లిగా

వాళ్లు చెప్పే సందేశాలు వింటూ, తన ప్రవర్తన మార్చుకుంటూ ఉంటాడు. మెల్లి, మెల్లిగా సాత్వికగుణంలోకి వస్తాడు.

ఇలాంటి టైంలో వాడు ఇంకా, ఇంకా తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. అలా చివరికి ఏం జరుగుతుందంటే ? ఇంకా ఏదో ఉంది! అనుకుంటూ పత్రి గారి లాంటి గురువును చేరుతాడు. అప్పుడు ఆయన లాంటి వాళ్లు ఏం చెప్తారు అంటే ఇవి, అవి కాదు నాయనా, పూజలు, భజనలు, స్తోత్రాలు, జపాలు కాదు ధ్యానం చేయండి అని చెప్తారు.

అప్పుడు ధ్యానం కూడా చేస్తాడు, శాకాహారంలోకి వస్తాడు, బుద్ధి బాగా వికసించే స్థితికి వస్తాడు. అలా కొంచెం మంచి – చెడు, తప్పు–ఒప్పు, పాపం–పుణ్యం, ధర్మం–అధర్మం గురించి ఆలోచించడం ఎక్కువవుతుంది. మెల్లిగా ఈ తప్పులు, పాపాలు మానేస్తాడు, మంచి పనులు, సేవలు చేస్తూ వుంటాడు, ఆధ్యాత్మికంగా కొంచం ఎదుగుతాడు.

అప్పుడు ఈ ధ్యానం చేస్తూ, ఆ గురువు చెప్పేటువంటి పుస్తకాలు చదవడం, వారి సందేశాలు వినడం చేస్తూ ఉంటే వాళ్లకి మెల్లిగా జ్ఞానం పెరుగుతూ ఉంటుంది.

ఇప్పుడు మనమంతా ఆ స్థాయిలో ఉన్నవాళ్ళమే. మనమంతా కూడా అన్ని జన్మలు ఎత్తి, అన్ని రకాల స్థితులు దాటి ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాం.

కాని కొంతమంది ధ్యానంలోకి వచ్చినా కూడా వాళ్లు ఈ స్థాయిలో వుండరు. వారు దేహ స్థితిలోనో, మనో స్థితిలోనో ఉన్నవాళ్లే! వాళ్ళు ధ్యానం చేస్తే రోగాలు తగ్గుతాయి, ధ్యానం చేస్తే కోరికలు తీరుతాయి అని ధ్యానంలోకి వస్తారు, అంతేకాని జ్ఞానం కోసం రారు.

అందుచేత వాళ్లు అటువంటి క్లాసులకి వెళుతూ ఉంటారు ఇప్పుడు గైడింగ్ అని, సంకల్ప ధ్యానాలు అని, మనీ మెడిటేషన్స్ అని, అలా ఏవేవో రకరకాల ధ్యానాలు వస్తున్నాయి కాబట్టి వాటిలోకి వెళ్తారు. కాని వాళ్ళు ఇంకా చాలా జన్మలు తీసుకోవాలి. వాళ్లు జ్ఞాన స్థాయిలోకి రావాలి అంటే కచ్చితంగా వాళ్లు ఓ యాబయ్యో, వందో జన్మలు తీసుకుంటే తప్ప జ్ఞానమార్గం రాలేరు, మనం చెప్పినా వాళ్లకి ఎక్కదు.

మీరు ఇవన్నీ దాటి వచ్చారు కనుకనే నేను కచ్చితంగా చెప్తున్నాను, మీలో చాలామంది ఈ గైడింగ్ లాంటివి చేసినా ఫలితం రాక, ఏమిటి ? ఏమిటి ? అంటూ ఈ జ్ఞానమార్గంలోకి వచ్చిన వాళ్లే! గైడింగ్‌లో వుండేవాళ్ళకి ఆత్మజ్ఞానం అర్థం కాదు.

అందుచేత ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుకుంటాయి అని పత్రి గారు చెప్తుంటారు. అందుచేత ఇప్పుడు మనం చేయవలసింది మన జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలి. మన జన్మలు వేస్ట్ చేసుకోకూడదు. ఇప్పటిదాకా 300, 350 జన్మలు మనకి వేస్ట్ అయిపోయాయి. ఇంక మనం వేస్ట్ చేయకూడదు. వీలైనంత తొందరగా మన జీవిత లక్ష్యం అయినటువంటి ఆ పూర్ణ జ్ఞానాన్ని సంపాదించుకొని మన గమ్యం అయినటువంటి సత్యలోకం చేరుకునే దిశగా మనం కృషి చేయాలి. జనాలోకం దాటిన వాళ్ళు బాగా కృషిచేస్తారు. ధ్యాన సాధన చేసి జ్ఞానాన్ని పెంచుకుని, గొప్ప సేవలు చేసి జనాలోకం దాటి వెళ్తారు.

ఇక్కడ ఇంకొకటి గుర్తుపెట్టుకోండి, జనాలోకం దాటిన వాళ్ళు జనాలోకం వెళ్ళవలసిన అవసరం వుండదు. అందుచేత ఎవ్వరైనా సరే జనాలోకం దాటిఉన్న ఆ గొప్పలోకాలు చేరుకునే ప్రయత్నం చేయాలి.

మనం ఇంతకుముందు చెప్పుకున్నాం, ఎవరైతే భూమ్మీద విశేషమైన సేవలు చేస్తారో! నిస్వార్థంగా జీవిస్తారో! తనకోసం కాక పరుల కోసమే జీవితాన్ని వెచ్చిస్తారో! వారు భూమిమీద మహాత్ములు అని పిలవబడతారు. శరీరం వదిలి తర్వాత అంటే చనిపోయిన తరువాత మహాలోకానికి చేరుకుంటారు. తరువాత అక్కడ నుంచి క్రిందికి వస్తారు. సేవలు చేస్తూ మెల్లిమెల్లిగా ధ్యాన సాధనలోకి వస్తారు. ధ్యాన సాధనతోపాటు జ్ఞాన సముపార్జన చేస్తారు.

ధ్యానం అంటే తపస్సు విశేషంగా చేస్తారు. చాలా తీవ్రాతి తీవ్రంగా చేస్తారు. అలా తీవ్రంగా చేయడం వల్ల వాళ్లు తపోలోకం చేరుకుంటారు. ఆ తపోలోకంనుంచి మరల భూమ్మీదికి వస్తారు. ఆ సాధన ఇంకా తీవ్రాతి తీవ్రంగా చేస్తూ ఒక ఆంజనేయ స్వామిలా, ఓ ముమ్మిడివరం బాలయోగిలా, ఓ జిల్లెలమూడి అమ్మ లాగా, చివటం అమ్మవారిలాగా, అవధూతల్లాగా, జన్మంతా సాధన తప్ప ఇంకోటి ఉండదు. అలా సాధన చేస్తూ మెల్లి, మెల్లిగా సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటారు.

చివరికి ఓ సత్యసాయిబాబా, ఓ షిరిడి బాబా, ఓ వివేకానంద, ఓ రమణ మహర్షి లాగా సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొని సత్య లోకం చేరుకుంటారు. అక్కడితో వాళ్ల యొక్క రాకపోకలు ఆగిపోతాయి. ఇక భూమి మీదకి వాళ్లు రావాల్సిన పని లేదు. తర్వాత సత్యలోకంలో ఉండి, అక్కడ చేయవలసిన పనులు చేసుకుంటారు.

ఇవన్నీ అర్థం అవుతే ఎవరికైనా దృష్టి దానిమీదే ఉంటుంది. ఇది అర్థం కాకపోతే వేరే దృష్టి వుంటుంది, వేరే వేరే పనులు చేస్తారు. ఎవరైనాసరే వారి శరీరం కోసం, శరీర అవసరాలు తీర్చుకోవడం కోసం సహజంగా చేయవలసినవి చేయాలి. సంసారంలో ఉన్నవాళ్లకు పిల్లలు, కుటుంబ బాధ్యతలు తప్పవు. అది సృష్టి ధర్మం.అందుకే పత్రీజీ "సంసారంలోనే నిర్వాణం" అన్నారు.

మన తల్లిదండ్రులు వల్ల మనం భూమ్మీదికి వచ్చాం. మనం భూమ్మీదికి వచ్చి, ఇంక నాకేమీ అక్కరలేదు అంటే ఎలా? మనం ఎలా భూమిమీదకు వచ్చామో! ఈ సృష్టి కొనసాగడానికి మన తల్లిదండ్రులు, వాళ్ళ పాత్ర వాళ్లు ఎలా పోషించారో! మనమూ పోషించాలి. మనం కూడా కొంతమంది పిల్లలకి జన్మనిస్తూ సృష్టి ధర్మం నిర్వర్తించాలి. అంతేకాదు జన్మ ఇచ్చిన తరువాత వాళ్లని ప్రయోజకులుగా చేసే వరకు కొంత దృష్టి వాళ్ల మీద కూడా పెట్టాలి, వాళ్ళ బాధ్యత చూడాలి. అంటే వాళ్లని పోషించాలి, వాళ్ళని ప్రయోజకులుగా చేయాలి. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే వరకు పోషించాలి.

వారు ఓ ఉద్యోగం సంపాదించుకొని, వాళ్ళ పని వాళ్ళు చేసుకునే స్థాయి వచ్చినప్పుడు వాళ్లని పూర్తిగా వదిలేయాలి. పక్షి రెక్కలు వచ్చాక పిల్లని ఎలా వదిలేస్తుందో! మనం కూడా అలా వదిలేయాలి. అంతే గాని చచ్చేదాకా వారిని పట్టుకు కూర్చోవడం కాదు. అందుచేత కుటుంబ బాధ్యత చూసుకోవాలి. అలాగే సంపాదన కూడా చూసుకోవాలి.

ఇందులో భార్య, భర్త ఇద్దరు వారి పాత్ర పోషించాలి. వారు వారికి ఉండే బాధ్యతలు కలిపి చేస్తూ వుండాలి. అలా భర్త సంపాదిస్తాడు, భార్య సంసారాన్ని నిర్వహిస్తూ ఉంటుంది. అందుచేత ఏ ఇబ్బంది ఉండదు. ఆ రకంగా చేస్తూ, జీవిత లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం చేయాలి. అలా చేసినప్పుడు జీవితాన్ని సద్వినియోగం చేసుకున్నవాళ్ళం అవుతాం, వచ్చిన పని పూర్తిచేసుకున్న

వాళ్ళమవుతాం. ఏ ఉద్దేశంతో భూమ్మీదికి వచ్చామో అది మనం సాధించుకున్న వాళ్ళమవుతాం. అలా జీవిస్తే మరి నిజంగా గొప్పవారమే!

అలా నీ ప్రణాళిక ప్రకారం నువ్వు జీవిస్తే, ఇంక అంతకన్నా కావాల్సింది ఏమిటి? అంతేకాదు పత్రి గారి లాంటి గురువు దొరికితే మన ప్రణాళిక కంటే కూడా మించి మనం చేయగలుగుతాం. అందుచేత మనం ఏ దశలో ఉన్నా, అంటే యవ్వనంలో ఉన్నా, లేకపోతే కౌమారదశలో ఉన్నా, వార్ధక్యంలో ఉన్నా, మన లక్ష్యాన్ని తెలుసుకొని దాన్ని సాధించే కృషి మనం చేయాలి. ఎంత సమయం ఉంటే ఆ సమయం ఆత్మకోసం కేటాయించాలి.

కొన్ని ఇబ్బందులు ఉండచ్చు, కొన్ని అవరోధాలు ఉండచ్చు, కొన్ని పరీక్షలు కూడా ఉండచ్చు. చాలా ఉంటాయి, వాటి దారి వాటిదే! మన దీక్ష, పట్టుదల, మన లక్ష్యం మనదే. అందుచేత ఇక్కడ స్త్రీయా, పురుషుడా, ధనవంతుడా, పేదవాడా అన్నవి మనకు అవసరం లేదు. అవన్నీ శాశ్వతంగా ఉండేవి కావు. ఎవరైనా ఆత్మలే అని మర్చిపోకూడదు. ఎవరూ ఎవరికీ శాశ్వతం కాదు, ఎవరికి వాళ్లే వచ్చారు.

అందుకే పత్రి గారు ఏమంటారంటే? ప్రక్క వాళ్ళ మీద దృష్టి వద్దు అంటారు. నీ గురించి నువ్వు చూసుకో! ప్రక్క వాళ్ళ గురించి ఎందుకు ఆలోచిస్తావు అంటారు.

ఈ గైడింగ్‌లో ఏమంటారంటే? మీరు ఆస్ట్రాల్ మాస్టర్స్ ని అడగకపోతే వాళ్లు ఎందుకు ఇస్తారు? మీరు అడిగితేనే కదా వాళ్ళు ఇచ్చేది అని అంటారు. అందుచేత కొరాలనుకుంటూ, అడగాలి అనుకుంటూ, అడగనిదే అమ్మైనా పెట్టదు కదా అని మాట్లాడుతూ ఉంటారు, వాటి వెనకాలే పడతారు.

కానీ భగవంతుని సృష్టిలో కోరవలసిన పని లేదు, చేయవలసింది చేస్తే కచ్చితంగా పొందవలసినది పొందుతాం. అందుచేత కోరడం మీద కాదు, చేసే దానిమీద దృష్టి పెట్టాలి అంటారు పత్రిగారు.

ఆయన ఏమంటారంటే? ప్రారంభ జన్మల్లో "కోరింది రాదు, అర్హతను బట్టి వస్తుంది" అంటారు. నువ్వు డబ్బు కోరావు, నీకు రాదు. కాని నువ్వు కోరక పోయినా గత జన్మలలో నువ్వు దానాలు చేసి ఉంటే ధనం పొందే అర్హత సంపాదించుకుని ఉంటావు. నువ్వు చేసిన దానాలని బట్టి లక్షాధికారి

అవ్వాలా? కోటీశ్వరుడు అవ్వాలా? అపర కోటీశ్వరుడు అవ్వాలా? అన్నది ఆటోమేటిక్ గా జరుగుతుంది. అప్పుడు నువ్వేమి కృషి చేయక్కర్లేదు. ఆటోమేటిక్ గా కోట్లు వచ్చేస్తాయి.

చూడండి ముఖేష్ అంబానీకి మనవడు పుట్టాడనుకోండి! పుట్టగానే వాడు అపర కోటీశ్వరుడు అయినట్టేగా? వాడు ఏమి కష్టపడ్డాడు? ఏమీ లేదు కానీ అర్హతను బట్టి ఆ కుటుంబంలో జన్మ తీసుకోగలిగాడు.

అలాగే మధ్యస్థ జన్మల్లో కూడా "కోరింది రాదు, కావలసిందే వస్తుంది" అంటారు. ఇది నా జీవితంలో కూడా జరిగింది. నేను ఏవేవో కోరుకునే వాడిని. కానీ నాకు కావాల్సింది అవి కాదు కదా? నాకు జ్ఞానం కావాలి. ఆ విషయం నాకు తెలీదు, కానీ నేను ధనం వెనకాల పడ్డాను.

అప్పుడు అన్నిట్లో దెబ్బలు తగిలాయి, అన్నిట్లోనూ నష్టమే! ఏది పట్టుకుంటే అది దెబ్బ కొట్టేది, నాకు ఏమి అర్థం కాలేదు. అలాంటి టైంలో పత్రి గారు పరిచయమయ్యారు. ఈ ధ్యానమార్గం, జ్ఞాన మార్గం తెలుసుకొన్నాను. దీనికి ఆకర్షితుడినై ఇందులోకి రావడం జరిగింది. అంటే నాకు కావాల్సింది జ్ఞానమే కాబట్టి ఆ పకృతి నన్ను ఇటువైపు నడిపించింది. నీ దారి అది కాదు నాయనా, నీ దారి ఇది అని చెప్పి ధ్యానం వైపు నడిపించింది. మీకు కూడా అలాగే జరుగుతుంది చూసుకోండి.

అలాగే చివరి జన్మల్లోకి వెళ్లేసరికి పత్రి గారిలాగా "ఏదైతే లోక కల్యాణానికి అవసరమో అవన్నీ నీకు సమకూర్చ బడతాయి" ఇప్పుడు పత్రి గారు ఈ స్థాయిలో ఉన్నారు మరి ఈ జ్ఞానం అందరికీ అందించాలి అంటే పెద్ద పెద్ద సెంటర్ లు కావాలి బెంగళూరు, కడ్తాల్, అలాగే పేరవరం, ప్రకృతి వ్యాలీ లాంటివన్నీ మెల్లిమెల్లిగా తయారవుతున్నాయి. ఆయనకి ఎప్పుడు ఏది అవసరమో! అవే సమకూర్చబడుతున్నాయి.

అందుచేత ఏ స్థాయిలోనూ కోరింది రాదు అని తెలుసుకోండి. అందుచేత ఎవడు గొప్పవాడు అంటే? కోరికలు లేనివాడే గొప్పవాడు. ఇదే శ్రీకృష్ణుల వారు చెప్పింది.

అందుచేత ఇలాంటి గుణాలు మనకి ఉన్నప్పుడు ఖచ్చితంగా జనాలోకం దాటి పైన ఉన్నటువంటి గొప్ప లోకాలకు అర్హత మనం సంపాదిస్తాం.

# సత్యలోకం చేరాలంటే?

ఎందుచేతనంటే ఇది చాలా ముఖ్యమే కాదు చాలా అవసరం కూడా. ఎందుకంటే! మీరు ఈ జనాలోకం పైన ఉన్న లోకాలు చేరుకోక పోతే, 100 కాదు 200, 300 జన్మలెత్తినా లాభం లేదు. ఎవ్వరైనా ఖచ్చితంగా ఆ లోకాలు చేరుకోవాల్సిందే.

ఈ విషయమే భగవద్గీతలో చెప్పడం జరిగింది.

**శ్లో॥ అబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తినో ర్జున ।**
**మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥ (భ.గీ.8-16)**

తా: ఓ అర్జునా! బ్రహ్మలోకాల్లాంటి లోకాలకు చేరుకున్నా మరల జన్మ తీసుకోవలసిందే! కానీ నేను వుండేటటువంటి లోకానికి (సత్యలోకానికి) చేరుకుంటే! మరల పునర్జన్మ ఉండదు.

అందుచేత జనాలోకం కింద ఉండటం కాదు, జనాలోకం దాటాలి. దాటినవాడు అక్కడనుంచి వాడంతట వాడే పైకి వెళ్ళిపోతాడు. జనాలోకం కింద ఉన్న వాళ్ళు చాలా కృషి చేయాలి. జనాలోకం దాటితే వాళ్లంతట వాళ్లే ఏది చెయ్యాలో అదే చేస్తారు. వారికి అది పెద్ద లెక్కేమీ కాదు. ఎందుచేతనంటే?

ఆత్మలమైన మనం ఈ స్థూల శరీరంతో భూలోకంలో ఉంటాం. రెండో శరీరం అయినటువంటి ప్రాణమయ శరీరంతో కూడా భూలోకంలోనే ఉంటాం. సూక్ష్మ శరీరంతో భూలోకం పైనున్నటువంటి భువర్లోకం కాని, సువర్లోకం కాని చేరుకోగలుగుతాం. ఆ లోకాలు భౌతిక శరీరంతో చేరలేము. అలాగే సూక్ష్మ శరీరం అంటే మనోమయ శరీరం రాలి పోతే కారణ శరీరంతో జనాలోకానికి వెళ్ళి, అక్కడ భవిష్యత్తు నిర్ణయించుకుని, అంటే ప్లాను చేసుకుని జన్మ తీసుకుంటాం.

తర్వాత ఉన్నటువంటి మహా కారణ శరీరం గొప్ప, గొప్ప సేవలు చేసే మహాత్ములు తీసుకుని, మహా కారణ లోకానికి చేరుకుంటారు.

అలాగే భూమిమీద తపస్సు చేసేవారు అంటే కోరికలు, సంకల్పాలు లేకుండా ధ్యానం చేసేవారు విశ్వ మయ శరీరంతో తపో లోకం చేరుకుంటారు.

అలాగే భూమిమీద సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకున్నవారు

నిర్వాణమయ శరీరంతో సత్యలోకం చేరుకుంటారు. అంతేకాని విశ్వమయ శరీరంతో సత్యలోకం చేరలేము, మహా కారణ శరీరంతో తపోలోకం చేరలేమని తెలుసుకోవాలి.

ఇంతకుముందు నిస్వార్థంగా గొప్ప, గొప్ప సేవలు చేస్తే అంటే గాంధీగారిలాగా, మదర్ థెరిస్సాలాగా నిస్వార్థంగా సేవలు చేస్తే మహా లోకానికి చేరుకుంటారు అని చెప్పుకున్నాం. కాని మహా కారణ లోకానికి చేరుకున్నా మళ్లా భూమి మీదకు రావల్సిందే! వచ్చి తీవ్రాతి తీవ్రమైన ధ్యాన సాధన చేసి, సమస్త జీవరాశి నేనే, అవి వేరు, నేను వేరు కాదు అనే స్థాయికి వచ్చినప్పుడు తపోలోకానికి చేరుకోగలుగుతారు.

అక్కడ నుంచి భూమి మీదకు వచ్చి ఆ ధ్యాన సాధన ఇంకా, ఇంకా తీవ్రతరం చేస్తే, సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటారు. సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటం అంటే గుర్తుపెట్టుకోండి, భూమిమీద నేను ఆత్మ అన్నట్టుగా జీవించగలగాలి, ఆత్మకు పూర్తి ప్రాముఖ్యం ఇవ్వగలగాలి. ఓ రమణ మహర్షి, ఓ వివేకానంద లాగ.

అలాంటి వారు అవసరాలకి పరిమితమై, ఎంత సేపు నేను ఆత్మ అన్నట్టుగా జీవిస్తారు. వాళ్లు చేసే పనులు, వాళ్ల మాటలు, వాళ్ల చేతలు, వాళ్ల కార్యక్రమాలు అన్ని ఆత్మకు సంబంధించినవే ఉంటాయి.

ఉదాహరణకు మీకు ఒక పెళ్లి వచ్చింది. అదే టైంలో భీమవరం మూడు రోజుల క్లాసు వచ్చింది. సహజంగా ఏం చేస్తారంటే మూడు రోజులు క్లాస్ ప్రతి నెల పెడుతున్నారు, ఈ పెళ్లేమో అస్తమానం రాదు కదా? అని మీరు పెళ్లికి వెళ్ళారనుకోండి! మీరు దేహానికి ప్రాముఖ్యం ఇచ్చినట్టు. ఒకవేళ మీరు మూడు రోజుల క్లాసుకు ప్రాముఖ్యం ఇస్తే మీరు ఆత్మకు ప్రాముఖ్యం ఇచ్చినట్టు.

అందుచేత ఆత్మ నేను అనే స్థితిలో ఉంటే! మీరు ఎంతసేపు ఆత్మకే ప్రాముఖ్యం ఇస్తారు; కాని దేహానికి ప్రాముఖ్యం ఇవ్వరు. మనం అందరికి చెప్తున్నాం, దేహానికి 50%, ఆత్మకు 50% ప్రాముఖ్యం ఇవ్వండని. అలా జీవిస్తూ మెల్లి, మెల్లిగా ఈ పర్సంటేజ్ పెంచుకోతవాలి. 60% ఆత్మకు,

40% దేహానికి పెరగాలి. అలా 70% ఆత్మ, 30% దేహం, ఇంకా కొన్ని సంవత్సరాలకు 80% : 20%, అలా 90% ఆత్మ : 10% దేహం అన్నట్టుగా మారిపోయి, చివరకు పూర్తిగా నేను ఆత్మ అన్నట్టుగా జీవించ గలగాలి. అలా మెల్లిగా నేను ఆత్మ అన్నది అనుభవంలోకి వస్తుంది.

అంతకుముందు ఆత్మ అన్నది అనుభవంలోకి రాలేదు. ఎంత సాధన చేసినా, తీవ్రాతి తీవ్ర సాధన చేసినా, మీరు ఎన్నో సిద్ధులు పొందినా, ఎన్నో రకాలైనటువంటి మహత్యాలు, శక్తులు వచ్చినా, అవి ప్రదర్శించ గలుగుతున్నా, మీకు సత్యం అనుభవంలోకి రానట్టే! మీరు సత్యలోకానికి చేరలేరు.

అలాంటి వాళ్ళు, ధ్యాన సాధన తీవ్రంగా కొనసాగిస్తుంటే, మెల్లిగా ఈ సత్యాన్ని అంటే, ఆత్మని అనుభవంలోకి తెచ్చుకుంటే సత్యలోకం చేరుకుంటారు.

మీరు అలా సాధన చేయగా, చేయగా మీకు ఏం తెలుస్తుందంటే? అసలు నేను ఎక్కడున్నాను? ఇప్పటిదాకా ఊరికే నేను, నేను అనుకుంటున్నాను కాని అసలు నేను అనుకోవటానికి నేనెక్కడున్నాను, ఉన్నదంతా పరమాత్మే! ఆ పరబ్రహ్మే! ఆ ఆత్మే! అదే నేను అన్నది తెలుస్తుంది. అంతేకాదు ఇంకొకటి లేదు అన్నది అనుభవంలోకి వస్తుంది. అందుచేత నేను ఆత్మ అన్నట్టుగానే జీవిస్తారు.

సహజంగా ఆ పూర్ణాత్మలో నుంచి వచ్చిన ఆత్మ, శరీరంలో ప్రవేశించగానే అసలు నేనుపోయి, కొత్త నేను వస్తుంది. అ కొత్త నేను ఈ ప్రపంచంలోనివన్నీ నావి, వీరంతా నావారు అన్నట్టుగా ప్రవర్తిస్తుంది. కానీ చనిపోయినపుడు నేను, నావి అనుకునేవి అన్ని వదిలేస్తున్నారు. మళ్లా కొత్త జన్మలో, కొత్త నేనుని తీసుకుంటున్నారు.

కాని ఈ సత్యం ఎప్పుడైతే అవగాహన చేసుకుంటారో! చివరకు అర్థమవుతుంది. అసలు ఇక్కడ ఏమీ లేవు, ఉన్నది ఒక్కటే! అదే ఆత్మ అదే బ్రహ్మం. మిగతావన్ని ఉన్నట్టుగా ఉంటాయి, కాని ఏవీ ఉండవు అని అర్థమవుతుంది. లేనివి ఉన్నాయి అనుకుంటే మన మూర్ఖత్వం, అజ్ఞానం. అటువంటి వాళ్లు క్రింది లోకాల్లోనే వుంటారు.

అందుచేత అటువంటి వాళ్ళు విచారణ చేస్తూ, చేస్తూ ఉంటే మెల్లి,

మెల్లిగా పత్రి గారు చెప్పినట్టు సాధన చేస్తూ ఉంటే! మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గిపోతుంది. అసలు మనసు ఉండబట్టే నేను, నేను అంటున్నాం. అందుచేత సాధన చెయ్యగా, చెయ్యగా ఆ నేను అనే బావం తగ్గిపోతుంది. అలా మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గిపోతూ చివరకు మనసు శూన్యం అవుతుంది.

అలా మనసు శూన్యం అయితే ఇంక నేను అన్నది ఎక్కడ ఉంటుంది? అప్పుడు అప్పటి దాకా ఉన్న నేను పోయి, అసలు నేను అనుభవంలోకి వస్తుంది. అంటే నేను మేను అన్నది పోతుంది. ఎప్పుడైతే మేను పోయిందో! ఉన్న నేనే అసలైన నేను అన్నది అనుభవంలోకి వస్తుంది.

అలా ఆ స్థితికి మనం చేరుకున్నప్పుడు మనం ఆ సత్యలోకం చేరుకుంటాం. పరమాత్మగా, విరాజిల్లుతాం, కో క్రియేటర్ అవుతాం.

అందుచేత ధ్యానసాధన ద్వారా అటువంటి స్థితికి చేరాలి. అంటే జనాలోకం దాటితే కాని ఈ స్థితులు రావు. మరి జనాలోకం దాటి వెళ్లాలనే కాంక్ష పెరగాలంటే? ముందు జనాలోకం దాటితే వచ్చే లాభాలు ఏమిటో తెలుసుకోవాలి. అప్పుడే ఎవరికైనా ఆసక్తి ఉంటుంది. అలాగే జనాలోకం దాటి ఆపైన ఉన్న మూడు ఊర్ధ్వ లోకాలు చేరుకోవాలంటే మనం ఎలాంటి అర్హతలు సంపాదించాలి అన్నది కుడా తెలుసు కోవాలి.

లాభాలు ఏమిటి అన్నది తెలుసుకుంటే పట్టుదలగా సాధించే ప్రయత్నం చేస్తాం, సాధిస్తాం. అలాగే అర్హత ఎలా వస్తుంది అన్నది కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది.

ఇప్పుడు మనం అదే తెలుసుకుంటున్నాం. శ్రీకృష్ణులవారు, పత్రీజీ చెప్పిన ఎన్నో విషయాలు కూడా మనం చెప్పుకున్నాం. వాటిని బాగా అధ్యయనం చేయండి. ఆ లక్షణాలు మీలో ఉన్నాయా లేవా చూసుకోండి. ఆ లక్షణాలు వస్తూ ఉంటే మీరు జనాలోకం దాటి పైలోకాలు చేరుకునే అర్హత సంపాదిస్తున్నట్టే లెక్క.

పత్రి గారు ఏమంటారంటే? “వీసమెత్తు దుఃఖం నీలో ఉన్నా నువ్వింకా అజ్ఞానంలో ఉన్నట్టే” అంటారు. అంటే కొద్దిపాటి బాధ కలిగినా, అంటే నా బతుకు ఇలా అయిపోయిందే, ఏందుకు నాకీ కష్టం వచ్చింది అని దుఃఖించకూడదు. అంటే కరోనా వచ్చింది, దుఃఖించకూడదు. కరోనా నన్ను

ఏం చేయగలదు? అని అనుకోగలగాలి.

మనం ఆత్మలం. ఆత్మని కరోనా ఏమన్నా చేయగలదా? ఏమీ చేయలేదు.

గీతలో చదువుకున్నాం కదా?

**శ్లో॥ నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥ (భ.గీ.2-23)**

తా:- ఆత్మను అగ్ని దహించ లేదు, శస్త్రం చేధించలేదు, నీరు తడప లేదు, వాయువు ఆర్పివేయును లేదు. అందుచేత ఆత్మ శాశ్వతం. మరి అలాంటి ఆత్మని ఎవడేం చేస్తాడు. కరోనా మటుకు ఏం చేస్తుంది?

గుర్తుపెట్టుకోండి నేను ఆత్మను, అందుచేత కరోనా నన్నేమి చేయలేదు, నాకేమీ ఇబ్బంది లేదు అన్నది జ్ఞానం ఉన్న వాడికి తెలుస్తుంది. అందుచేత ఈ అవగాహన ఉన్న వాడు, ఏది వచ్చినా కూడా దుఃఖించడు.

అందుచేత ఏ రోజు ఎవరు చనిపోతారో ఎవరికి తెలియదు. మరి కాసేపట్లో వెళ్ళిపోవచ్చు. అందుచేత ఈ లోపులో చేయవలసింది మనం చేస్తే శరీరం వదిలినా మనకి నష్టం ఉండదు. ఎందుచేతనంటే చనిపోతే మనకి లాభం కలిగేటప్పుడు చనిపోవటానికి ఎవరు భయపడతారు? చనిపోతే నష్టం అనుకునేవారే భయపడతారు.

చావుకు భయపడేవారిని చూస్తే, వారు ఆత్మకోసం, ఆత్మలాభం కోసం ఏమీ చేయలేరని తెలుసుకోవాలి. అంటే వారు ధ్యానం చేయరు, జ్ఞానవంతమైన పుస్తకాలు చదవరు, జ్ఞానుల సాంగత్యం చేయరు, ఆత్మ సేవలు చేయరు, కొద్దిపాటి ఆత్మజ్ఞానం కూడా సంపాదించరు. ఎంతసేపు డబ్బు, పదవులు, హోదా, పెరుప్రఖ్యాతులు లాంటి వాటిగురించే జీవితమంతా గడిపేస్తారు. ఆత్మగురించి ఏమీ చెయ్యరు, సంపాదించరు.

మరి అలాంటివారు చనిపోతే సంపాదించిన డబ్బంతా పోతుంది, పదవులు పోతాయి, హోదాపోతుంది అని భయపడతారు. అంతేకాదు వారికి భార్య, పిల్లల మీద ఎంతో మమకారం వుంటుంది. అందుచేత వాళ్లంతా దూరమై పోతారని భయపడతారు. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే? జ్ఞానం లేకపోవడంవల్లే!

కానీ ఆత్మజ్ఞానం సంపాదించుకుంటే! అంతా ఒకటే, అంతా నేనే అని తెలుసుకుంటారు. అటువంటి జ్ఞానం సంపాదించుకొని, చనిపోతే! ఇప్పుడు ఉన్న స్థితి కంటే ఉన్నతమైన స్థితి పొందుతామని, ఇంకా ఉన్నతమైన జన్మ పొందుతామని తెలుసుకుంటారు. అలాంటపుడు చావుకు భయపడేది ఏముంది? సంతోషంగా నిష్క్రమిస్తారు.

అందుచేత అర్థం చేసుకోండి! చావు అంటే? పాత వస్త్రాన్ని వదిలి కొత్త వస్త్రం ధరించటం లాంటిదే. అంటే ఆత్మ అయిన మనం పాత శరీరం వదిలి, కొత్త శరీరం ధరించడం అన్నమాట. భగవద్గీతలో కూడా ఈ విషయమే చెప్పబడింది.

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ॥ (భ. గీ. 2-22)**

తా:- చినిగిపోయిన పాత వస్త్రాలు వదిలేసి, కొత్త వస్త్రం ఎలా ధరిస్తామో! అలాగే ఆత్మ అయిన మనం ఉన్న శరీరాన్ని వదిలేసి కొత్త శరీరం ధరిస్తాము.

అశరీరంతో చేయవలసింది చేసేసావు. ఇంక దానితో చేయవలసిన పని ఏమీ లేదు. తర్వాత చేయవలసిన దానికి కొత్త శరీరం కావాలి. అందుచేత ఉన్న పాతశరీరం వదిలేస్తాం, కొత్త శరీరం తీసుకుంటాం. పత్రీజీ అదే తెలుసుకో మంటారు.

కానీ ఇక్కడ చేయవలసింది ఏమిటంటే? ఈ శరీరంతో మనం చేయవలసింది చేయాలి, సాధించవలసింది సాధించాలి, సంపాదించవలసిన జ్ఞానం సంపాదించాలి. దానికి విలువైన ధ్యానాన్ని ఎంత చేయగలమో అంతా చేయాలి. ఖాళీ దొరికితే పుస్తకాలు చదవాలి. ఇలాంటి క్లాసులు వింటూ వుండాలి. మనకిప్పుడు అదృష్టం కొద్దీ యూట్యూబ్ లో, మన పి.ఎం.సి. లో పత్రి గారివి ఎన్నో వస్తున్నాయి, అవన్నీ వింటూ ఉండాలి. అప్పుడు ఒక్కొక్క విషయం తెలుస్తుంది. అప్పుడు నీకు శోకం ఎక్కడ ఉంటుంది? దుఃఖం ఎక్కడ వుంటుంది?

రాముడికి దూరమైనా... సీతాదేవి శోకించలేదే. ధ్యానం చేసుకుంది, ధ్యానస్థితిలో ఉండిపోయింది. ఆవిడ మహాజ్ఞాని. అందుకే ఆవిడకు తెలుసు రాముడు వస్తాడు, రావణాసురుడిని సంహరిస్తాడని. రావణాసురుడే తెలివితక్కువ పనిచేసి తాను నాశనం అవడమే కాకుండా, తన జాతినే నాశనం చేసుకున్నాడు.

వశిష్ఠుల వారు ఏమని చెప్తారంటే! ఆత్మజ్ఞాని ధనాన్ని చూసి మురిసి పోడు, పదవులను చూసి మురిసిపోడు, గర్వం ఉండదు అని. అంతేకాదు వీటన్నిటిని చూసి పొంగిపోయే వాళ్ళని చూసి ఆత్మజ్ఞాని జాలి పడతాడని అంటారు.

కారణం అజ్ఞాని ఇవన్నీ పర్మనెంట్ అనుకుంటాడు. కాని ఎప్పుడో ఒకప్పుడు అవన్ని దూరం అయిపోయేవే అన్న విషయం వాడు తెలుసుకోడు. అందుచేత జ్ఞాని వాడి మీద జాలి పడతాడని వశిష్ఠులవారు చెప్పటం జరిగింది. సీతాదేవికూడా అందుకే రావణాసురిడి మీద జాలిపడింది .

మనమైనా అంతే. ఎవడైనా మన పట్ల అనుచితంగా ప్రవర్తించినా, విరుద్ధంగా ప్రవర్తించినా, మనల్ని ఏదైనా హింస పెట్టినా, నష్ట పెట్టినా, కష్టపెట్టినా జాలి పడాలి. కారణం వారికి ప్రకృతే శిక్ష వేస్తుంది కాబట్టి.

రమణ మహర్షి గారి జీవితంలో జరిగిన సంఘటన చెప్పుకుందాం. ఆయన ఆశ్రమానికి ఒకసారి ఎవడో దొంగ వచ్చాడట. వాడి ఉద్దేశం భక్తులంతా చాలా మంది వస్తున్నారు అందరూ వచ్చి ఏదో ఒకటి ఇస్తుంటారు అందుచేత ఆయన దగ్గర, చాలా ఉంటుంది అని ఆశ్రమంలో ప్రవేశించాడు.

అది రమణ మహర్షుల వారు చూశారు. చూసి వాడు లోపలికి వచ్చాక అన్నారంట ఒరేయ్ నాయనా, ఈ అర్ధరాత్రి ఏదో కన్నం వెయ్యటానికి వచ్చినట్టు ఉన్నావు. ఓ పని చెయ్యి నేను బయటకి వెళ్లి పోతాను, నీకు కావలసినవి మూటకట్టుకొని పట్టుకు వెళ్ళు అని అన్నారట. ఎందుచేతనంటే, నేనుంటే నువ్వు కొంచెం మొహమాటపడతావు, నేను లేకపోతే నువ్వు హాయిగా మూట కట్టుకొని వెళ్లి పోవచ్చు అని అన్నారట. అలా వాడిని లోపల వుంచి రమణ మహర్షులవారు బయటకు వెళ్లి పోతే, వాడు వచ్చి ఆయన కాళ్ళ మీద పడ్డాడట.

రమణులవారు సామాన్లు పోతున్నాయని ఏమీ అనుకోలేదు. కారణం ఆయన అలాంటి గొప్ప స్థాయికి ఎదిగాడాయన. మనం కూడా అలా ఎదగాలి.

నేను పత్రి గారిని అబ్జర్వ్ చేశాను. ఒకసారి ఆయన్ని ట్రైన్ ఎక్కించటానికి నేను స్టేషన్ కి వెళ్లాను. ఆయన కూర్చున్నారు, నేను నిల్చున్నాను. ఎవరైనా అడుక్కునే వాళ్ళని చూస్తే ఆయనేమి పెద్ద ఆసక్తి చూపించేవారు కాదు.

ఇంకా ఆయనేమి అన్నారంటే? వాడు గతంలో ఏదో చేశాడు, ఇప్పుడు

అనుభవిస్తున్నాడు అని అన్నారు. అంటే చేసింది అనుభవిస్తున్నాడు, అంటే అడుక్కుంటున్నాడు. అలాగే అంగవైకల్యం ఉన్నా, గుడ్డివాడైనా చేసింది అనుభవిస్తున్నాడనే అర్థం. అలాంటివాడి మీద జాలి పడేదేమిటి?

ఇక్కడ గుర్తు పెట్టుకోండి. ఒకడు గుడ్డివాడు అయ్యాడన్నా, అంగ వైకల్యంతో ఉన్నాడన్నా, ఇంకేదయినాసరే ఎంతో జాలి పడతాం. కాని ఆ పరిస్థితి వాడికి ఎందుకు వచ్చింది? అంటే ప్రకృతి నిర్ణయం ప్రకారమేగా? ప్రకృతి అంటే ఎవరు భగవంతుడేగా? సృష్టికర్తేగా? మరి ఆయన అంత దయాదాక్షిణ్యాలు లేనివాడా? ఈ విషయం ఒక్కసారి ఆలోచించండి?

ఆ సృష్టికర్త వాడికి అంత దారుణమైన శిక్ష ఎందుకు వేశాడు? ఆయన నిర్ణయం తప్పా? తప్పుడు నిర్ణయం ఆయన తీసుకుంటాడా? అంటే ఆయన ఎటువంటి పరిస్థితిలో తప్పుడు నిర్ణయాలు తీసుకోడు. ఆయన ఏది తీసుకున్నా కరెక్ట్. ఎందుకంటే వాడు అంతకు ముందు అజ్ఞానంతో చెయ్యకూడని పనులు చేశాడు. అంటే వాడి వల్ల ఎంతో మందికి నష్టం, బాధ కలిగింది.

వాడు ఆ జంతువులకి, ఆ ప్రాణులకి, ఆ సాటి వారికి ఎంతో హాని కలిగించాడు. మరి ఆపని ఎందుకు చేసాడు? అంటే వాటి బాధేమిటో వాడికి తెలియదు. అందుచేత అబాధ తెలుసుకోవడానికే! అనుభవంలోనికి రావడానికే ప్రకృతి వాడికి ఆ శిక్ష వేసింది. ఆ భాధ అనుభవంలోకి వస్తే మళ్లా ఆ పని చేయడు. రాకపోతే ఆ పని చేస్తూ ఉంటాడు, తప్పులు మానడు. కాని అనుభవిస్తే, ఆ పనులు మరల చేయకుండా గొప్పగా ఎదుగుతాడు.

అలా ఒక్కొక్క జన్మలో తాను చేసిన తప్పులు అనుభవం ద్వారా ఒక్కొక్కటి సరి చేసుకుంటాడు. అందుకే జన్మ దేనికి అంటే? కొన్ని అనుభవాలు పొందటానికి, తద్వారా పాఠాలు నేర్చుకోవటానికి, తద్వారా ఆత్మ ఉన్నతి పొందటానికి, తద్వారా ఆత్మ ఎదగటానికి అని తెలుసుకోవాలి.

ఆ రకంగా వాడు ఎప్పుడైతే కొన్ని తప్పులు మానేశాడో ఆత్మ కొంత ఎదిగినట్టే లెక్క. గుర్తుపెట్టుకోండి మీరు ఎన్ని తప్పులు మానేస్తే మీ ఆత్మ అంటే మీరు అంత ఎదిగినట్టు లెక్క. అందుచేత అటువంటి వాళ్ళని పత్రి గారు అంత పట్టించుకోరు.

అప్పుడు నాకు అర్థమైంది. మనం ఇటువంటి ఉపకారాలు చేయడం

వల్ల ప్రయోజనం లేదు అని తెలుసుకున్నాను. తరువాత పుణ్య కర్మలు కూడా అవసరంలేదని తెలుసుకున్నాను. చేయవలసింది ముక్తి కర్మలు, అంటే ఆత్మ కర్మలే అంటే ఆత్మ సేవలే మనం చేయాలి అన్నది అర్థమైంది.

శ్రీకృష్ణుల వారు కూడా

**శ్లో॥ యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ య స్స మే ప్రియః॥)(భ.గీ. 12-17)**

తా: ఎవడు సంతోషింపడో! ద్వేషింపడో! శోకమును పొందడో! ఎవడు శుభాశుభములను వదిలినవాడో! (మంచి-చెడు, పుణ్యము - పాపము ) అట్టి భక్తుడు నాకు ఇష్టుడు.

అందుకే పత్రీజీ పాపకర్మలేకాదు, పుణ్యకర్మలు కూడా వదలాలని చెప్పారు, ఆత్మకర్మలే చేయాలన్నారు.

ఆ రకంగా మనం ప్రవర్తించగలిగితేనే, మనం జనాలోకం దాటి, ఆపై లోకాలు ఆఖరికి సత్యలోకం పొందే అర్హత సంపాదించుకున్న వాళ్లమవుతాం.

అందుచేత ఒక్కొక్క విషయాన్ని ఆచరణలోకి తెచ్చుకోవాలి.

అందుచేత పత్రి గారిని అనుసరించి, దాన్ని ఆచరణలోకి తెచ్చుకుంటే ఖచ్చితంగా మనం సత్యలోకం పొందే అర్హత సంపాదిస్తాము.

# జనాలోకం దాటిన వారికి కోరుకున్న జన్మ వస్తుంది

కానీ పైలోకాల యొక్క గొప్పతనం తెలుసుకుంటే ఆ లోకాలకి వెళ్లడం కోసం ప్రయత్నం చేస్తారు. అందుచేత జనాలోకం పైన ఉన్నటువంటి మహాలోకం, తపోలోకం చేరుకుంటే వచ్చే లాభాలు తెలుసుకుందాం.

చూడండి మన పిల్లల్ని మంచి పాఠశాలలో వేస్తూ వుంటాం, ఇంకా వీలైతే కార్పొరేట్ స్కూల్స్ లో వేస్తాం. అంతేకాని మామూలు స్కూల్లో వేయడానికి ఇష్టపడం. దానికి కారణం మామూలు స్కూల్లో రిక్షావాళ్ల పిల్లలు, కూలి పనులు చేసుకునే వాళ్ళ పిల్లలు ఉంటారు. అటువంటి స్కూల్లో మనం వేశామనుకోండి ఏమవుతుంది? వాళ్ల సాంగత్యమే ఏర్పడుతుంది. ఎన్ని సంవత్సరాలు అక్కడ చదువుతాడో అన్ని సంవత్సరాలు వాళ్ళ తోటే స్నేహం చేస్తాడు.

కొన్నాళ్లకు వాళ్లలాగే వీడు తయారవుతాడు. కాని మంచి కాన్వెంట్లలో కాని, కార్పొరేట్ స్కూల్లో వేసినట్లయితే! సొసైటీలో ఉన్న హైలెవల్ అంటే కలెక్టర్ పిల్లలు, ఐపీఎస్, ఐఏఎస్ లాంటివారి పిల్లలు, మినిస్టర్ల పిల్లలు, డాక్టర్ల పిల్లలు, ఇంకా హై లెవెల్ లో ఉన్న వాళ్ల పిల్లలంతా వాటిలో చదువుతారు. అటువంటి స్కూల్లో వేసినట్లయితే వారందరి సాంగత్యం ఏర్పడుతుంది. వాళ్ళతో బాటు కొన్ని సంవత్సరాలు వీడు అక్కడ చదువుకున్నప్పుడు వాళ్ళందరూ ఫ్రెండ్స్ అవుతారు.

అప్పుడు వాళ్ళు మాట్లాడుకునే విధానం కూడా చాలా హైలెవల్ లోనే ఉంటుంది. వాళ్ల చదువు అయిపోయాక అమెరికా వెళ్లాలా, ఆస్ట్రేలియా వెళ్లాలా, బ్రిటన్ వెళ్లాలా లేకపోతే ఇక్కడే ఇంకా పెద్ద ఇన్స్టిట్యూషన్ లో జాయిన్ అవ్వాలా? అని చర్చించుకుంటారు. వాళ్ల స్నేహితుల తల్లిదండ్రుల ద్వారా ఇవన్నీ అవగాహనలోకి వస్తాయి. వాళ్ళు గొప్పవాళ్ళు కాబట్టి, ఆ విషయాలే చెప్తారు. అవే డిస్కస్ చేసుకుంటారు.

అంతే కాదు చదువు పూర్తి అయిన తర్వాత వారి ఫ్రెండ్షిప్ జీవితాంతం

మర్చిపోలేరు. చిన్నప్పటి స్నేహం అలాగే ఉంటుంది. అటువంటి వాళ్ళతో స్నేహం చేసి బయటికి వచ్చినప్పుడు, వాళ్లంతా అటువంటి చదువులు చదవడం వల్ల, అంతా హై లెవెల్ కి వెళ్లడం వల్ల, వారికి సొసైటీలో మంచి పొజిషన్ లు వస్తాయి. వాళ్ళతో పాటు వీళ్లు కూడా గొప్ప, గొప్ప వాళ్ళు అవుతారు. అటువంటి వాళ్ళందరి స్నేహం ఉండడం వల్ల, గొప్ప గొప్ప పొజిషన్ లో వుండడం వల్ల, వారికి ఏ పని అయినా అవలీలగా అవుతుంది. అందుకే అటువంటి స్కూల్స్ లో వేయడానికి ప్రతి ఒక్కళ్లు ప్రాముఖ్యం ఇస్తారు.

అదే సామాన్యమైన స్కూల్స్ లో జాయిన్ అయిన వాళ్ళు, అంటే రిక్షా వాళ్ళు, కూలీ వాళ్ళు, పని వాళ్ళ పిల్లలతో చదివితే ఏమౌతుంది? ఆ పిల్లల తల్లిదండ్రులు తాగేసి వస్తారు. రోజు దెబ్బలాడుకుంటూ వుంటారు, కొట్టుకుంటూ వుంటారు, తిట్టుకుంటూ వుంటారు. వాళ్లకింక అంతకన్న ఏమీ వుండదు, పిల్లలు అవే చూస్తూ ఉంటారు, అవే తెలుసుకుంటారు. వారు స్కూలుకి వచ్చాక చెప్పుకునే కబుర్లు ఇలాగే వుంటాయి. ఈ రోజు మా నాన్న తాగి వచ్చి మా అమ్మని తన్నాడు, లేకపోతే మా అమ్మ, మా నాన్న దెబ్బలు భరించలేక వదిలేసి వెళ్లిపోయింది, ఇలాగ వుంటాయి. వారికి ఈ విషయాలే తెలుస్తాయి, అంతకన్న ఇంకేం తెలియవు. వారు చివరికి అలాగే తయారైపోతారు. తండ్రి తాగితే వాడుకూడా తాగాలనుకుంటాడు . తండ్రి సిగరెట్ కాలుస్తుంటే తాను సిగరెట్ కాల్చాలనుకుంటాడు. వాడి తల్లితండ్రుల అలవాట్లే వాడు అలవాటు చేసుకుంటాడు.

అందుకే ఎవ్వరూ కూడ క్రిందిస్థాయి స్కూల్స్ లో వేయడానికి ఇష్టపడరు. మరి హై లెవెల్ స్కూల్స్ లో వేసినట్లైతే అన్ని రకాలుగాను వాడు భవిష్యత్ బాగుంటుంది కాబట్టి, ఎంత కష్టమైనా సరే, ఎంతకర్చు అయినాసరే వీలైనంత పెద్ద స్కూల్స్ లో వేయడానికే ప్రయత్నిస్తారు.

అలాగే మీరు జనాలోకం క్రింద లోకాలకు అంటే భువర్లోకం చేరుకున్నట్లైతే మీ కంటే ముందు వచ్చిన వాళ్లు వుంటారు. ఆ భువర్ లోకంలో నేరాలు చేసిన వాళ్లు, తప్పులు చేసిన వాళ్లు, పాపాలు చేసిన వాళ్లు, హింస

చేసిన వాళ్లు వుంటారు. వాళ్లతో సాంగత్యం ఏర్పడుతుంది. వాళ్లకు ఏం తెలుస్తుంది? వాళ్ళు ఏం చెప్తారు? నేను వాణ్ణి చంపి వచ్చాను, లేకపోతే ఆ మేకను తిన్నాను, కోడిని తిన్నాను, గొడవలు పడ్డాను, అంటూ చెప్పుకుంటారు. అంతకన్నా ఏమి తెలుస్తుంది వాళ్ళకి? తెలిస్తేగా వీడికి చెప్పడానికి, వీడికి తెలిస్తేగా వాడికి చెప్పడానికి.

కానీ ఎవరైతే జనాలోకం దాటి పై లోకాలకు అంటే మహలోకం చేరుకుంటారో! అక్కడ ఓ గాంధీ మహాత్ముడు, ఓ మదర్ థెరీసా లాంటి వాళ్ల యొక్క సాంగత్యం ఏర్పడుతుంది. చూడండి మీరు తాగుబోతుతో సాంగత్యం చేస్తే ఎలా ఉంటుంది? ఓ పేకాట ఆడేవాడి తోటి, ఓ ఖూనీకోరుతో సాంగత్యం చేస్తే ఎలావుంటుంది? లేక ఓ గాంధీ గారి లాంటి వాళ్ల తోటి సాంగత్యం చేస్తే ఎలావుంటుంది? అలాంటివారి మాటలు ఎంత ఆదర్శవంతమైన మాటలు వుంటాయి? ఎంత గొప్ప మాటలు వస్తాయి? అలాంటి వారి మాటలు, సందేశాలు ఇప్పటికి వింటున్నాం కదా? మరి అలాంటి వాళ్ళతో జరిగే సాంగత్యం ఎలా వుంటుందో ఒకసారి ఊహించుకోండి.

అలాగే తపోలోకానికి చేరుకుంటే అంతా తపోధనులు అంటే తపస్సు చేసిన వారు అంటే తీవ్రధ్యాన సాధన చేసినవారు ఉంటారు. అంటే ఋషులు, మహర్షులు, తీవ్రసాధకులు ఉంటారు. వాళ్లంతా తపస్సు చేసి ఎంతో జ్ఞానం సంపాదించు కున్నవారు. అటువంటి వాళ్ళతో సాంగత్యం జ్ఞానపరంగా వుంటుంది కానీ ఇంకొకరకంగా వుండదు.

అక్కడ తెలుసుకుంటాడు. కొంచెం కష్టపడితే జీవిత లక్ష్యమైన సత్యలోకం చేరుకోవచ్చు. ఇంకా ఎన్నో గొప్ప పనులు చేయవచ్చు అని తెలుస్తుంది. ఆత్మజ్ఞానం ఇంకా పెంచుకోవాలనిపిస్తుంది. సాధనలో ఎన్నో మెళకువలు తెలుస్తాయి. తీవ్ర సాధనలో తాను పొందిన అతీంద్రియ శక్తులు ఎలా ఉప యోగించుకోవాలో తెలుస్తుంది.

అందుచేత ఎప్పుడైతే అలాంటివారితో సాంగత్యం వుంటుందో! వీరికి ఆత్మజ్ఞాన అవగాహన ఇంకాపెరుగుతుంది. వారి లక్ష్యం స్పష్టంగా

అర్థమవుతుంది. వారు మరలా జన్మ తీసుకున్నప్పుడు అవన్నీ ఆత్మనుంచి అందుతూ వుంటాయి. ఎప్పుడైతే అలా అనిపిస్తూ ఉంటుందో! ఆ సాధనలు ఆపనులే చేస్తారు.

చూడండి మీరు భీమవరంలో ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరానికి వచ్చారంటే? మీ అంతరంనుంచి వచ్చిన ప్రోద్బలమే కదా? లేకపోతే ఎందుకు వస్తారు? అలాంటి వారు ఆత్మజ్ఞానానికి, జ్ఞానానికి సంభందించిన పనులే ఎక్కువ చేస్తారు. వారి లక్ష్యం అంటే సత్యలోకం చేరేప్రయత్నం తీవ్రంగా చేస్తారు. అందుచేత జనాలోకం దాటి ఉన్న లోకాలు పొందగలిగితే చాలా చాలా అదృష్టవంతులనే చెప్పుకోవచ్చు. ఎవరైనా సరే ఆ లోకాలు పొందే కృషి చేయాలి.

అంతేకాదు జనాలోకం క్రిందవున్న లోకాలలో వున్నవాళ్ళు మరల జన్మ తీసుకునేటపుడు, వారు ఎంచుకున్న కర్మల్ని బట్టే వారికి జన్మ ఇవ్వబడుతుంది, అంతే కాని కోరుకున్న జన్మ రాదు. ఎక్కువ పాపాలు చేస్తే, అందులోనుంచే కోరుకోవాలి. కారణం ఆరకమైన అనుభవాలు పొందాలి కాబట్టి. అంతేకాని నాకు భోగవంతమైన జన్మ కావాలి అంటే ఎలా వస్తుంది? రాదుకదా?

కాని జనాలోకం పై లోకాలు చేరుకున్న యోగులు తీసుకునే జన్మ వాళ్ల ఛాయిస్ ను బట్టి వుంటుంది. వారు తపస్సు చేయడం వల్ల, కర్మలన్నీ రహితం చేసుకుంటారు. అందుచేత వీళ్ళకి కోరుకున్న జన్మ లభిస్తుంది. వారు తాను ఇంకా ఎటువంటి అనుభవాలు పొందాలి? ఇంకా నేనేం సాధించాలి అన్నవి చూసుకుని, అలాంటి కుటుంబాన్ని ఎంచుకుంటారు అలాంటి జన్మనే తీసుకుంటారు.

ఈ విషయం భగవద్గీతలోనే చెప్పబడింది. శ్రీ కృష్ణుల వారు ఏమన్నారంటే ధ్యానం చేసే యోగి మరణిస్తే ఏమవుతుందో చెప్పడం జరిగింది.

**శ్లో॥ ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శ్వాతీ స్సమాః।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽ భిజాయతే ॥ (భ.గీ. 6-41)**

తా:- అలాంటి యోగభ్రష్టుడు అంటే యోగసాధన పూర్తికాకుండా మధ్యలో శరీరం వదిలినవాడు మరణానంతరం పుణ్యాత్ములలో కొన్ని పొంది అక్కడ

అనేక సంవత్సరాలు గడిపి తరువాత పరిశుద్ధులైన శ్రీమంతుల గృహమందు పుట్టుచున్నాడు.

**శ్లో॥ అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥ (భ.గీ.6-42)**

తా:- జ్ఞానవంతులు, యోగులు అగు వారి వంశములో జన్మిస్తాడు. ఇలాంటి జన్మ లభించడం అత్యంత దుర్లభము అని శ్రీకృష్ణుల వారు చెప్పడం జరిగింది.

అసలు ఎందుకు ఇవన్నీ తెలుసుకోవాలి? అంటే తెలుసుకునే కొద్దీ వారిలో పట్టుదల పెరుగుతుంది, ఇంకా ఎక్కువ కృషి చేస్తారు.

అందుకే పత్రీజీ “మరణించకముందే మరణించాలని” అన్నారు. అంటే మరణించిన తరువాత జరిగేదాని గురించి తెలుసుకోవాలన్నారు. అప్పుడే ఎవరికైనా జీవించి ఉండగా ఏమి చెయ్యాలో తెలుస్తుంది. మరణించిన తరువాత జరిగే విషయాలు ఎంతోమంది అతీంద్రియ శక్తులు సంపాదించుకున్న యోగులు, యోగీశ్వరులు చెప్పడం జరిగింది.

అందుచేత ఇవన్నీ తెలుసుకుంటే? తీవ్రాతి తీవ్ర ధ్యానసాధన చేసి ఊర్ధ్వలోక అర్హత సంపాదిస్తారు. లేనివాళ్ళు ఇంకా ఎక్కువ జన్మలు తీసుకోవలసి వస్తుంది.

అందుచేత ఎవ్వరైనా సరే జనాలోకంతో ఆగిపోవడం కాదు, జనాలోకం దాటే ప్రయత్నం చేయాలి. దానికి సాత్వికగుణంలో ఆగిపోవడం కాదు, సాత్వికగుణం దాటి పరిసాత్వికం, మహా పరిసాత్వికం స్థాయికి చేరుకోవాలి. ఇది అంత తేలికకాదు.

ఒక ముమ్మిడివరం బాలయోగిలా, రమణ మహర్షిలా, వివేకానందలా, వీరబ్రహ్మేంద్రస్వామిలా తీవ్రాతి, తీవ్ర సాధన చేయాలి. ఆహార నియమాలు పాటించాలి. జ్ఞానం సంపాదించుకోవాలి. అప్పుడు ఎవరికైనా సాధ్యం అవుతుంది.

# మరణానంతరం గురించి తెలుసుకుంటే కలిగే లాభాలు

అలాగే పరమయోగి కబీర్ ఏమన్నారంటే? **"ఏ చావుకు ప్రపంచం భయపడుతూ ఉంటుదో! దాన్ని పొందడం లోనే నాకు ఆనందం ఉంది'**అన్నారు.

అలాగే గురునానక్ ఏమన్నారంటే?

**"జీవన్మరణం ప్రాప్తించే యోగం కోసమే మనమంతా పాటుపడాలి"** అని చెప్పారు.

బైబిల్ లో ఉన్నటువంటి సెయింట్ పాల్ సువార్తలలో ఏం చెప్పబడింది అంటే? **"నేను నిత్యము మరణిస్తూనే ఉంటాను".**

మహమ్మదీయ మహాత్ముడు ఏమన్నారంటే? **"మరణానికి ముందే మరణించడం నేర్చుకో"** అని అన్నారు.

దాదు మహాత్ముడు ఏమన్నాడంటే?

**"ప్రాణం ఉన్న శవంలా జీవించడం నేర్చుకో! అప్పుడే నీకు ప్రభు దర్శనం అవుతుంది"** అన్నారు.

అంతేకాదు **"మరణానికి ముందే మరణించడం నేర్చుకో! అందరి లాగా మరణిస్తే ప్రయోజనం లేదు"** అన్నారు.

ఆయన **"అందరిలా మరణించడం కాదు, మరణానికి ముందే మరణించడం నేర్చుకుని, మరణించు"** అని చెప్పారు.

పై మహానుభావులంతా చెప్పింది అర్థం కావాలంటే మరణించిన తరువాత ఏమి జరుగుతుందో తెలుసుకోవాలి.

ఎందుచేతనంటే? మరణించిన తరువాత జరిగే దాని గురించి తెలుసుకోగలిగితే ఎన్నో లాభాలు పొందవచ్చు. ముఖ్యంగా బ్రతికి ఉన్నప్పుడు కొన్ని భయాలుపోతాయి, అంతేకాదు చేయకూడని పనులు చేయరు, ఆత్మకు లాభం కలిగించే పనులకు ప్రాముఖ్యం ఇస్తారు, ముఖ్యంగా పొందవలసిన జ్ఞానం సంపాదించుకుంటారు.

ముఖ్యంగా చావుకు భయపడరు. అంతేకాదు నేను దేహం కాదు, నేను ఆత్మ అన్న అవగాహన కలుగుతుంది. ఈ విషయం బ్రతికున్నప్పుడు

తెలియదు. ఎంత చెప్పినా అర్థం కాదు, కాని చనిపోయినప్పుడు బాగా అర్థమవుతుంది.

ఎందుచేతనంటే? భౌతిక శరీరం మంచం మీద ఉంటుంది, ఆ శరీరంలో నుంచి వచ్చినటుంటి ఆత్మ గాలిలో తేలుతూ పైన వుంటుంది. అలా పైనుంచి క్రిందకు చూస్తుంది. అలా క్రిందకు చూసినప్పుడు, వాడి శరీరమే క్రింద ఉంటుంది. అప్పుడు వాడికి చాలా ఆశ్చర్యం వేస్తుంది! ఏంటిది? నేను ఇక్కడా ఉన్నాను, అక్కడా ఉన్నాను? మరి అదెవరు? అనేటటువంటి సందేహం వస్తుంది.

ముందు గందరగోళపడతాడు. తర్వాత అర్థమవుతుంది. గాలిలో వున్నదే నేను, కాని క్రింద ఉన్న దేహం నేను కాదు అనిమొట్టమొదటిసారిగా తెలుసుకుంటాడు. అరె! ఇంతకాలం ఆ దేహమే నేను అనుకున్నాను, కాని ఆ దేహం నేను కాదు అన్న మాట అని స్పష్టంగా, అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. అలా ఎవరికైనా చనిపోయాక నేను దేహం కాదు అన్నది స్పష్టంగా తెలుస్తుంది.

అంతేకాదు వాడు అటు, ఇటు తిరుగుతాడు. అలా భార్య దగ్గరికి వెళ్తాడు, బంధువుల దగ్గరికి వెళ్తాడు, వాళ్లతో కూడా చెప్తాడు. ఎందుకు ఏడుస్తారు? ఏడవకండి నేను ఇక్కడే వున్నాను అంటాడు. వాడు ఎంత చెప్పినా, వాళ్ళు వినపించుకోరు. వీడు తల బాదుకుంటాడు, నా మాట వినిపించుకోండి, నేను చావలేదు, నేను ఉన్నాను అని చెప్తూంటాడు. అయినా వీడిని వాళ్ళు పట్టించుకోరు. కారణం వాళ్ళకి వీడు కనిపించడు, వాడి మాటలు వీళ్ళకి వినిపించవు. అందుచేత చనిపోయాడు అని అనుకుంటారు, ఏడుస్తారు.

కానీ తాను వున్నాడు అంటే తాను చావలేదు. అంటే తనకు చావు లేదన్న విషయం అప్పుడు తెలుస్తుంది.

అలా మరణించక ముందే మరణించిన తరువాత జరిగే విషయం ఎవరైతే అవగాహన చేసుకుంటారో! వారికి జీవించి వున్నప్పుడే, ఈ దేహం నేను కాదు, నాకు చావు లేదు అన్నది తెలుస్తుంది. ఎందుచేతనంటే? చనిపోయేది దేహమే కానీ తాను కాదు అన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

అందుచేత ఎవరైతే మరణించిన తరువాత జరిగే దాని గురించి తెలుసు కోగలిగితే! ముఖ్యంగా తనకు చావు లేదు అన్న సంగతి తెలుస్తుంది. అందుచేత ఏ కరోనా లాంటి రోగాలు గానీ, ఎవడు కానీ నన్ను ఏమీ చేయలేడు అన్నది స్పష్టంగా వాడికి అర్థమవుతుంది.

లోకంలో చాలా మందికి అన్నిటికి భయం, ఈ భయం పోవాలి అంటే ఖచ్చితంగా “మరణించక ముందే మరణించాలి”. అంతేకాదు ఇంకా కొన్ని లాభాలు వున్నాయి. వారు చేసే పనులు చాలా మారిపోతాయి. ఎందుచేతనంటే? ఇప్పటి దాకా వారు చేసే పనులన్నీ నేను దేహం అనే భావంతో చేసారు. కానీ నేను దేహం కాదు, ఆత్మను అను తెలుసుకున్నప్పుడు దేహానికి ప్రాముఖ్యం తగ్గిస్తారు, ఆత్మకు ప్రాముఖ్యం పెంచుతారు. దేహ సంబంధమైన పనులు తగ్గిస్తారు, ఆత్మసంబంధమైన పనులు చేస్తారు. అంతేకాదు దేహ సంబంధమైన సేవలు మానేస్తారు, ఆత్మ సంబంధమైన సేవలు చేస్తారు. ఇలా వారు చేసే పనులు చాలా మారిపోతాయి.

చనిపోకముందు నువ్వు దేహం కాదు ఆత్మ అని ఎంత చెప్పినా అర్థం కాదు. కానీ చనిపోయిన తరువాతే బాగా అర్థమవుతుంది.

అంతేకాదు వారి బాధ్యతలు కూడా మారిపోతాయి. చూడండి ఎవరితోనైనా ధ్యానం చెయ్యి. ఈ పుస్తకాలు చదువు అని చెబితే నాకెక్కడ ఖాళీ! నాకు ఎన్నో భాధ్యతలు ఉన్నాయి అంటారు.

అదే మగవారైతే ? నాకు ఎన్ని భాధ్యతలు, నేను సంపాదించాలి, నా కుటుంబాన్ని పోషించాలి అంటారు. నాకు ఎక్కడ ఖాళీ? పొద్దుననగా వెళ్ళాలి. రాత్రి ఎప్పుడో రావాలి. ఇవన్నీ ఎప్పుడు చెయ్యను? అంటారు.

ఆడవారైతే నేను సంసారం చూసుకోవాలి, ఇంటి పనులు చూసుకోవాలి, పిల్లల్ని చూసుకోవాలి, ఇవన్నీ నా బాధ్యత కాదా? అసలు నాకు ఖాళీ ఎక్కడమ్మా? అంటారు.

అలా అంతా అవే బాధ్యతలు అనుకుంటూ, వాటి మీదే దృష్టి పెడుతూ, అవే చేస్తూ వుంటారు. కానీ అవన్నీ నేను దేహం అనే భావంలో వున్నప్పుడు, కానీ నేను దేహం కాదు ఆత్మ అని అవగాహనలోకి వచ్చినప్పుడు బాధ్యతలన్నీ

మారిపోతాయి. తన అంటే ఆత్మ బాధ్యత ఏమిటంటే? ఆత్మకు లాభించేది, ఆత్మకు కావలసింది చేయడమే తన బాధ్యత, అంటే ఆత్మజ్ఞానం సంపాదించుకోవడమే తన బాధ్యత అని అర్థమవుతుంది. అందుచేత ఆత్మ సంబంధమైన సాధన అంటే ధ్యానం చేస్తారు, పత్రి గారి పుస్తకాలు, జ్ఞాన వంతమైన పుస్తకాలు చదువుతారు, ఆత్మజ్ఞాన సందేశాలు వింటారు.

ఇవన్నీ దేనికి అంటే? తాను ఆత్మ కాబట్టి, తనకు జ్ఞానం కావాలి కాబట్టి, ఆ జ్ఞానమే తన కూడా వచ్చేది కాబట్టి, తనకు లాభిస్తుంది కాబట్టి. అంతకు ముందు డబ్బు సంపాదించడం పురుషుడి బాధ్యత. సంసారం చూసుకోవడం స్త్రీ బాధ్యత. కానీ తాను ఆత్మ అని అర్థం చేసుకున్న తర్వాత జ్ఞానం సంపాదించుకోవడమే తన భాధ్యత అని అర్థమవుతుంది. అందుచేత భాధ్యతలు మారిపోతాయి అని చెప్పుకున్నాం.

అలాగే ప్రాముఖ్యతలు కూడా మారిపోతాయి. ఇది వరకు దేహ సంబంధమైన వాటికి ప్రాముఖ్యం ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు ఆత్మ సంబంధమైన వాటికే ప్రాముఖ్యం ఇస్తారు. నా విషయం తీసుకుంటే ఇదివరకు పెళ్లిళ్ళకు కంపల్సరీగా వెళ్ళేవాడిని. కానీ ఇప్పుడు పెళ్ళిళ్ళకు వెళ్ళడం మానేసాను. అలాగే చిన్న, చిన్న ఫంక్షన్స్ అంటే పుట్టిన రోజు ఫంక్షన్స్, పెద్ద మనిషి అవడం, లేకపోతే ఇంకా రకరకాలైనటువంటి ఫంక్షన్స్‌కి వెళ్ళేవాడిని, కానీ ఇప్పుడు అన్నీ వదిలేశాను. కారణం టైమ్ వేస్ట్ అనే. దాని బదులు ఎక్కడికైనా వెళ్ళి జ్ఞానం గురించి క్లాస్ చెప్పుకుంటే? మన జ్ఞానం పెరుగుతుంది కదా? ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుతుంటే మన జ్ఞానం పెరుగుతుంది కదా? అక్కర్లేని దానికి వెళ్లి నాలుగైదు గంటలు వేస్ట్ చేసుకునే బదులు ఇంట్లో కూర్చుని రెండు గంటలు ధ్యానం చేసుకోవచ్చు కదా? అని వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నాను.

అందుచేత నేను ఆత్మ అని అవగాహన ఉన్న వాడు దేహ సంబంధమైన కార్యక్రమాలకు ప్రాముఖ్యం ఇవ్వరు, ఆత్మ సంబంధమైన వాటికే ప్రాముఖ్యం ఇస్తారు. అంటే మూడు రోజుల ధ్యాన కార్యక్రమాలు లాంటివి ఏమన్నా జరిగినపుడు పెళ్ళిళ్ళు వున్నా వాటిని పక్కన పెట్టి, భీమవరం మూడు రోజుల క్లాస్‌కి ఖచ్చితంగా వెళతారు.

ఎందుచేతనంటే? భీమవరం వస్తే ఆత్మకు ప్రాముఖ్యం ఇచ్చినట్లు అవుతుంది. మిగతా కార్యక్రమాలకు వెళ్తే దేహానికి ప్రాముఖ్యం ఇచ్చినట్లు. మరణానికి ముందు మరణించిన వాళ్ళకు అలా చేసే సేవలు ఎన్నో మారిపోతాయి. అందుచేత దేహానికి లాభం కలిగించే సేవలకు ప్రాముఖ్యం ఇవ్వరు, ఆత్మకు లాభం కలిగించే సేవలకే ప్రాముఖ్యం ఇస్తారు.

అలాగే సమయం, ధనం, వాక్కు అన్నీ ఆత్మకే ప్రాముఖ్యమిచ్చి చేస్తారు. అందుకే మరణించిన తర్వాత ఏం జరుగుతుందో మరణించకముందే అవగాహన చేసుకోవాలి అని పెద్దలు చెబుతారు.

నా లైఫ్‌లో కూడా ఇదే జరిగిందది. నేను దేహం కాదు, ఆత్మ అని తెలుసుకున్నాక పత్రి గారు పరిచయం కాక ముందు నేను చేసే రైస్ మిల్లు వ్యాపారం ఆపేసాను. అలాగే ఉచిత హోమియోపతి హాస్పటల్ కూడా క్లోజ్ చేసాను. అలాగే మా మేడం రోజూ 200, 300 మంది ఆడవారికి ట్రైనింగ్ సెంటర్ పెట్టి ఎన్నో రకాల విద్యలు ఉచితంగా నేర్పించి, వారి కాళ్ళ మీద వారు నిలబడేటట్లు చేసేది. ఇద్దరు, ముగ్గురు టీచర్లను పెట్టుకుని జీతాలు తానే ఇస్తూ ఫ్రీగా అన్నీ నేర్పేది. కానీ ఇప్పుడు అవన్నీ ఆపేసింది. కారణం అవన్నీ దేహ సంబంధమైన సేవలు కాబట్టి, దేహానికి లాభం కలిగిస్తాయి కాబట్టి.

ఇప్పుడు ఆమె ఆత్మ సేవలకు ప్రాముఖ్యం ఇస్తుంది. అంటే ఆత్మ సంబంధమైన ధ్యానం క్లాసులకు వెళుతుంది, అన్ని చోట్ల క్లాసులు చెప్తుంది. ఇది వరకు ఏవేవో పుస్తకాలు చదివేది, ఇప్పుడు ఆధ్యాత్మిక పుస్తకాలు మాత్రమే చదువుతుంది. ఇది వరకు ఏవేవో ఉపన్యాసాలు వినేది, ఇప్పుడు పత్రి గారి జ్ఞాన సంబంధమైన సందేశాలు వింటుంది. అలా ఆవిడ పనులు, ప్రాముఖ్యతలు పూర్తిగా మారిపోయాయి.

అలాగే నేను ఆత్మ అన్న అవగాహన మీకుంటే! ఖచ్చితంగా మీ ప్రాముఖ్యతలు కూడా మారిపోతాయి. మీ ప్రాముఖ్యతలు మారలేదు అంటే మీరు ఇంకా ఈ దేహం నేను అని భావిస్తూనే వున్నట్టు లెఖ్ఖ. ఇప్పుడు మన సొసైటీలో కూడా ఎంతో మంది దేహం కోసం పాటుపడే వాళ్లే వున్నారు.

ధ్యానం చేసే వారిలో ఎక్కువ మంది రోగాలు తగ్గించుకుంటే చాలు అనుకుంటారు.

కానీ ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చినవారు, నేను ఆత్మ అన్న అవగాహనలో వుంటారు, అన్నీ తెలుసుకుంటారు. అందుచేత వారి ఆలోచనా విధానం కూడా మారిపోతుంది. అంతకు ముందు ఆలోచించే ఆలోచనలు ఒక రకంగా ఉంటాయి, ఇప్పుడు ఆలోచించే ఆలోచనలు ఇంకొక రకంగా వుంటాయి. గమనిస్తే పూర్తి భిన్నంగా వుంటాయి.

అంతేకాదు "మరణించకముందే మరణించిన వారు" దేహ సంబంధమైన చుట్టాలు, బంధువుల గురించి కాకుండా ఆత్మ బంధువులతో సాంగత్యం చేయడానికి ప్రాముఖ్యం ఇస్తారు. అలాగే జ్ఞానం ఎలా పెంచుకోవాలి? అసలు నా పనులు ఏమిటి? నేనేం చేయాలి? అంటూ ఆలోచిస్తారు. అలా దేహ సంబంధమైన వాటికి ప్రాముఖ్యం తగ్గిస్తారు. ఆత్మ సంబంధమైన వాటికి ప్రాముఖ్యం పెంచుతారు.

అంతేకాదు మరణించిన తరువాత జరిగేది ఏమిటో తెలుసుకోగలిగితే, చేయకూడనివి ఏమిటో తెలుస్తాయి, చేయవలసినవి కూడా తెలుస్తాయి. నేను కూడా పత్రి గారి ద్వారా ఎన్నో తెలుసుకున్నాను. అంతకు ముందు దేహ సంబంధమైన పనులన్నీ చేసేవాడిని, కానీ ఇప్పుడు ఆత్మ సంబంధమైన పనులే చేస్తున్నాను.

అలాగే ఇంకా ఎన్నో తెలుసుకుంటారు. ఏ ప్రాణిని కానీ, ఎవరిని కానీ హింసించ కూడదని తెలుసుకుంటారు. దేహం నేను అని అనుకున్నప్పుడు అంతా వేరు, వేరు అనుకుంటారు. ఆ కోళ్ళు వేరు, మేకలు వేరు అనేటటువంటి భావం వుంటుంది. అందుచేత వాటిని తింటూ, చేయకూడని పాపాలు చేస్తారు. కానీ నేను ఆత్మని తెలుసుకున్నప్పుడు ఆ జంతువులు కూడా ఆత్మలే అనే అవగాహనకు వస్తుంది. అందుచేత వాటి జోలికి వెళ్ళరు, వాటిని చంపరు, మాంసం తినరు. అలాగే వెల్లుల్లి వాడకూడదని తెలుస్తుంది, మాంసాహారం వండే ఫంక్షన్స్‌కి వెళ్ళకూడదని, వ్యర్థమైన మాటలు మాట్లాడకూడదని, ఇతరుల వ్యవహారాలలో తల దూర్చకూడదని, వీలైనంత మౌనం పాటించాలని

తెలుసుకుంటారు. అలా వారికి మొత్తం జీవితమే మారిపోతుంది.

కానీ దేహం నేను అనుకున్నప్పుడు ఈ తప్పులు, పాపాలు ఎన్నో చేస్తారు, ఇతరులను దూషించడం, విమర్శించడం, నిందించడం, అవమానించడం, అసూయ పడటం లాంటివి ఎన్నో చేస్తారు.

కానీ నేను ఆత్మ అన్నది తెలుసుకున్నాక అంతా నేనే, నేనే అంతా అని తెలుసుకున్నాక ఇంక ఎవరిని నిందిస్తారు? ఎవరిని అవమానిస్తారు? ఎవరిని కించపరుస్తారు? ఎవరిని మోసం చేస్తారు? ఎవరిని హింసిస్తారు? అంతా నువ్వేగా... ఏమీ చెయ్యరు. పూర్తిగా మారిపోతారు. అందుచేత చేయవలసినవి చేయడం వల్ల అంతా మంచే జరుగుతుంది, ఏ నష్టమూ జరగదు. భవిష్యత్తు పూర్తిగా మారిపోతుంది.

ప్రస్తుతం మీరు ఎలా ఉన్నా... భవిష్యత్తు మాత్రం చాలా అనుకూలంగా రూపు దిద్దుకుంటుంది. ఆ టైమ్ వచ్చే సరికి మీలో తెలియని మార్పులు మీకే విచిత్రంగా కనిపిస్తాయి. ఏమిటి నా జీవితం ఇంతలా మారిపోయింది అని అనుకుంటారు.

అంతేకాదు **"మరణించక ముందే మరణించాలి"** అన్నది అర్థం చేసుకుంటే ఇంకొక లాభం ఏమిటంటే? కొన్ని వందలే కాదు వేల సంవత్సరాల సమయం కూడా మనకి వృధా కాకుండా వుంటుంది. అంటే జన్మలు తగ్గిపోతాయి. ఎందుచేతనంటే? చూడండి నేను దేహం అన్న భావంతో ఆ జన్మ, జన్మంతా దేహమన్నట్టుగా జీవిస్తారు. ఆత్మ కోసం, ఆత్మ లాభం కోసం కొద్దిగా కూడా ఏమీ చేయరు. ఆత్మను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. అలా ఆత్మను పట్టించుకోకుండా, నిర్లక్ష్యం చేసిన వారిని "ఆత్మ హంతకులు" అంటారు.

చూడండి సహజంగా తనకు తాను శరీరాన్ని విచ్ఛిత్తి చేసుకుంటే? "ఆత్మహత్య" అంటారు. అగ్నిలో దూకడం, ఏ రైలు కిందో పడటం, ఉరి వేసుకోవడం లాంటివి.

కానీ శరీరాన్ని ఇతరులు విచ్ఛిత్తి చేస్తే "హత్య" అంటారు.

కానీ జీవితమంతా జీవించినా అసలు ఆత్మను పట్టించుకోకపోతే "ఆత్మ హంతకుడు" కింద లెక్కిస్తారు.

అసలు ఆత్మ అయిన తాను భూమి మీదకు దేనికి వచ్చాడు? వాడు చేయవలసింది ఏమిటి? అంటే ఆత్మ అయిన తాను ఆత్మలాభం కోసం వచ్చాడు, ఆత్మకు లాభం కలిగించే పనులు చేయడానికి వచ్చాడు. కానీ జన్మ అంతా ఆత్మ కోసం ఏమీ చేయలేదు. ఆత్మకు ఏమీ లాభం కలిగించలేదు, అంతా దేహానికే చేసాడు. అటువంటి వాళ్లనే ఆత్మ హంతకులు అంటారు.

మరి ఆ జన్మంతా వేస్టే కదా? అలా ఎన్ని జన్మలు జీవిస్తే ఆ జన్మలన్నీ వృధాయే కదా? ఇక్కడ ఇంకొకటి కూడా గుర్తు పెట్టుకోవాలి.. ఏదో జన్మ ఇలా అయిపోగానే మరలా అలా జన్మ వచ్చేస్తుందని కొంతమంది అనుకుంటారు. కానీ మరలా జన్మ రావాలంటే? కొన్నివేల సంవత్సరాలు పట్టవచ్చు, ఇంకా ఎక్కువ పట్టచ్చు. సహజంగా తక్కువ సమయంలో ఒక జన్మ నుంచి ఇంకొక జన్మ అన్నది చాలా తక్కువ సందర్భాల్లో వస్తుంది, కానీ ఎక్కువ సందర్భాల్లో చాలా సమయం పడుతుంది.

ఎందుచేతనంటే? భూమి మీద వారికి అనుకూలమైన జన్మనివ్వడానికి అర్హత కలిగిన తల్లులు అంటే స్త్రీలు చాలా తక్కువ మంది ఉంటారు. కానీ పై లోకాలలో జన్మ తీసుకోవాలని చూసేటటువంటి ఆత్మలు కోటానుకోట్లు వుంటాయి. అందుచేత జన్మ అన్నది అంత తేలికగా రాదు అని తెలుసుకోవాలి.

పత్రిగారు ఏమనేవారంటే? నేను 2500 సంవత్సరముల క్రితం బుద్ధుడి దగ్గర ఆనందుడిగా ఉండేవాడిని. తరువాత జన్మలో బెంజమిన్ ఫ్రాంక్లిన్‌గా అమెరికాలో, ఇంకొక జన్మలో ఒరిస్సాలో, ఇంకొక జన్మలో హాజరత్ ఇనాయత్ ఖాన్‌గా హైదరాబాద్‌లో వున్నాను. ఇప్పుడు పత్రిగా బోధన్‌లో జన్మించడం జరిగిందని చెప్పారు.

అప్పుడు పత్రి గారిని నేను అడిగాను, ఏమండీ మీరు బుద్దుడు దగ్గర ఆనందుడిగా వున్నది 2500 సంవత్సరాల క్రితం కదా? ఏకంగా అప్పటి నుండి చూస్తే! ఇప్పుడు మీరు తీసుకున్న జన్మ 2500 సంవత్సరాలు అయ్యింది. ఇంత టైమ్ ఎందుకు పట్టింది? అని అడగడం జరిగింది. అప్పుడు ఆయన ఏమన్నారంటే? నువ్వేదో చాలా టైమ్ పట్టిందని అనుకుంటున్నావు! నువ్వే కనుక పైకి వెళ్ళి చూస్తే ఇదంతా సముద్రంలో కాకిరెట్టతో సమానం అన్నారు.

దాని అర్థం నీకు భూమి మీద వందల సంవత్సరాలు పట్టినట్టుగా అనిపించవచ్చు, కానీ పై లోకాల నుంచి చూస్తే ఇది రోజులతో సమానం. పెద్ద లెక్కేమీ కాదు అని అన్నారు.

అప్పుడు నాకు జన్మలు అన్నవి తేలికగా రావు అన్న సంగతి అర్థమైంది. మరి వచ్చిన జన్మను వృథా చేస్తే ఎంత జీవితం మనం వేస్ట్ చేసుకుంటున్నట్టు? ఆలోచించండి?

అంతేకాదు చనిపోయిన తరువాత వారిని తీసుకు వెళ్ళడానికి సహాయకులు వస్తారు అని తెలుసుకున్నాం. అలాగే అన్నిటి మీద మమకారం వున్నవాడు, వారిని తీసుకు వెళ్లడానికి వచ్చిన సహాయకుల కూడా వెళ్లరు, అక్కడే వుండిపోతారు, ప్రేతాత్మ అయిపోతారు అని తెలుసుకున్నాం.

అంతే కాదు సహాయకులు వెళ్ళిపోగానే, వారిని తీసుకు వెళ్ళడానికి తెరచుకున్న ఆత్మద్వారాలు మూసుకుపోతాయి, వారు పైకి వెళ్ళలేక, ఇక్కడ అంటే భూమి మీద ఏమి చేయాలో తెలియక, కొన్ని వందల, వేల సంవత్సరాల పాటు ఉండిపోతారు. ఎందుచేతనంటే? వారి కుటుంబ సభ్యులు వారిని పట్టించుకోరు. అలా భూమి మీద ఏమీ చేయలేక, చెట్ల మీద, గోడల మీద, వంతెనల మీద కూర్చుని దిక్కులు చూస్తారు. పై లోకాలకు వెళ్ళే దారి తెలీదు, అలా ప్రేతాత్మ అంటే దెయ్యంగానే వుండిపోతారు.

కానీ ఎప్పటికో వాడికి అనిపిస్తుంది. ఇంక నేను ఇక్కడ ఉండలేను, పై లోకాలకు వెళ్ళిపోతాను అనే బలమైన కాంక్ష కలిగినప్పుడు, పై లోకాల నుంచి ఎవరో ఒకరు వచ్చి వాడికి దారి చూపించి తీసుకుని వెళ్తారు. అంతకు మించి వాడికి వేరే అవకాశం లేదు.

వారికి కొన్నాళ్ళు బాగానే వుంటుంది. అక్కడే తిరుగుతూ, అందరినీ చూస్తూ, తన ఇంటిని, తన ఆస్తులను చూస్తూ కాలం గడిపేస్తాడు, కానీ ఎన్నాళ్ళు వుంటాడు? ఎన్నాళ్ళు చూస్తాడు? తన వాళ్ళంతా వాళ్ళ పనిలో వారు వుంటారు, మెల్లిగా వీడిని మర్చిపోతారు కూడా! ఒకవేళ వాళ్ళు వీడిని గుర్తుంచుకున్నా వీడు ఏమి చేయగలడు? టైమ్ వేస్ట్ చేసుకోవడం తప్ప.

కానీ "మరణించక ముందే మరణిస్తే!" అంటే చనిపోయాక పై లోకాలకు

వెళ్ళాలని తెలుసుకుంటే? సహాయకుల కూడా పై లోకాలకు వెళ్ళిపోతే! కొన్ని వందలే కాదు, వేల సంవత్సరాలు సమయం వృధా కాకుండా చేసుకో గలుగుతారు.

కానీ మరణానంతరం గురించి తెలుసు కోవడం వల్ల, కుటుంబం మీద అంటే భార్య మీద, భర్త మీద, పిల్లల మీద, బంధువుల మీద, ఆఖరికి ధనం మీద, సంపదల మీద మమకారం పోతుంది. చనిపోయిన తర్వాత సహాయకుల కూడా పై లోకాలకు వెళ్ళిపోతాడు.

చనిపోయిన తరువాత జరిగే దాని గురించి అవగాహన లేకపోతే! జీవించి వున్న వారు చనిపోయిన వారి గురించి దుఃఖిస్తూ, అన్ని పనులు మానేసి, ఆత్మ అయిన తనకు చేసుకోవలసిన పనులు, ఆత్మకు లాభించే సాధనలన్నీ మానేసి ఏడుస్తూ కూర్చుంటారు. బ్రతుకంతా ఏమిటి ఇలా అయిపోయింది? దేవుడు నన్ను ఇలా చేసాడు? నేను ఎన్నో పూజలు చేసాను, కానీ ఆయన నాకు ఇంత అన్యాయం చేసాడు అనుకుంటూ బాధపడతారు.

అంతేకాదు నా జీవితంలో నేను ఎవ్వరికీ అన్యాయం చేయలేదు, నేను ఏ పాపం చేయలేదు. నాకే ఎందుకు ఇలా జరిగింది? అని వాపోతారు. అదే కొంచెం వయస్సులో వున్న వారు చనిపోతే! ఈ వయస్సులోనే వెళ్ళిపోయాడని చెప్పి ఏడవడమే తప్ప ఇంకేమీ వుండదు, వారి బ్రతుకంతా ఏడుపే. డబ్బు వుంటుంది, ఎన్నో సౌకర్యాలు వుంటాయి, అన్నీ వుంటాయి, కానీ ఎన్ని వున్నా ఏడుపే! ఇలా వుండే కంటే చచ్చిపోవడం మంచిది అనుకుంటారు.

కానీ నేను ఆత్మను అన్నది తెలుసుకుంటే! ఎవరైతే నాకు మరణం లేదు అన్నది తెలుసుకుంటే! ఈ కుటుంబం మీద, ధనం మీద, సంసారం మీద వున్న మమకారం పోతుంది. వారి కోసం తప్పులు, పాపాలు చేయరు. తమ భవిష్యత్తును పాడుచేసుకోరు.

కానీ నేను ఆత్మను అన్నది తెలుసుకుంటే! ఎవరినైతే నా వాళ్ళు, నా వాళ్ళు అనుకుంటారో వారు తన వాళ్ళు కాదు అన్నది కూడా తెలుస్తుంది. అసలు వాళ్ళకి తనకు సంబంధం లేదు అన్న విషయం కూడా తెలుస్తుంది.

అర్జునుడు తెలుసుకున్నాడు కదా? అభిమన్యునికి తనకు సంబంధం లేదని. శ్రీ కృష్ణుని వల్ల అర్జునుడు అభిమన్యుడు వున్న లోకాలకు వెళ్ళి అభిమన్యుని పలకరిస్తే నీవు ఎవరవు? అని అడిగాడు. అప్పుడు అర్జునునికి అర్థమైంది, చనిపోయిన వారితో వున్న వారికి సంబంధం వుండదని.

ఇలా ఎంతో మంది అప్పటి దాకా వాళ్ళే నా వాళ్ళు అనుకుంటారు కానీ మరణం తర్వాత వీరు నా వారు కాదు అనేది తెలుస్తుంది. అందుకే శంకరాచార్యుల వారు ఏం చెప్పారంటే?

**"కాంతే కాంతా కస్తే పుత్రః**
**సంసారో యమతీవ విచిత్రః**
**కస్య త్వం కః కుత ఆయాతః**
**తత్వం చింతయ తదిహ భ్రాతః**
అని ఎంతో స్పష్టంగా చెప్పారు.

తా:- నీ భార్య ఎవరు? నీ కుమారుడు ఎవరు? చాలా విచిత్రమైనది ఈ సంసారం. అసలు నీవెవరివాడివి? ఎక్కడి నుండి వచ్చావు? సోదరా ఈ లోకంలో ఎప్పుడైనా సరే ఈ తత్వ విచారణ చేయి అని చెప్పారాయన.

ఆయన ఏమన్నారంటే? అసలు వాళ్ళకి నీకు ఏ సంబంధం లేదు. ఈ విచారణ చేస్తే అప్పుడు నీకు అర్థమవుతుంది అన్నారు.

సంబంధం లేని వాళ్ళ కోసం తప్పులు చేస్తున్నావు; అసలు నువ్వు ఎవరో తెలుసుకోవట్లేదు, నువ్వు ఏం చేయాలో తెలుసుకోవట్లేదు, అందుచేత ఈ ఆత్మతత్వ విచారణ చేయమని చెప్పారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే !

**కస్త్వం కోహం కుతః ఆయాతః**
**కామే జననీ కామే తాతః**
**ఇతి పరి భావయ సర్వమ సారం**
**విశ్వం తత్వ స్వప్న విచారం** అని అన్నారు.

తా:- నేనెవర్ని? నేను ఎక్కడి నుంచి వచ్చాను? నా యొక్క తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? సారహీనమైన, స్వప్న తుల్యమైన ఈ విశ్వాన్ని, ఈ విధమైన విచారణ ద్వారా విడిచి పెట్టాలి అని శంకరాచార్యుల వారు చెప్పారు.

అంతేకాదు "మరణించక ముందే మరణిస్తే" ఇంకా ఎన్ని విషయాలు

తెలుసుకుంటామో చూడండి. అంటే మరణించిన తరువాత జరిగే దాని గురించి మనం తెలుసుకుంటే! అసలు జరిగేదంతా సినిమాలాంటిదే, కలలాంటిదే అని తెలుస్తుంది. అప్పుడు ఏమనుకుంటారంటే? ఇప్పటి దాకా జరిగేదంతా నిజమేనని అనుకున్నాను. కానీ ఇదంతా కలలాంటిదే అన్న మాట అని తెలుసుకుంటారు.

ఎందుచేతనంటే? మరణించిన తరువాత శరీరం వదిలేస్తారు. శరీరంతో పాటు అన్నీ వదిలేసి వెళ్ళిపోతారు. అంటే ఏమీ వుండవు, ఎవరూ వుండరు అన్నమాట. కానీ జీవించి వున్నంత సేపూ ఇదంతా నిజమనుకున్నాను, ఏమీ నిజం కాదన్న మాట అన్నది తెలుస్తుంది. అందుచేత కష్టపడి సంపాదించినవన్నీ, కూడబెట్టినవన్నీ, నాది నావి అనుకున్నవన్నీ తనవి కావని, తన కూడా రావని తెలుసుకుంటారు. సంపదలతో పాటు పదవులు, హోదా, ఉన్నతమైన ఉద్యోగాలు, బిరుదులు, అవార్డులు ఎంత గొప్పవయినా సరే కూడా రావని, ఆత్మ అయిన తనకు ఉప యోగపడవని తెలుసుకుంటారు.

అందుచేత ప్రతీ ఒక్కరూ వేటి కోసం సమయం అంతా వెచ్చిస్తున్నారో! అవేమీ మీ కూడా రావు, మీకు ఉపయోగపడవు అని తెలుసుకోండి, వాటి వెనకాల పడకండి, వాటి కోసం ప్రయత్నించకండి, వాటి కోసం పాపాలు చేయకండి.

సినిమా హీరో! చిరంజీవి వంద సినిమాలు చేసి ఎంతో గొప్పవాడిని అనుకుంటాడు. వంద కాదు ఐదు వందల సినిమాలు చేసినా ఏమీ ఉపయోగం వుండదు. ఎవడో గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కి ఇంక నా కన్నా గొప్పవాడు ఎవరూ లేరు అనుకుంటాడు, వాడు గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కినా, ఏ బుక్‌లోకి వెళ్ళినా ఏమిటి ఉపయోగం? ఆ శరీరం వుండదు, ఆ పేరు వుండదు. చివరకు వాడే వుండడు, మళ్ళీ ఇంకొక శరీరంతో, ఇంకొక పేరుతో వస్తాడు.

అందుచేత ఇది అర్థమైన వారు వాటికోసం ఒక జీవితం ఎందుకు వృథా చేస్తారు? అందుచేత పదవులు కానీ, పెద్ద హోదా కానీ, ఏదైనా సరే ఏమి వుంటుంది? చెప్పండి? నేను చీఫ్ మినిస్టర్ చేసాను అంటాడు. ఏ చీఫ్ మినిస్టర్ వున్నాడు? ప్రైమ్ మినిస్టర్ చేసానంటాడు ఏ ప్రైమ్ మినిస్టర్ వున్నాడు? ఆ పదవులు ఏమైనా పట్టుకుని వెళతారా? ఎవరూ పట్టుకు వెళ్ళలేరు? అలాగే

నేను కలెక్టర్‌ను అంటాడు, ఎస్.పి.నంటాడు ఏమి వుంటాయి? ఏమీ వుండవు.

చివరికి చనిపోయిన తరువాత ఇవన్నీ కలలో లాగా మాయమైపోతాయి. ఏవీ వుండవు. అంటే జీవితమన్నది పగటి కల అని అర్థమవుతుంది. వేటి మీద వ్యామోహాలు, ఆశాలు, భ్రాంతులు అన్నీ పోతాయి.

అంతేకాదు "మరణించక ముందే మరణించినవారు" ఈ జీవితం ఒక కలలాంటిది అని అర్థం చేసుకుంటారు. చూడండి కలగంటున్నంతసేపు నిజమే అనిపిస్తుంది. కలలో జరిగేటటువంటి సంఘటనలు, కష్టాలు, బాధలు అన్నీ జరుగుతున్నట్టుగానే ఉంటుంది. కానీ కల అయిపోతే ఏమీ వుండదు. అన్నీ మాయమైపోతాయి.

చూడండి కలలో రాజు, కల అయిపోతే రాజు ఉండడు. వాడి రాజ్యము వుండదు. అలాగే కలలో చీఫ్ మినిష్టర్, కల కంటున్నంత సేపూ ఆ రాష్ట్ర అధికారమంతా వాడిదే. అధికారులు అంతా వంగి వంగి నమస్కారాలు చేస్తారు, ఎంతో హోదా ప్రదర్శిస్తాడు. కానీ కల అయిపోతే ఏమీ ఉండదు, అన్నీ ఆ కాసేపే. అలాగే ఈ జీవితంలోనివి కూడా కలలాంటివే.

అది రాత్రి కల, ఇది పగటి కల. గుర్తు పెట్టుకోండి. ఇప్పుడు జరిగేది పగటి కల. రాత్రి కల ఒక రాత్రితో అయిపోతుంది. పగటి కల ఒక జీవితంతో అయిపోతుంది. మొత్తం మీద ఇది కూడా ఒక కలే. మెలకువ రాగానే రాత్రి కలలోనివి వుండవు, చనిపోగానే జీవితంలోనివి ఏవీ వుండవు. అందుచేత ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని జీవించడం నేర్చుకోండి, మీరు ఎంతో లాభం పొందుతారు.

అవేమీ ఆత్మ అయిన తనకు ఉపయోగపడవు. చివరకు తాను చేసే కర్మల ఫలితమే తన కూడా వస్తుందని తెలుసుకుంటాడు. పాపం చేస్తే? ఆ పాప ఫలితం వస్తుంది, పుణ్యం చేస్తే పుణ్య ఫలితం వస్తుంది. జ్ఞానం సంపాదిస్తే ఆ జ్ఞానమే నాకు లాభిస్తుంది అన్నది తెలుసుకుంటాడు.

అందుచేత మనకు ఏది లాభకరమో చూసుకోవాలి. అవి చేసి వాటి ఫలితం పొందే ప్రయత్నం చేయాలి. అందుచేత అన్నిటికన్నా తనకు లాభించేది జ్ఞానం కాబట్టి, ఆ జ్ఞానం సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయాలి. అంటే పత్రిగారు చెప్పినటువంటివన్నీ పాటించడమే! అంతకన్నా ఏమీ లేదు.

అంతేకాదు “మరణించకముందే మరణిస్తే” ఇంకొక విషయం కూడా అవగాహనలోకి వస్తుంది. ఏమిటంటే? కొంతకాలం ఉండే ఈ జీవితం ఒక నాటకమని అర్థం అవుతుంది. ప్రతి ఒక్కరూ కొంతకాలమేగా ఉండేది. ఇప్పుడు చూడండి. కరోనా వచ్చాక మనకు తెలిసి ఎంతమంది వెళ్ళిపోయారు? వాళ్ళంతా కొంతకాలమే వున్నారు. చివరకు నిష్క్రమించారు.

చూడండి నాటకంలో పాత్రధారి వస్తాడు, కాసేపు హడావిడి చేస్తాడు. మళ్ళీ కనిపించడు. అలాగే ఈ జీవితంలో ఎంత హడావిడి చేసినా, ఎన్ని గొప్ప పదవులు పొందినా చివరకు మళ్ళీ కనిపించడు. చనిపోయాక ఈ జీవితం కూడా ఒక నాటకం అన్న సంగతి అర్థం అవుతుంది.

ఇదే షేక్స్పియర్ చెప్పినటువంటి సందేశం “ఆల్ ద వరల్డ్ ఈజ్ ఏ స్టేజ్, ఉయ్ ఆర్ ఆల్ మియర్ యాక్టర్స్, డిస్ట్రక్ట్ అండ్ ఫ్యూమ్, డు అవర్ పార్ట్ అండ్ దెన్ డిపార్ట్”. ఈ విషయమే పత్రిగారు అస్తమానూ చెబుతారు. ఆయన ఏమంటారంటే? నాయనా “మీరు నాటకంలో ఒక పాత్రధారి, అసలు ఈ ప్రపంచమే ఒక నాటక రంగం, మనమంతా అందులో పాత్రధారులం, కొంతకాలం వుండి మన పాత్ర పోషించి నిష్క్రమిస్తాము” అని ఎన్నిసార్లు చెప్పారో పత్రిగారు.

అలాగే సినిమాలో యాక్ట్ చేసేవారు భర్తగా, భార్యగా యాక్ట్ చేస్తారు. సినిమా పూర్తి అయితే ఎవరి దారిన వారు వెళ్లిపోతారు. చూడండి సినిమాలో హీరోయిన్‌ని ముద్దు పెట్టుకుంటే ఏం మాట్లాడదు. కానీ బయట ఎక్కడైనా ముద్దు పెట్టుకుంటాను అంటే ఊరుకుంటుందా? ఊరుకోదు.

ఇదీ అంతే! భర్త... భర్త పోర్షన్ వేస్తున్నాడు. భార్య.. భార్య పోర్షన్ వేస్తుంది. నాటకం అయిపోయాక అంటే జీవితం అయిపోయాక ఎవరి దారిన వారు పోతారు. అలాగే కొంతమంది గెస్ట్ ఆర్టిస్టులు వుంటారు, తొందరగా వెళ్ళిపోతారు. అలాగే కొంతమంది తొందరగా శరీరాన్ని వదిలేస్తారు. నాటకం లాంటి జీవితంలో వెళ్ళకుండా ఎలా వుంటారు? అందుచేత జీవితం ఒక నాటకం అని తెలుస్తుంది. అందుచేత మరణానంతరం గురించి తెలుసుకుంటే ఎన్నో లాభాలు పొందవచ్చు.

# మరణానంతర జీవితం తెలుసుకుంటే మరికొన్ని లాభాలు

మరణానంతర జీవితం మీద అవగాహన ఉంటే జీవితంలో ఇంకా ఎన్నో లాభాలు కలుగుతాయి. ముఖ్యంగా పుట్టుక ఎంత సంబరమో, చావుని కూడా అంతే సంబరంగా భావించగలుగుతారు.

అంతేకాదు మరణం గురించి వశిష్ఠులవారు యోగ వాశిష్టంలో ఏమన్నారంటే? ఆత్మజ్ఞాని అంటే ఆత్మ జ్ఞానం పొందినవాడు **"పాత దేహాన్ని వదిలి కొత్త దేహాన్ని ధరించడం అన్నది నూతన మహోత్సవంగా భావిస్తాడు"** అన్నారు.

ఆత్మజ్ఞాని చావుని అంటే అలాంటి కొత్త దేహాన్ని లభింప చేసే మరణం సంభవిస్తే దుఃఖించడు, సంతోషిస్తాడు అని చెప్పడం జరిగింది.

ఈ సందర్భంగా పత్రీజీ తిరుపతిలో జరిగిన ఒక సంఘటన చెప్పారు. ఆయన ఓ పుట్టినరోజు ఫంక్షన్‌కి చాక్లెట్లు పట్టుకెళ్లి సగం ఇచ్చి సగం ఉ ంచుకున్నారట. ఎందుకు ఉంచుకున్నారు అని అడిగితే! పత్రీజీ ఆవిడకి ఇప్పుడు పుట్టినరోజు ఫంక్షన్ చేస్తున్నారు అందుకని సగం ఇచ్చాను, కాసేపటికి చనిపోవచ్చు మిగతావి అప్పుడు ఇస్తాను అని చెప్పారట. అప్పుడు వాళ్లు కంగారు పడిపోయారట.

అప్పుడు ఆయన పుట్టుక పండగే, మరణం పండగే, అది ఉత్సవమే, ఇది ఉత్సవమే అలా తీసుకోవడమే జ్ఞానం అని చెప్పడం జరిగిందట.

అందుకే వశిష్ఠులవారు పాత దేహాన్ని వదిలి కొత్త దేహాన్ని ధరించడం నూతన మహోత్సవంగా భావించాలన్నారు. ఎందుచేతంటే చిరిగిపోయిన వస్త్రాన్ని వదిలి కొత్త వస్త్రాన్ని ధరించడం నూతన మహోత్సవం కాక ఇంకేమవుతుంది చెప్పండి. కొత్త బట్టలు వేసుకున్నవాడు ఎంత సంబర పడతాడు.

చూడండి పండగ రోజుల్లో అందరూ కొత్త బట్టలు వేసుకుని ఎంత సరదాగా, సంతోషంగా ఉంటారో! ఆ కొత్త బట్టలు వేసుకుని అందరికీ చూపిస్తారు. నా డ్రెస్సు ఎలా ఉంది? నా బట్టలు ఎలా ఉన్నాయి? అని అడుగుతూంటారు. వాళ్లు ఆ పండగ రోజు వాళ్ల బట్టలు అందరూ చూడాలని

సినిమాలకి వెళ్తారు, చిన్న చిన్న పార్టీలకి వెళ్తారు, నలుగురిలో తిరగడానికి ప్రయత్నం చేస్తారు.

అంటే కొత్త బట్టలు వేసుకోవడం అన్నది ఎంత సంతోషం కలిగించే విషయంగా భావిస్తారు. అలాగే కొత్త దేహం తీసుకోవడం కూడా ఒక మహోత్సవంగా భావించాలి అని వశిష్ఠుల వారి సందేశం. చూడండి పాత వస్త్రాలు వదిలేయడానికి ఎవడూ బాధపడడు, అలాగే ఆత్మజ్ఞాని పాత దేహం వదలడానికి బాధపడడు.

అందుకే సదానంద యోగి మూడు రోజులు ముందు పత్రీజీని పిలచి... నాయనా సుభాష్ నేను మూడురోజుల్లో దేహాన్ని వదిలేస్తున్నాను, నా దేహాన్ని ఖననం చేయడానికి ఏదైనా ప్రదేశం చూడు అన్నారట. అప్పుడు పత్రీజీ అన్నీ తిరిగి నందవరంలో సెలెక్ట్ చేశారు.

ఆయన అన్న టైంకి శరీరం వదిలేశారట. ఆయన సరదాగానే శరీరాన్ని వదిలేశారు. అందుకే 'యోగులు చెప్పి చస్తారు, భోగులు చెబితే చస్తారు' అంటారు.

ఎందుచేతనంటే? భోగులు మంచి ఆస్తులు, సంపదలు సంపాదించు కున్నవారు కాబట్టి. అన్నిటి మీద మమకారం వుంటుంది. వాళ్లకు జబ్బు చేసినప్పుడు డాక్టర్ చెక్ చేసి సీరియస్ గా ఉంది వెళ్ళి పోతాడు అని దగ్గర వాళ్లందరికి చెబుతాడు. ఈ విషయం వాడికి కూడా తెలుస్తుంది. ఎప్పుడైతే ఆ విషయం తెలుస్తుందో వాడికి భయం పట్టుకుంటుంది. వాడికి ఉన్నవన్నీ గుర్తొస్తాయి అమ్మో నేను ఎన్నో సంపాదించుకున్నాను, అవన్నీ ఏమై పోతాయి! ఇంకా నా వాళ్ళకి ఏమి ఏర్పాట్లు చేయలేదు, ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి? అనేది ఆలోచన వచ్చేసరికి ఒక్కసారిగా భయం కలిగి వారం రోజుల తరువాత ఆగే గుండె అప్పుడే ఆగిపోతుంది. అందుకే 'భోగి చెబితే చస్తాడు' అంటారు.

అంతేకాదు వశిష్ఠులవారు ఏమన్నారంటే! **"కొత్త దేహం ధరించడం నూతన మహోత్సవంగా భావిస్తారని"** అన్నారు. మీరు చూడండి పాత దేహం ముసలది అయిపోయినపుడు, తన పని తాను చేసుకోలేక పోతుంది, ప్రతిదానికి ఎవరో ఒకళ్ళ మీద ఆధారపడవలసి వస్తుంది. ఎప్పుడైతే ఒకళ్ళ మీద ఆధార పడతారు. అంతేకాదు ఆ స్థితిలో లేని రోగాలన్నీ మీద పడతాయి, వాళ్లకి

సంపాదించే శక్తి కూడా కోల్పోతారు, ఏది కావాలన్నా పిల్లల మీద ఆధారపడాలి. పిల్లలు కొన్నాళ్ళు బాగానే చూస్తారు, కాని తర్వాత, తర్వాత నిర్లక్ష్యం చేస్తారు, వాడు ఏదైనా అడిగితే చిరాకు పడతారు, ఇంకా కొంతమంది అది కూడా భరించలేక వృద్ధాశ్రమాలలో వేసేస్తారు. ఎంతో డబ్బున్న వాళ్లు కూడా తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాల్లో వేయడం చూస్తున్నాం.

బాగా బ్రతికినవారు అలాంటి పరిస్థితి వస్తే ఎంతో బాధపడతారు, ఎప్పుడు చనిపోదామా అని ఎదురు చూస్తూ ఉంటారు, తీసుకు వెళ్ళిపొమ్మని దేవుడ్ని ప్రార్థిస్తారు. చూడండి అలాంటి పరిస్థితి వచ్చినవారికి చావు పండగలాంటిదే కదా?

కాని ఆత్మ జ్ఞానికి అన్నీ తెలుసు, చనిపోయిన తరువాత ఏమి జరుగుతుందో కూడా తెలుసు, తాను ఆత్మ, తనకు చావులేదని కూడా తెలుసు, చావు అంటే శరీరాన్ని, ప్రదేశాన్ని మార్చడమని తెలుసు.

అంతేకాదు తానుచేసిన ధ్యాన సాధనవలన, తాను పొందిన జ్ఞానం వలన తనకు ఉన్నతలోకం ప్రాప్తిస్తుందని తెలుసు. తాను ఇంకా గొప్పస్థితి పొందుతానని తెలుసు. అందుచేత చావుకు భయపడడు, చావు తనకు లాభం కలిగించేదేనని తెలుసుకున్నవాడు జ్ఞాని.

అందుచేత ఆత్మజ్ఞాని చావును లెక్కచెయ్యడు, శరీరాన్ని వదిలి పెట్టడం ఒక నూతన మహోత్సవంగా భావిస్తాడు. అదే వశిష్టుల వారు చెప్పింది.

ఆత్మ శరీరాన్ని వదిలితే మళ్లీ కొత్త శరీరం వస్తుంది చూడండి పని చేయలేని ముసలి శరీరాన్ని వదిలి కొత్త శరీరాన్ని ధరించడం పండగకాక మరేమిటి?

అందుకే పత్రిగారు నీకు చావు ఎక్కడ ఉంది? ఈ శరీరం వదిలేస్తే మళ్లీ కొత్తది వస్తుంది, దానికి ఎందుకు బాధపడతావు? అంటారు.

కొత్త శరీరంతో ఆ కుటుంబంలో నైనా జన్మించొచ్చు, లేకపోతే ఇంకో కుటుంబంలో నైనా జన్మించొచ్చు. అలా కొత్త శరీరంలో ప్రవేశించి తొమ్మిది మాసాలు పూర్తయిన తర్వాత జన్మ తీసుకున్నాడు అనుకోండి అప్పుడు చూడండి వాడి వైభవం ఎలా ఉంటుందో! పుట్టినప్పటినుంచి వాడు అడక్కుండానే పాలు

పట్టిస్తూ ఉంటారు, అంతకుముందు ముసలి శరీరంతో వున్నపుడు, అడిగినా కూడా చిరాకుపడేవారు. అంతేకాదు మెల్లి మెల్లిగా ఎదుగుతూ వుంటే! పాలు, బిస్కెట్లు ఏదైనా సరే అడక్కుండానే ఇస్తారు.

గతంలో వీడికి నిద్ర పట్టక ముసలి వయసులో ఏదైనా చిన్న జబ్బు వుండి దగ్గుతూ ఇబ్బంది పడుతూ ఉంటే తిట్టేవారు. అదే చిన్న ఇల్లు అయితే ఉన్న వాళ్లకు నిద్ర పట్టదు. నువ్వు పడుకోవు, మమ్మల్ని పడుకోనివ్వవు అని చిరాకు పడతారు. కానీ కొత్త శరీరం తీసుకున్నప్పుడు ఏడుస్తూ వుంటే వుయ్యాలలో వేసి ఊపుతారు, లేదా వీళ్లు నిద్ర మానేసి ఒళ్ళో వేసుకుని ఊర్కోబెట్టి నిద్ర పుచ్చడానికి ఎన్నో తిప్పలు పడుతూ ఉంటారు.

మరి చూడండి కొత్త శరీరం తీసుకున్న వాళ్లకి ఎంత వైభవంగా వుంటుందో! ఆలోచించండి! ఇది ఆత్మజ్ఞానికి తెలుసు, అందుచేత పాత శరీరాన్ని వదిలేయడానికి వాళ్లేమీ బాధపడరు. అది వారికి మహోత్సవమే, కారణం కొత్త శరీరం వస్తుందికాబట్టి. అప్పుడు వుండేది బ్రహ్మాండమైన జీవితం.

మరి ఎవరైతే ధ్యానం చేస్తారో! జ్ఞానం సంపాదించుకుంటారో వారు అసలు బాధపడవలసిన పని ఏమీ లేదు. కారణం ఇంకా గొప్ప జన్మ వారు పొందగలుగుతారు. అందుచేత అది మహోత్సవంగానే భావిస్తారు. అందుకే వశిష్టులవారు అలా చెప్పడం జరిగింది. అందుచేత అలాంటి కొత్త దేహాన్ని లభింపచేసే మరణం సంభవిస్తే ఆత్మజ్ఞాని సంతోషిస్తాడు. పుట్టుక ఎంత సంబరమో! మరణం కూడా అంత సంబరం అని భావిస్తాడు.

అలాగే వశిష్టులవారు ఇంకా ఏం చెప్పారంటే? "నేను మరణిస్తాను... మరణిస్తాను... మరణిస్తాను అని ఎందుకు అనుకుంటావు? మరణం తర్వాత కూడా నేను వుంటాను.... వుంటాను... వుంటాను అని ఎందుకు అనుకోవు?" అంటారు. కాబట్టి మీరు మరణిస్తాను అని అన్నారంటే అజ్ఞానమే అవుతుంది. మరణించిన తర్వాత కూడా నేను వుంటాను... వుంటాను... వుంటాను అనే సత్యాన్ని ఎవడైతే తెలుసు కుంటాడో వాడు ఆత్మజ్ఞాని కింద లెక్క.

గుర్తుపెట్టుకోండి వశిష్టులవారు ఇంకో విషయం చెప్పారు. "ఆత్మను తెలుసుకున్న ఆత్మజ్ఞాని మరణాన్ని, జీవితాన్ని, జన్మను శిథిల తృణాలుగా అంటే

ప్రాముఖ్యం లేని వాటిగా చూస్తారు."

మరణాన్ని పెద్ద ప్రాముఖ్యమైన దానినిగా చూడడు. అలాగే జన్మను, జీవితాన్ని ప్రాముఖ్యం లేని వాటిగా చూస్తారు. అటువంటి ఆత్మజ్ఞాని ఇచ్ఛారహితుడై అంటే కోరికలు లేనివాడై, వాసనా శూన్యుడై అంటే గతంలోని అలవాట్లు, గుణాలు ఏవీ ఉండవు. ఆత్మజ్ఞుడై అంటే ఆత్మ స్థితిలో ఉంటూ పైకి మాత్రం ఏమి తెలియని వాడిలా కనిపిస్తాడు. పర్వతంలా నిశ్చలంగా ఉంటాడు. ఏం జరుగుతున్నా, ఏం అవుతున్నా జన్మకు కాని, జీవితానికి కాని, లేకపోతే చావుకు కానీ ప్రాముఖ్యం ఇవ్వడు. కారణం ఇవన్నీ సహజంగా జరిగేవే అని తెలుసుకుని వున్నవారు కాబట్టి.

జ్ఞానికి ఇంకా ఏమి తెలుసంటే "పుట్టిన వాడు గిట్టక మానడు, గిట్టినవాడు పుట్టక మానడు" అని తెలుసుకున్నవాడు. ఇంకా ఎందుకు వాటి గురించి పెద్ద ఆలోచన. అందుచేత వశిష్టుల వారు ఈ మరణం గురించి ఇవన్నీ చెప్పడం జరిగింది.

అందుచేత మరణం సంభవించిన తర్వాత అజ్ఞానంలో ఉన్నవాళ్లు భూమి మీదే ఉండిపోయి ప్రేతాత్మలై వందల సంవత్సరాలు వృధా చేసుకుంటారు. కానీ జ్ఞానం ఉన్నవాళ్లు పైలోకాలకు వెళ్లి ఎన్నో తెలుసుకుంటారు. ముఖ్యంగా ఈ సృష్టిలో భూలోకం కాకుండా వున్న లోకాల గురించి కొంత అవగాహన పొందుతారు. అక్కడ వాళ్ళకి జనాలోకం దాటి ఉన్న గొప్ప లోకాలైన మహా లోకం, తపోలోకం, సత్యలోకం చేరుకోవాలి అన్న అవగాహన కలుగుతుంది.

ఆ అవగాహన ఎవరికి వుంటుందో వాళ్లు భూమ్మీదికి వచ్చినప్పుడు అటువంటి లోకాలు పొందడం కోసం ప్రయత్నం చేస్తారు. అలాంటి ప్రయత్నం చేస్తున్న వాళ్ళమే మనమంతా.

ఇక్కడ మరొక విషయం తెలుసుకుందాం. చనిపోయిన తర్వాత పాపాలు చేసే వాళ్ళని తీసుకువెళ్ళడానికి పితృ దేవతలు వస్తారని చెప్పుకున్నాం. అలాగే ధ్యానం చేస్తూ జ్ఞానం సంపాదించుకున్న వాళ్ళని చనిపోయిన తర్వాత తీసుకు వెళ్ళడానికి యోగులు వస్తారని చెప్పుకున్నాం.

అంటే జనాలోకం కింద లోకాల్లో ఉన్న వాళ్లని తీసుకెళ్లడానికి పితృ

దేవతలు, అలాగే జనాలోకం దాటి  ఉన్న వాళ్లని తీసుకెళ్లడానికి యోగులు వస్తారని మనం చెప్పుకున్నాం. ఈ విషయం మనకి పత్రి గారు చెప్పారు. ఇక్కడ పితృ దేవతలు అంటే మనకంటే ముందు చనిపోయి ఆ లోకాల్లో వుండే వాళ్లనే పితృ దేవతలు అంటారు.

మన తాతలు, ముత్తాతలు ఇంకా పై పై తరాల వాళ్ళు,  వాళ్ళ జన్మ కోసం ఎదురు చూస్తూ అక్కడే వుంటారు. వాళ్ళకి ఇలాంటి పనులు పురమాయించ బడతాయి. సృష్టిలో వుండే ఏర్పాటు అది.  అలాగే ఎవరైతే ధ్యానం చేసి, గొప్ప స్థితికి చేరుకుని  పైలోకాల్లో వుంటారో! వాళ్ళని యోగులు అంటారు.

నేను ఒకసారి  పత్రి గారిని అడిగాను.  ఏమండీ? చనిపోయిన తర్వాత యమ భటులు అని సినిమాల్లో  చూపిస్తారు, కాని మనం సహాయకులు అని చెప్పుకుంటున్నాం, మరి ఈ సహాయకులు ఎవరండీ? అని అన్నాను. అప్పుడు పత్రిగారు సహాయకులు అంటే ఎవరో కాదు, పితృ దేవతలు అని చెప్పారు.

అందుచేత ఎవరైతే పాపాలు, పుణ్యాలు చేస్తూ ఉంటారో! వాళ్ళని తీసుకు వెళ్ళడానికి మాత్రమే పితృదేవతలు వస్తారు. వీళ్ళంతా జనాలోకం క్రింద వున్న లోకాలకి తీసుకెళ్లే వాళ్ళు. ఎవరైతే జనాలోకం దాటి వున్న గొప్ప లోకాలకి వెళ్ళే అర్హత సంపాదిస్తారో! వాళ్ళని తీసుకెళ్లడానికి పితృ దేవతలు రారు యోగులే వస్తారు. ఎందుచేతనంటే?  పై లోకాలకు తీసుకు వెళ్లాలి అంటే? ఆ లోకాల్లోంచి వచ్చిన వాళ్లే తీసుకెళ్లాలి.

అలాగే పై లోకాలకు మనం చేరుకోగలిగితే అక్కడ గొప్ప వాళ్ల సాంగత్యం మనం పొందగలుగుతాము. గొప్ప వారి సాంగత్యం పొందడమే కాదు, మనకు ఇంకొక ఛాయిస్ కూడా వుంటుంది. ఎలాంటి జన్మ కావాలంటే అలాంటి జన్మ ఎంచుకునే అవకాశం వుంటుంది. అలాంటి జన్మ తీసుకుని భవిష్యత్తుని ఇంకా బాగా తీర్చిదిద్దుకో గలుగుతాము.

ఎందుచేతనంటే? అటువంటి వాళ్ల సాంగత్యం లభించడం వల్ల, అక్కడ కూడా ఎంతో జ్ఞానాన్నీ సంపాదించుకుంటూ,  ఆధ్యాత్మికంగా, ఆత్మ పరంగా ఎంతో ఎదగడానికి అవకాశం వుంటుంది.

పత్రిగారు భూమిమీద కూడా అటువంటి సజ్జన సాంగత్యం చేయాలంటారు. కారణం గొప్ప వాళ్ల యొక్క సాంగత్యం చేస్తే ఆ విషయాలన్నీ తెలుస్తాయి కాబట్టి.

అందుకే శంకరాచార్యుల వారు "త్రిజగతి సజ్జన సంగతి రేకా, భవతి భవార్ణవ తరణే నౌకా" అన్నారు. అంటే మూడు లోకాల్లో కూడా ఇటువంటి దుఃఖాల నుంచి బయట పడాలి అంటే సజ్జన సాంగత్యాన్ని మించింది లేదు అన్నారు.

మనం అటువంటి సాంగత్యం భూమిమీద చేయాలి, పై లోకాలకు వెళ్ళినా అక్కడా చెయ్యాలి. ఎందుచేతనంటే? ఎవ్వరైనా సరే ఆ పై లోకాలు పొందే అర్హత సంపాదించాలి. దానికి కాస్త తీవ్రంగా కృషి చేయాలి, అంటే తీవ్ర సాధన చేయాలి, జ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలి, జ్ఞానుల సాంగత్యం చెయ్యాలి, ఆత్మ సేవలు చేయాలి. అలా చేస్తే ఖచ్చితంగా ఊర్ధ్వలోకాలు చేరే అర్హత సంపాదిస్తాం.

అందుచేత గుర్తు పెట్టుకోండి ఇప్పుడు మనందరం ఆ పనే చేస్తున్నాం. ప్రతి రోజూ Zoom లో రెండున్నర గంటలు నిశ్శబ్దంలో "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తున్నాం. అంతేకాదు అవకాశం ఉన్నప్పుడల్లా ధ్యానం చేస్తున్నాం. ఇది మనకు ఒక కాలక్షేపం అయిపోయింది, ఇంకోక గొడవ లేదు. నిజంగా మంచి అదృష్టమే కదా? అందుచేత తప్పని సరిగా జ్ఞానాన్నీ పెంచుకుందాం, ఆ గొప్ప లోకాలకి చేరుకుందాం, ఈ జన్మ లోనే ఆ స్థాయి సంపాదిద్దం. జనాలోకం దాటితే చాలు, సాత్విక స్థితే దాటితే చాలు ఊర్ధ్వలోకాలూ వెళ్లి తీరుతాం.

అందుచేత తీవ్ర ధ్యాన సాధన చేద్దాం, ఆహార నియమాలు ఖచ్చితంగా పాటిద్దాం.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.130/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) - రూ.130/-
9) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) - రూ.130/-
10) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.130/-
11) ధ్యాన శక్తి - రూ.130/-
12) తెలుసుకోండి - రూ.130/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
14) మరణించకముందే మరణించాలి - రూ.130/-
15) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.130/-
16) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
17) గీతాసందేశం - రూ.100/-
18) కర్మ సిద్ధాంతం - రూ.80/-
19) ధ్యానమంటే ? - రూ.80/-
20) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
21) జ్ఞాన జ్యోతి - రూ.70/-
22) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
23) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
24) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
25) త్రివిధాలు - రూ.60/-
26) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
27) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
28) అతీంద్రియ శక్తులు - రూ.60/-
29) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.60/-
30) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.60/-
31) భూతదయే దైవత్వం - రూ.60/-
32) ఆలోచించండి - రూ.60/-
33) షిరిడీ సాయి సందేశాలు - రూ.60/-
34) సంకల్పమంటే? - రూ.50/-
35) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
36) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
37) నిర్వాణ మార్గం - రూ.50/-
38) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
39) మౌన ధ్యానం - రూ.40/-
40) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
41) శాకాహారమే మానవాహారం - రూ.15/-
42) అహింస మరియు శాఖాహారం - రూ.15/-

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా.
సెల్ : 9440309812, 9490171853



# యోగుల సందేశాలు

ఆత్మజ్ఞాని "పాత దేహాన్ని వదిలి కొత్త దేహాన్ని ధరించడం అన్నది
నూతన మహోత్సవంగా భావిస్తాడు" - వశిష్ఠ మహర్షి

ఆత్మజ్ఞాని "మరణించక ముందే మరణిస్తాడు" -
ఆత్మజ్ఞానికి "పుట్టుకా సంబరమే! చావు సంబరమే!"
- బ్రహ్మర్షి పత్రీజీ

"ఏ చావుకి ప్రపంచం భయపడుతూ ఉంటుందో!
దాన్ని పొందడం లోనే నాకు ఆనందం ఉంది" - కబీర్

"ప్రాణం వున్న శవంలా జీవించడం నేర్చుకో!
అప్పుడే నీకు ప్రభు దర్శనం అవుతుంది,
అంటే ఆత్మ దర్శనం అవుతుంది" - దాదు మహాత్ముడు

"నేను నిత్యమూ మరణిస్తూనే వుంటాను" - సెయింట్ పాల్ సువార్త

శ్వాస మీద ధ్యాస వుంచి ధ్యానం చెయ్యండి,
జ్ఞానవంతమైన పుస్తకాలు చదవండి,
జ్ఞానులతో సాంగత్యం చెయ్యండి, ధ్యానమార్గంలో సేవలు
చెయ్యండి. జ్ఞానం సంపాదించుకోండి. అప్పుడు ఆత్మ అయిన
మీకు ఉన్నత లోకప్రాప్తి కలుగుతుంది.

రూ.130/-

- తటవర్తి వీరరాఘవరావు